www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 | సంచిక : 223 | మంగళవారం 05-02-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

ఉపాధికి గ్రహణం

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)కు ఈ ఏడాదీ నిధుల కొరత తప్పేటట్టు కనిపించటం లేదు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఈ ఏడాది జనవరికే ఖర్చైపోయాయి. ఇప్పటికీ ఉపాధి కార్మికుల వేతన బకాయిలు రూ.10 వేల కోట్లకుపైగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో కేటాయింపులను పెంచాల్సిన కేంద్రం భారీగా కోత విధించింది. రూ.88 వేల కోట్లకుగానూ 2019-20 మధ్యంతర (ఓట్ ఆన్ అకౌంట్) బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లతో సరిపుచ్చింది. బడ్జెట్‌కు నెల రోజుల ముందే 250 మంది ఎంపీ, ఎమ్మెల్యేలు, ఆర్థికవేత్తలు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు బడ్జెట్‌లో ఉపాధి కేటాయింపులను పెంచాలన్న విన్నపాన్ని సైతం మోడీ సర్కార్ తోసిపుచ్చటం గమనార్హం.



- ★ వెంటాడుతున్న నిధుల కొరత
- ★ కావాల్సింది రూ.88 వేల కోట్లు
- ★ బడ్జెట్‌లో కేటాయింపు రూ.60 వేల కోట్లే
- ★ ఏటా పేరుకుపోతున్న వేతన బకాయిలు

న్యూఢిల్లీ : గ్రామీణ పేదరికం నిర్మూలనలో అత్యంత కీలకమైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ ఆర్ఈజీఎస్)పై మోడీ సర్కార్ శీతకన్ను వేస్తోంది. దేశాభివృద్ధిలో క్రియాశీలకమైన గ్రామీణాభివృద్ధిని కేంద్రం విస్మరిస్తున్నట్లుగా స్పష్టమవుతోంది. ఈ నెల ఒకటిన ఆర్థికశాఖ ఇన్‌చార్జి మంత్రి

- మిగతా 2 లో

దొందూ దొందే

పశ్చిమ బెంగాల్ పరిణామాలపై సీపీఐ

న్యూఢిల్లీ : కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం దొందూ దొందే అన్న రీతిలో వ్యవహరిస్తున్నాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పేర్కొన్నది. పశ్చిమ బెంగాల్ పరిణామాలపై సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటన ఇలా ఉన్నది. కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం దేశంలోని రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకునేందుకు సీబీఐ, ఈడీ, ఐటీ వంటి విభాగాలను విశృంఖలంగా దుర్వినియోగం చేస్తోంది. మమతాబెనర్జీ నాయకత్వంలోని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం కూడా అంతే సమానంగా అప్రజాస్వామికంగా

- మిగతా 2 లో

రూ.2.25 లక్షల కోట్లతో

నేడు రాష్ట్ర బడ్జెట్

- ఎన్నికల తాయిలాలకు పెద్దపీట
- బీసీలు, రైతులు, మహిళలు, మైనార్టీలే లక్ష్యం
- 11.45 గంటలకు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న యనమల



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర విభజన అనంతరం ప్రతి ఏటా భారీగా పెరుగుతూ వస్తున్న ఏపీ బడ్జెట్ ఈసారి కూడా అదేస్థాయిలో ఉండబోతోంది. అయితే ప్రస్తుత శాసనసభ కాలపరిమితి జూన్ నాటికి ముగియనుండడంతో కేవలం 4 నెలలకే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఎన్నికల తర్వాత ఏర్పడే ప్రభుత్వమే పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సి వుంటుంది. అయితే ఏడాది కాలానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్ తరహాలోనే సమర్పించి నాలుగు నెలల ఖర్చుల ఆమోదానికి సభలో ప్రవేశపెడతారు. సుమారు రూ.2.25 లక్షల కోట్ల మేర అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించినట్లు తెల్సింది. మంగళవారం ఉదయం 11.45 నిముషాలకు ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. ఏప్రిల్‌లో సాధారణ ఎన్నికలు జరుగనున్నందున బడ్జెట్‌లో ఎన్నికల తాయిలాలకే అధిక ప్రాధాన్యతనిచ్చినట్లు తెల్సింది. ముఖ్యంగా తెలంగాణా ప్రభుత్వం, ఇటీవల కేంద్రప్రభుత్వం ప్రకటించిన తరహాలో రైతులకు మేలు చేసే అంశాలకు బడ్జెట్‌లో చోటు కల్పించారు. అలాగే ఇప్పటికే సామాజిక ఫించన్లు రూ.1000 నుండి రూ.2వేలకు పెంచడం, మరోవైపు డ్వాక్రా మహిళలకు పసుపు-కుంకుమ కింద రూ.10వేల చొప్పున ఆర్థిక

- మిగతా 11 లో

పార్లమెంట్‌లో **కోల్‌కతా కుదుపు**
ఉభయ సభలు నేటికి వాయిదా 9లో

పసుపు కుంకుమలో **ఉద్రిక్తత**
లాఠీచార్జీ, గాలిలో కాల్పులు 11లో

కొండపల్లికి **పూర్వ వైభవం**
సీఎం చంద్రబాబు నాయుడు 12లో

సాక్ష్యాలతో రండి
సీబీఐకి సుప్రీం ఆదేశం 12లో



మాట్లాడుతున్న డి.రాజా, ఆజాద్, చంద్రబాబు తదితరులు

ఓట్లను పోల్చిచూడండి

- ఈవీఎంలలో అవకతవకలపై సీఈసీకి విపక్షాల ఫిర్యాదు
- పాల్గొన్న 23 పార్టీల ప్రతినిధులు

న్యూఢిల్లీ: ప్రతిపక్ష పార్టీల నేతలు సోమవారం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ)ని కలిసి ఈవీఎంలలో అవకతవకలపై ఫిర్యాదు చేశారు. పోలైన ఓట్లలో కనీసం 50 శాతం వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించాలని, రెండు యంత్రాల ఫలితాలను పోల్చి చూడాలని కోరారు. ఈవీఎంలపై నివేదికను సీఈసీకి అందజేశారు. మొత్తం 23 పార్టీల ప్రతినిధులు ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఇతర ప్యానల్ సభ్యులతో భేటీ అయ్యారు. ఈవీఎంలో లోపాలకు సంబంధించి నివేదికను సీఈసీకి అందించారు. బ్యాలెట్ పేపర్ వ్యవస్థ కోసం విపక్షాలు తొలుత డిమాండు చేయగా అది కుదరదని ఈసీ స్పష్టంచేసింది. దీంతో వారు ఈవీఎంలు, వీవీప్యాట్‌ల ఫలితాలను పోల్చి చూడాలని డిమాండు

- మిగతా 2 లో

అదే హైడ్రామా

- సీఎం మమత నిరవధిక దీక్ష
- పశ్చిమ బెంగాల్‌లో అలజడి
- సుప్రీంలో సీబీఐ పిటిషన్
- నేడు విచారణకు ధర్మాసనం అంగీకారం
- కేంద్రంపై ప్రాంతీయ పార్టీల మండిపాటు
- అఖిల పక్షానికి సీపీఐ డిమాండు



న్యూఢిల్లీ: సమాఖ్య వ్యవస్థ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ పేరిట.. పశ్చిమ బెంగాల్ సీఎం చేపట్టిన వీధిపోరాటం... దేశవ్యాప్తంగా ప్రకంపన సృష్టిస్తోంది. రాజకీయ కక్షతో కేంద్రం... ఆత్మరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం తలపడుతుంటే... దర్యాప్తు సంస్థలు బజారు పాలవుతున్న వైనాన్ని కోల్‌కతాలో దీదీ దండాగిరి నిరూపిస్తోంది. ప్రతిపక్షాలపై ఉసిగొల్పుతూ సీబీఐ, ఈడీ, ఐటీ శాఖలను కేంద్రం భ్రష్టుపట్టించగా... పశ్చిమ బెంగాల్‌లో పోలీసు వ్యవస్థను టీఎంసీ తన గుప్పెట్లో బిగించింది. మోడీ సర్కారు పదే పదే సీబీఐని అస్త్రంగా ప్రయోగించటాన్ని ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండిస్తున్నారు. కానీ మమత బెనర్జీ కూడా మోడీ తరహాలోనే వ్యవస్థలను నిర్వీర్యం

- మిగతా 2 లో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగన్

ఏపీలో 60 లక్షల

నకిలీ ఓట్లు

ఈసీకి వైసీపీ అధినేత జగన్ ఫిర్యాదు

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఏకకాలంలో పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈసీ) సునీల్ అరోరాను వైసీపీ అధినేత, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోరారు. చాలా మందికి రెండు రాష్ట్రాల్లో ఓట్లు ఉన్నందునే ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నానని చెప్పారు. సోమవారం ఢిల్లీలో సీఈసీతో భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమావేశ వివరాలను తెలి పారు. ఆంధ్రప్రదేశ్‌లోని అధికార తెలుగుదేశం పార్టీ (టీడీపీ) 60లక్షల నకిలీ ఓట్లను సృష్టించిందని, వాటిని తొలగించాలని సీఈసీని కోరినట్టు తెలిపారు. ఏప్రిల్-మే నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్రమ మార్గాల్లో ఆర్జించిన కోట్లాది రూపాయలను మొత్తం 175 నియోజక వర్గాల్లో పంచేందుకు ఏపీలోని టీడీపీ ప్రభుత్వం

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఎన్ఆర్ఐ జయరామ్ హత్యకేసులో

వీడిన మిస్టరీ

- ప్రధాన నిందితుడు రాకేష్‌రెడ్డి
- మరో ముగ్గురికి కూడా సంబంధం
- పట్టించిన సీసీ కెమెరా ఫుటేజీ
- విష ప్రయోగం కాదు... గుండెలపై మోదే
- నేడు కోర్టులో నిందితులను హాజరుపరిచే అవకాశం



విశాలాంధ్ర - నందిగామ : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పారిశ్రామికవేత్త, కోస్టల్ బ్యాంకు ఎండీ చిగురుపాటి జయరామ్ హత్య కేసులో మిస్టరీ వీడింది. కృష్ణా జిల్లా ఎస్పీ త్రిపాఠి నేతృత్వంలోని దర్యాప్తు

- మిగతా 11 లో

సమ్మెకు ఆర్టీసీ కార్మికులు

సిద్ధం



మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై అజయ్ కుమార్, వైవీ రావు, మధు, చలసాని తదితరులు

- సీపీఐ, సీపీఎం మద్దతు
- ప్రభుత్వానిదే బాధ్యత: రామకృష్ణ
- ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొంటాం: మధు
- నష్టాలను బూచిగా చూపిస్తోంది: జేఏసీ కన్వీనర్ దామోదరరావు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: ఏపీఎస్ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 6వతేదీ నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెకు తమ పూర్తి మద్దతు ఉంటుందని సీపీఐ, సీపీఎం రాష్ట్రకార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధు వెల్లడించారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏపీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా రవాణా పరిరక్షణ-ప్రభుత్వ బాధ్యత, మెరుగైన వేతన సవరణ అంశాలపై ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు అధ్యక్షతన సోమవారం సదస్సు జరిగింది. సదస్సులో రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్ల కాలంలో ఆర్టీసీ అభివృద్ధికి కేటాయించిన నిధులు శూన్యమన్నారు. కేరళ, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ప్రజారవాణా వ్యవస్థను పటిష్టపర్చేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో వేలకోట్ల రూపాయిలు నిధులు కేటాయిస్తుంటే ఇక్కడ ఆర్టీసీ, విద్యుత్‌శాఖ వంటి వాటిని ప్రైవేటుపరం చేసే దిశగా ప్రయత్నించడం దారుణమన్నారు. ఆర్టీసీలో సమ్మె జరిగితే అందుకు పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలోని ఇతర శాఖల్లో ఉన్న ఉద్యోగుల కంటే ఆర్టీసీ కార్మికులే ఎక్కువగా శ్రమచేస్తారన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇచ్చే కంటే ఆయా

- మిగతా 2 లో

మెక్సికో సరిహద్దుల్లో అమెరికా సైన్యం

వాషింగ్టన్ : మెక్సికో సరిహద్దులకు 3050 మంది సైనికులను పంపనున్నట్టు అమెరికా రక్షణశాఖ ఆదివారం ప్రకటించింది. ఈ సైన్యం సరిహద్దుల్లో 3 మాసాలు ఉంటుందని, వీరు అక్కడ వున్న కాలంలో 240 మీటర్ల కంచెను నిర్మించి సరిహద్దు గస్తీ దళాలకు మద్దతుగా ఉంటారని రక్షణశాఖ పేర్కొంది. కొత్తగా పంపే 3750 మంది సైనికులతో కలిపి మొత్తం సరిహద్దుల్లో 4350 మంది సైనికులు ఉంటారని పెంటగాన్ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. సైన్యం ప్రధానంగా అరిజోనా, కాలిఫోర్నియా, న్యూమెక్సికో, టెక్సాస్ రాష్ట్రాలలో నిఘా కెమేరాలను సెప్టెంబర్ 30 వరకు నిర్వహిస్తుంది. అలాగే సరిహద్దుల్లో 240 కి.మీ. పొడవున అదనంగా కంచెను నిర్మిస్తుందని సైనిక ప్రతినిధి తెలిపారు. మెక్సికో దక్షిణ సరిహద్దులో భద్రత కోసం సైనిక దళాలు కొనసాగే అవకాశముందని కూడా ఆయన చెప్పారు. అక్రమంగా సరిహద్దులగుండా ప్రవేశించే వలసదారులను సైన్యం నిర్బంధించబోదని, వారు కేవలం సరిహద్దు గస్తీ దళాలకు, వైమానిక కార్యకలాపాలకు, నిఘాకు, సాంకేతికపరమైన పనులను మాత్రమే నిర్వహిస్తారని అమెరికా అధికారులు తెలిపారు. మెక్సికో సరిహద్దుల్లో సైన్యాన్ని నియమించాలన్న నిర్ణయాన్ని గత అక్టోబర్‌లోనే పెంటగాన్ తీసుకుంది. అయితే పార్లమెంటు మధ్యంతర ఎన్నికల కారణంగా సైన్యాన్ని అక్కడకు పంపడం జాప్యం అయింది.



విశాలాంధ్ర ప్రపంచం

పాలస్తీనాకు అమెరికా సహాయం నిలిపివేత

వాషింగ్టన్ : పాలస్తీనాకు అమెరికా అందించే అన్నిరకాల సహాయాన్ని నిలిపివేసింది. అమెరికా అంతర్జాతీయ సహాయ ఏజెన్సీ వెస్ట్‌బ్యాంక్, గాజా ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు అందిస్తున్న సహాయాన్ని నిలిపివేసింది. టెర్రరిజం వ్యతిరేక చట్టం కింద ఈ సహాయాన్ని నిలిపివేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. విదేశీ సహాయాన్ని అందుకుంటున్న వారిపైన కొత్త చట్టం ప్రకారం కేసువేసే అవకాశం కూడా ఉన్నది. వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించుకొని తన కార్య కలాపాలు నిర్వహిస్తున్నది. దీనికి వ్యతిరేకంగా పాలస్తీనా ప్రజలు జరుపుతున్న పోరాటాన్ని దీర్ఘకాలంగా అమెరికా వ్యతిరేకిస్తూనే వస్తున్నది. అయితే అంతర్జాతీయ అభివృద్ధి ఏజెన్సీ కింద 60 మిలియన్ డాలర్లను పాలస్తీనా ప్రజల భద్రతా సేవలకి పంపుతున్నది. ఇజ్రాయిల్ సైనిక దళాలతో అమెరికా వెస్ట్‌బ్యాంక్‌లో కలిసి పనిచేస్తోంది. తమ సహాయాన్ని పొందుతూ యుద్ధ చర్యలకు పాల్పడే వారిపట్ల ఎలాంటి అలక్ష్యం వహించకుండా టెర్రరిజం వ్యతిరేక చట్టాన్ని గత ఏడాది అమెరికా కాంగ్రెస్ తీసుకువచ్చింది. ఈ కొత్త చట్టం కింద తమపైన కోర్టులో కేసువేసే అవకాశం ఉన్నందున సహాయాన్ని నిలిపివేయవల్సిందిగా తామే అమెరికా విదేశాంగశాఖకు లేఖ రాసినట్టు పాలస్తీనా అధారిటీ ప్రతినిధి తెలియజేశారు.



కోర్టులచుట్టూ తిరగవలసిన అవసరం తమకేమీ లేదని అదే సమయంలో అమెరికా సహాయమూ అవసరంలేదని ఆయన తెలిపారు. అమెరికా దాని నిర్ణయం అది తీసుకున్నది. అయితే వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో టెర్రరిజానికి వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ఆయన తెలియజేశారు.

వెనిజులకు అమెరికా సైన్యం?

వెనిజులలో నికొలస్ మదురొ ప్రభుత్వాన్ని దించివేసేందుకు అవసరమైతే సైన్యాన్ని అక్కడకు పంపేందుకు ఒక అవకాశాన్ని కూడా తాము యోచిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. సీబీఎస్ ఛానల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో వెనిజులకు సైన్యాన్ని పంపుతారా.. అని ప్రశ్నించగా అక్కడ ప్రతిపక్ష నాయకుడు జాన్‌గుయ్‌డొను తాము గుర్తించామని, మదురొ వైదొలగాలని కోరుతూ అంతర్జాతీయ ప్రచారాన్ని నిర్వహిస్తామని ట్రంప్ తెలిపారు. తనతో భేటీకి కొన్ని నెలలక్రితం మదురొ కోరారని, అయితే తాను తిరస్కరించానని ట్రంప్ అన్నారు. వెనిజులలో పేదరికం, నేరాలు పెరిగాయని ట్రంప్ అన్నారు. ఆఫ్ఘనిస్తాన్, సిరియాలలో అంతం అనేది లేకుండా యుద్ధాలు కొనసాగుతున్నాయని అందువల్ల అక్కడినుండి తన సైనిక దళాలను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు ట్రంప్ చెప్పారు. అయితే ఇరాక్‌లో మాత్రం తమ సైన్యం ఉండిపోయి ఇరాన్ వ్యవహారాలను పరిశీలిస్తుందని అన్నారు. సిరియా,ఆఫ్ఘనిస్తాన్‌లలో ప్రజలు విసిగిపోయారని, ఇప్పుడు శాంతిని కోరుకుంటున్నారని చెప్పారు. సిరియా నుండి 2వేల సైనిక దళాలు తిరిగి అమెరికాకు వస్తున్నాయని అన్నారు. అయితే అక్కడ రాజకీయ సంక్షోభం ఏర్పడటానికి అమెరికా కారణం అన్న అంశం ప్రపంచానికి తెలుసు. గుయ్‌డొను ట్రంప్ ప్రశంసించారు. అమెరికా సైనిక చర్యను తీసుకున్నట్లయితే మదురొకు మద్దతు తెలియజేసిన రష్యా, చైనా, టర్కీ క్యూబా, మెక్సికొ తదితర పలు దేశాలు మౌనం వహిస్తాయా? అన్న అంశాన్ని కూడా అంతర్జాతీయ పరిశీలకులు ఆలోచిస్తున్నారు. వెనిజులలో ఆర్థిక, సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు అంతర్జాతీయ సమాజం దృష్టి పెట్టాలని రష్యా విదేశాంగశాఖ ఆదివారం విజ్ఞప్తి చేసింది. అదే సమయంలో విధ్వంసకర జోక్యానికి పాల్పడవద్దని పరోక్షంగా అమెరికాను కోరింది.

ఈయూతో థెరిసా, కార్బిన్ చర్చలు



లండన్ : ఉత్తర ఐర్లాండ్ సరిహద్దును తెరిచివుంచేందుకు వీలుగా బ్రెగ్జిట్ ఒప్పందంలో మార్పులు చేయవలసిందిగా కోరేందుకు బ్రస్సెల్స్‌కు బ్రిటన్ ప్రధాని థెరిసామె, ప్రతిపక్ష లేబర్ పార్టీ నాయకుడు జెరిమికార్బిన్ వెళ్లనున్నారు. బ్రెగ్జిట్ సమస్యను పరిష్కరించేందుకు పాలక, ప్రతిపక్షనేతలు ఉమ్మడిగా కృషి చేయడం మంచి పరిణామం. బ్రెగ్జిట్ ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంటు ఆమోదించేందుకు వీలుగా ఈ మార్పులను ఇరువురు నేతలు కోరుతున్నారు. బ్రిటన్ ప్రజలు కోరినట్టుగా బ్రెగ్జిట్‌లో పొందుపరిచిన ఉత్తర ఐర్లాండ్ ఒప్పందంలో మరిన్ని మార్పులను యూరోపియన్ యూనియన్ నాయకులతో చర్చించి సాధించేలాగా కృషి చేయాలని నిర్ణయించినట్టు థెరిసా తెలిపారు. ఉత్తర ఐర్లాండ్ ఒప్పందంలో మార్పులను సాధించాలని కార్బిన్ కూడా అంగీకరించినట్టు ఆమె తెలిపారు. ఈ విషయంలో దేశ సమైక్యత అవసరమని, పార్లమెంటు సభ్యులంతా విభేదాలను విడనాడి ఉత్తమమైన బ్రెగ్జిట్ ఒప్పందం కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్‌ను యూరోపియన్ యూనియన్ తప్పక అంగీకరించాలని కోరేందుకే థెరిసా, కార్బిన్‌లు కృషి చేయాలని నిర్ణయించినట్టు ప్రధాని తెలిపారు. సండే టెలిగ్రాఫ్ పత్రికకు థెరిసా ఈ మేరకు లేఖ రాశారు. బ్రెగ్జిట్ విషయంలో కార్బిన్ తమకు ఓటు చేయకపోయినప్పటికీ ఉత్తర ఐర్లాండ్ సరిహద్దు సమస్యపైన తమతో కలిసి వస్తున్నారని చెప్పారు. లేబర్ పార్టీకి చెందిన ఇతర ఎంపీలకు కూడా ఇదేవిధంగా ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ వారం ప్రారంభంలో కార్బిన్ థెరిసాతో బ్రెగ్జిట్‌పైన 45 నిముషాలు మాట్లాడారు. ఐర్లాండ్ సరిహద్దు అంశంపైనేగాక ఇంకా వివిధ అంశాలపై చర్చించినట్టు కార్బిన్ చెప్పారని బీబీసీ వెల్లడించింది.

ఇస్తాంబుల్‌లో కమ్యూనిస్టు పార్టీల భేటీ



ఇస్తాంబుల్ : టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో ఐరోపాలోని ఇనిషియేటివ్ ఆఫ్ కమ్యూనిస్టు & వర్కర్స్ పార్టీల సమావేశం ఈనెల 16, 17 తేదీలలో జరగనున్నది. కమ్యూనిస్టు ఇనిషియేటివ్ కొత్త పోర్టల్ ఎస్‌ఒఎల్ ప్రకారం ఈ సంస్థలోని కమ్యూనిస్టు పార్టీలు అన్నీ 2013 నుండి వివిధ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. టర్కీ కమ్యూనిస్టు పార్టీ ఆహ్వానం మేరకు ఈ సమావేశం జరుగుతోంది. కొమిన్‌టర్న్ వ్యవస్థాపక శతవార్షికోత్సవం సందర్భంగా ఈ సమావేశం జరుగుతుంది. ఇందులో 18 కమ్యూనిస్టు పార్టీలు పాల్గొంటాయి. 'కమ్యూనిజం' కోసం పోరాటం : 100 ఏళ్ల రాజకీయ వారసత్వం అన్న అంశంపై చరిత్రాత్మక సమావేశం జరగనున్నది. కమ్యూనిస్టు ఇనిషియేటివ్‌లో ఐరోపాలోని 30 రెవల్యూషనరీ కమ్యూనిస్టు & వర్కర్స్ పార్టీలు సభ్యులుగా ఉన్నాయి. ఐరోపా వ్యాప్తంగా అన్ని పార్టీలు కలిసి వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. కమ్యూనిస్టు ఇనిషియేటివ్ కార్యదర్శివర్గంలో టర్కీ కమ్యూనిస్టు పార్టీ ఉన్నది. ఈ సమావేశం చరిత్రలో కమ్యూనిస్టులు నిర్వహించిన పాత్ర, తాజా అంతర్జాతీయ పరిస్థితుల మీద చర్చించనున్నారు.

వెనిజులాలో ఈయూ జోక్యానికి సీపీ ఖండన

బ్రస్సెల్స్ : వెనిజులా అంతర్గత వ్యవహారాలలో ఈయూరోపియన్ పార్లమెంటు (ఈయూ) జోక్యం చేసుకోవడాన్ని గ్రీసు కమ్యూనిస్టు పార్టీ (కెకెఇ) తీవ్రంగా ఖండించింది. ఈయూ పార్లమెంటు సమావేశంలో కమ్యూనిస్టు నాయకుడు కొస్టాస్ పపడకిస్ మాట్లాడుతూ వెనిజులలో పెట్టుబడిదారుల ప్రతినిధులు జోక్యం చేసుకున్నారని, ఈ జోక్యాన్ని నిలువరించాలని కోరారు. ఆదేశ అంతర్గత వ్యవహారాలలో అమెరికా, యూరోపియన్ యూనియన్, నాటో జోక్యం చేసుకోవడాన్ని కొస్టాస్ తీవ్రంగా ఖండించారు. వీరితోపాటు లాటిన్ అమెరికా దేశాల జోక్యాన్ని కూడా ఆయన తిరస్కరించారు. తిరుగుబాటు ద్వారా ట్రంప్ తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని అక్కడ ఏర్పాటు చేసేందుకు కుట్రపన్నాడని ఆయన పేర్కొన్నారు. తమ ప్రమాదకరమైన సామ్రాజ్యవాద ప్రణాళికలను అన్నిచోట్ల అమలు జరిపేందుకు సైనిక జోక్యానికి కూడా వెనుకాడేదిలేదని ట్రంప్ బెదిరిస్తున్నారని, వీరిని అంతర్జాతీయ సమాజం అడ్డుకోవాలని కోరారు. జర్మనీ, స్పెయిన్, పోర్చుగల్ తదితర దేశాల వైఖరిని ఆయన ఖండించారు. గ్రీస్ ప్రభుత్వం ఈ వ్యవహారంలో మౌనం వహించింది. వెనిజుల ప్రజలు తమ ప్రయోజనాలను, తమ నాయకుడిని కాపాడుకునే బాధ్యతను తీసుకోవాలని ఆయన కోరారు. వెనిజుల ప్రజలకు, ప్రభుత్వానికి తమ సంఘీభావాన్ని ఆయన ప్రకటించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ, సంక్షోభాన్ని నేడు ప్రపంచ ప్రజలు ఎదుర్కొంటున్నారని కొస్టాస్ అన్నారు.





అదే హైడ్రామా

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. వేల కోట్ల శారదా చిట్‌ఫండ్ కంపెనీ కుంభకోణంలో బాధితులకు ఇంతవరకూ న్యాయం జరగలేదు. దర్యాప్తును ఏనాడో నీరుగార్చారు. ఈ కుంభకోణంలో టీఎంసీ నేతల పేర్లు వెలుగులోకి రావటమే కాదు... అనేక మంది కేసులను ఎదుర్కొంటున్నారు. నాలుగున్నర ఏళ్లు కళ్లు మూసుకున్న కేంద్రం ఇప్పుడు సీబీఐని ప్రయోగించటంతోనే అసలు సమస్య పక్కదోవ పడింది. పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను సీబీఐ ప్రశ్నించబోతే... సీఎం మమత బెనర్జీ ఎందుకు ఇంతగా స్పందించారు. ఏకంగా సమాఖ్య వ్యవస్థకే విఘాతం కలిగింటూ ధర్నాకు దిగటంలో మతలబు ఏమిటీ? ఆదివారం రాత్రి నుంచి మెట్రో సెంటర్‌లో బైఠాయించారు. దీంతో దేశవ్యాప్తంగా కలకలం రేగింది. మరోవైపు రాజీవ్‌కుమార్ సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించారని, ఆయన సాక్ష్యాలను ధ్వంసం చేశారని, తక్షణమే తమకు లొంగిపోయేలా ఆదేశించాలని సోమవారం సీబీఐ సుప్రీంకోర్టును అభ్యర్థించింది. ఐతే, ఆయనకు వ్యతిరేకంగా సాక్ష్యాలను ప్రవేశపెట్టాలని సుప్రీం ధర్మాసనం సీబీఐని ఆదేశించింది. ఇక కోల్‌కతాలో సోమవారం హైడ్రామా నడిచింది. సీఎం మమతకు టీఎంసీ శ్రేణులు మద్దతు పలికాయి. రైల్‌రోకోలు, రాస్తారోకోలతో అలజడి సృష్టించారు. మరోవైపు టీడీపీ, డీఎంకే, పీడీపీ, సమాజ్‌వాదీ పార్టీ... ఇలా వివిధ ప్రాంతీయ పార్టీలన్నీ మమతకు మద్దతు పలికాయి. కేంద్రం చర్యల్ని ఖండించాయి. ప్రజాస్వామ్య పరిరక్షణకు తన ప్రాణాలను సైతం వదులుతానని, కేంద్రంతో పోరాటంలో రాజీపడనని దీదీ భీష్మించారు. ఇంకో వైపు కేంద్ర సర్కారూ ఎదురుదాడికి దిగింది. అవినీతి పరులను రక్షించేందుకే మమత పోరాటం చేస్తున్నారని ప్రత్యారోపణకు దిగింది. పశ్చిమ బెంగాల్‌లో తాజా పరిస్థితిపై హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరా తీశారు. గవర్నర్ కేసరి త్రిపాఠి రహస్య నివేదిక పంపించారు. ఇటు కేంద్రం, అటు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరుగుతున్న ఈ జగడంలో పశ్చిమ బెంగాల్ ప్రజలు తల్లడిల్లే పరిస్థితి ఏర్పడింది. తక్షణమే అఖిల పక్షాన్ని ఏర్పాటు చేసి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి కేంద్రాన్ని డిమాండు చేశారు.

'ఉపాధి'కి గ్రహణం

(మొదటిపేజీ తరువాయి)

పీయూష్ గోయల్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2019-20 మధ్యంతర (ఓట్ ఆన్ అకౌంట్) బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించిన బీజేపీ, గ్రామీణ పేదలను మాత్రం విస్మరించింది. గ్రామాల్లోని పేదరిక నిర్మూలనలో భాగంగా ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. ఏడాదిలో కనీసం వంద రోజులపాటు పేదలకు ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకానికి రూ.88 వేల కోట్లు అవసరం ఉండగా, బడ్జెట్‌లో కేవలం రూ.60 వేల కోట్లనే కేంద్రం ప్రతిపాదించింది. అవసరానికంటే రూ.28 వేల కోట్లు తక్కువగా కేటాయించారు. దీనివల్ల అందరికీ ఉపాధి కల్పించడం కష్టమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఉపాధి హామీ పథకం కార్మికులకు వేతనాల చెల్లింపులో తరచూ జాప్యం జరుగుతోంది. కరవు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో గ్రామాల్లో వలసల నివారణ కోసం యూపీఏ ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని తెచ్చారు. మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఆ లక్ష్యాన్ని విస్మరించి బడ్జెట్ కేటాయింపులో కోత విధించడంతో దేశంలో మళ్లీ పేదరికం పెద్ద సమస్యగా పరిణమించే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకానికి రూ.55 వేల కోట్లను కేటాయించగా, సవరించిన బడ్జెట్‌లో అది రూ.61 వేల కోట్లకు చేరింది. సవరించిన అంచనాలతో పోల్చినా రూ.వెయ్యి కోట్ల కోత పెట్టారు.

ఎంపీల విన్నపాలకు విలువేదీ...

ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెంచాలని ఈ ఏడాది జనవరి మూడున 250 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఆర్థికవేత్తలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ప్రధాని మోడీకి స్వయంగా లేఖ కూడా రాశారు. వీరి విన్నపాన్ని మోడీ సర్కార్ ఏమాత్రం పట్టించుకోలేదు. సరి కదా, గతంకంటే నిధుల కేటాయింపును తగ్గించేసింది. పైపెచ్చు రూ.5 వేల కోట్లను అదనంగా కేటాయించామంటూ గొప్పలు చెప్పుకోవటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2018-19లో రూ.55 వేల కోట్లను కేటాయించగా, ఈ ఏడాది మార్చినాటకి రూ.61 వేల కోట్లు ఖర్చవుతుందని బడ్జెట్‌లో కేంద్రమే అంచనా వేసింది. ఆ విధంగా చూసినా ఆరేడు వేల కోట్ల రూపాయల లోటు ఉంటుంది. అంటే తాజా బడ్జెట్‌లో కనీసం రూ.88 వేల కోట్లు కేటాయిస్తే తప్ప బకాయిల చెల్లింపుతోపాటు కొత్త సంవత్సరంలో ఉపాధి హామీ పథకం అమలుకు నిధులు చాలవు. క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా, కార్పొరేట్‌లకు అనుకూలంగానే బడ్జెట్‌ను రూపొందించటం గమనార్హం.

వేతన బకాయిలే రూ.10 వేల కోట్లు

దేశంలో ఉపాధి హామీ పథకం కింద కార్మికుల వేతన బకాయిలే రూ.10 వేల కోట్లకు పైగా ఉన్నాయి. కేంద్ర ఆర్థికశాఖ పెండింగ్ బకాయిలను పరిగణనలోకి తీసుకోకుండా, కేటాయింపులను తగ్గించడం పథకం అమలుపై నీలినీడలు కమ్ముకునే ప్రమాదం ఉంది. గతేడాది డిసెంబరునాటికి ఉపాధి వేతన బకాయిలు రూ.7,600 కోట్లుండగా, ఈ సంవత్సరం జనవరి మూడో తేదీనాటికి కేటాయించిన నిధుల్లో 99 శాతం ఖర్చయినట్లు సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ఉద్యమకారుడు, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ నాయకుడు అరుణారాయ్ తెలిపారు. ఈ ఏడాది మార్చినాటికి బకాయిలు మరో ఐదారు వేల కోట్ల రూపాయలు పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించిన రూ.60 వేల కోట్లలో బకాయిలకే రూ.15 వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన రూ.45 వేల కోట్లతో గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడం సాధ్యపడకపోవచ్చని అరుణా రాయ్ వ్యాఖ్యానించారు. అత్తెసరు బడ్జెట్ కేటాయింపు ప్రభావం వేతనాల చెల్లింపుపై పడుతుందని చెబుతున్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని కేంద్రం చెప్పుకుంటున్నప్పటికీ, గ్రామీణ పేదలకు మాత్రం మొండిచెయ్యి చూపించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వేతనాల చెల్లింపు 35 శాతమే

ఉపాధి పథకం కింద పని చేసే కార్మికులకు సకాలంలో వేతనాల చెల్లింపు 35 శాతంగానే ఉంది. ఇటీవల ఒక స్వతంత్ర సంస్థ నిర్వహించిన సర్వేలో ఇది వెల్లడైంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో కార్మికులకు సకాలంలో 35 శాతమే వేతనాలు చెల్లించగా, కేంద్రం మాత్రం దానిని 85 శాతం చూపిస్తోందని తేలింది. రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ పథకాన్ని అమలు చేయాల్సి ఉంది. అయితే, కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని, నిధుల విడుదలలోనూ జాప్యం చేస్తోందన్న విమర్శలూ ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తున్నట్లు మరో సర్వేలో వెల్లడైంది. మరోవైపు వేతన బకాయిలు ఏడేళ్లగా పెరుగుతూ వస్తున్నాయి. గతంలో 10 శాతం వేతనాలు పెండింగ్ ఉండగా, తాజాగా అది 35 శాతానికి చేరింది. ఇదిలావుండగా, లేబర్ బడ్జెట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవటం కూడా నిధులు, వేతన బకాయిల విడుదలలో జాప్యం జరుగుతోందనే వాదన కూడా ఉంది.

పని దినాల పెరిగేనా...

దేశంలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. రైతుల ఆదాయం గణనీయంగా పడిపోతోంది. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగమూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పకడ్బందీగా ఉపాధి పథకాన్ని అమలు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఏడాదికి 100 రోజులపాటు ఉపాధి కల్పిస్తుండగా, కరవు, ప్రకృతి వైపరీత్యాలకు గురైన రాష్ట్రాల్లో దీనిని అప్పుడప్పుడు 150 రోజులకు పెంచుతున్నారు. ఏడాదిలో 150 రోజులపాటు పని కల్పించాలని, కరవు ప్రభావిత జిల్లాల్లో దానిని 200 రోజులకు పెంచాలనే డిమాండు ఉంది. ఈవేమీ పట్టించుకోకుండా ఉపాధికి అత్తెసరు నిధులు కల్పించడం వల్ల ఈ ఏడాది ఉపాధి లక్ష్యం నెరవేరే సూచనలు కనిపించడంలేదు.

దొందూ దొందే (మొదటిపేజీ తరువాయి)

స్పందిస్తోంది. శారద చిట్‌ఫండ్ కుంభకోణం నిందితులను కాపాడేందుకు దేశాన్ని ప్రచ్ఛన్నయుద్ధం వంటి పరిస్థితిలోకి నెట్టివేస్తోందని ఆ ప్రకటన విమర్శించింది. సంక్షోభాన్ని పరిష్కరించి దేశ ప్రజాతంత్ర స్వరూపాన్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్రానిది. శారదా కుంభకోణం అతి పెద్ద కుంభకోణమనీ దోషులను పట్టుకునేం దుకు పారదర్శక, స్వతంత్ర దర్యాప్తు అవసరమని పేర్కొన్నది. కేంద్ర, రాష్ట్ర సంబం ధాలను పునర్నిర్వచించేందుకు కేంద్రం తక్షణం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించా లని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం డిమాండు చేసింది.

ఓట్లను పోల్చిచూడండి

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. విపక్షాల నేతలు పార్లమెంటులో భేటీ అయి ఈ అంశంపై తమ కార్యాచరణను ముందుగానే నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సోమవారం సీఈసీతో భేటీ అయి ఈవీఎంలపై తమ అనుమానాలను వెల్లడించారు. భేటీ అనంతరం నాయకులు మీడియాతో మాట్లాడారు. ఈవీఎంలపై ప్రజలకు విశ్వాసం కల్పించాలని సీఈసీని కోరినట్టు తెలిపారు. 23 పార్టీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నట్టు వెల్లడించారు. సాంకేతికంగా ముందున్న దేశాలు సైతం బ్యాలెట్ పేపర్ పద్ధతే పాటిస్తున్నాయని గుర్తుచేశారు. పోలైన ఓట్లలో వీవీప్యాట్ స్లిప్పులు ఒక్కశాతం మాత్రమే లెక్కిస్తున్నారని చెప్పారు. ఈవీఎంలపై తమ అనుమానాలను, అభ్యంతరాలను గతంలో చాలాసార్లు చెప్పామన్నారు. తమ డిమాండ్లను విన్న సీఈసీ.. ఎన్నికల సంఘంలో చర్చించిన తర్వాతే తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తానన్నారని, సరైన నిర్ణయం తీసుకుంటారన్న నమ్మకం తమకుందని నాయకులు అన్నారు. ఈవీఎంలలో మరింత పారదర్శకత ఉండాలని సీఈసీని కోరినట్లు చెప్పారు. ఈ భేటీలో డి.రాజా (సీపీఐ), కాంగ్రెస్ నేతలు గులాం నబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గె, అహ్మద్ పటేల్, ఆనంద్ శర్మతో పాటు చంద్రబాబు నాయుడు (టీడీపీ), మజీద్ మెనన్ (ఎన్‌సీపీ), డెరెక్ ఓ'బ్రెయిల్ (తృణమూల్ కాంగ్రెస్), రామ్‌గోపాల్ యాదవ్ (ఎస్పీ), సతీశ్ చంద్ర మిశ్రా (బీఎస్పీ), ఒమర్ అబ్దుల్లా (ఎన్‌సీ), మహ్మద్ సలీమ్, టీకే రంగరాజన్ (సీపీఎం), మనోజ్ ఝా (ఆర్జేడీ), సంజయ్ సింగ్ (ఆప్), దానిశ్ అలీ (జేడీఎస్), ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ (ఆర్ఎస్పీ), బద్రుద్దీన్ అజ్మల్ (ఏఐయూడీఎఫ్), కేజీ కెన్‌యే (ఎన్‌పీఎఫ్) పాల్గొన్నారు.

సమ్మెకు ఆర్టీసీ కార్మికుల సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

స్థలాల్లో వాణిజ్య సము దాయాలు నిర్మించి అద్దెలకు ఇస్తే చాలా ఆదాయం వస్తుందన్నారు. ఆర్టీసీ యాజమాన్యం అద్దె బస్సులను తీసుకోవడం కేవలం ప్రైవేట్ వారికి లబ్ధి చేకూర్చడానికేనని విమర్శించారు. ప్రజల కోసం నిబద్ధతతో, నిజాయితీతో పనిచేసే ఆర్టీసీ కార్మికుల వేతనాలు పెంచేందుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం తగదని అన్నారు. టీడీపీ తిరిగి అధికారంలోకి వస్తే ప్రభుత్వాన్ని సైతం ప్రైవేటు సంస్థలకు అప్పగించే చేతగాని చర్యలకు పాల్పడేందుకు చంద్రబాబు వెనకాడరని చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో ఆర్టీసీలో 64వేలమంది ఉద్యోగులు ఉండగా నేడు ఆ సంఖ్య 53వేలకు ఎలా తగ్గిపోయిందని ప్రశ్నించారు. దీనిలో పెద్ద కుట్ర దాగి ఉందని రామకృష్ణ అన్నారు. మధు మాట్లాడుతూ రాజధాని గొప్పలు చెప్పుకునేందుకు, దొంగదీక్షలు చేసేందుకు కోట్ల రూపాయిల ప్రజాధనాన్ని సీఎం ఖర్చు చేస్తుండగా అంకితభావంతో పనిచేసే ఆర్టీసీ కార్మికులకు వేతనాలను ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం పింఛన్ల పెంపు, పసుపు కుంకుమల పేరుతో రాష్ట్రప్రజలను మరో సారి మోసం చేస్తోందని విమర్శించారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొనడమే కాకుండా ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ప్రజా మద్దతును కూడగడతామని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వానికి నాలుగున్నరేళ్ల కాలంలో పింఛన్ల పెంపు, పసుపు కుంకుమ ఎందుకు గుర్తుకు రాలేదని మధు ఎద్దేవా చేశారు. వైవీ రావు మాట్లాడుతూ హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యంగా భావించి విధిలేని పరిస్థితిలో ఈ నెల 6వతేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళుతున్నామన్నారు. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా జరిగే అన్ని సమ్మెల్లో ఏపీఎస్‌ఆర్టీసీ కార్మికులు పాల్గొంటారని తెలిపారు. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ నష్టాలకు కార్మికులు బాధ్యులు కారని యాజమాన్యం చెబుతూనే వేతనాల సవరణ అంశం చర్చకు వచ్చిన ప్రతిసారి ఆర్టీసీ నష్టాలను బూచిగా చూపిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో లేబర్ కమిషనర్ ఉన్నారో లేరో అన్న సందేహం కలుగుతోందన్నారు. సమ్మె నోటీసు ఇచ్చి నెలరోజులు గడుస్తోన్న కార్మిక సంఘాలతో చర్చలు జరపకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమ్మెకు అఖిలపక్షాల మద్దతు లభించిందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలన్నారు. సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని ప్రకటించారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్టీసీలో ఎనిమిది సంఘాలు ఏకత్రాటిపైకి వచ్చి సమ్మెలో పాల్గొనడానికి సిద్ధపడటం అభినందనీయమన్నారు. సమ్మెకు తమ మద్దతు ఉంటుందని చెప్పారు. ఎన్‌జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు న్యాయబద్ధమైనవన్నారు. సమ్మెకు మద్దతుగా నిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేఏసీ కోకన్వీనర్లు సీహెచ్ సుందరయ్య, వి.వరహాలనాయుడు, వై ఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు విశ్వనాథ రవి, ఈయూ పే కమిటీ సభ్యులు, ప్రజా సం ఘాలు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నకిలీ ఓట్లు

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధం చేసిందని జగన్ ఆరోపించారు. ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రజాస్వామ్యాన్ని ధిక్కరిస్తోందని, ఎన్నికల ప్రక్రియను ఓ ప్రహసనంగా మార్చిందని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని రాష్ట్రంలో ఎన్నికలు పారదర్శకంగా, నిజాయితీగా జరిగేలా చూడాలని సీఈసీని కోరానని జగన్ చెప్పారు. రాష్ట్రంలో 369 లక్షల మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతానికి 60లక్షల దాకా నకిలీ/చెల్లని ఓట్లు ఉన్నాయని, వీటిని తొలగిస్తేనే ఎన్నికలు పారదర్శకంగా జరిగే వీలు ఉంటుందని తెలిపారు. క్రమబద్ధమైన పద్ధతి ప్రకారం వైసీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తున్నారని జగన్ విమర్శించారు. టీడీపీ ఓ యాప్ సహాయంతో వైసీపీ సానుభూతిపరుల సమాచారాన్ని సేకరిస్తూ వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తోందని ఆయన ఆరోపించారు. రాజకీయం లబ్ధికోసం ప్రజా సాధికార సర్వే, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) డేటాబేస్, పరిష్కార వేదిక, పిరియాడిక్ సర్వేల పేరుతో వివరాలు తెలుసుకుని ఓట్లను టీడీపీ ప్రభుత్వం తొలగిస్తోందని తెలిపారు. భయపెట్టో.. బెదిరించో.. ఒత్తిడి తెచ్చో ఆయా ఓటర్ల పేర్లను జాబితాలో లేకుండా చేస్తోందని అన్నారు. ఓటర్ల ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాను ఓ వెబ్‌సైట్‌లో ఉంచిందని, ఇది ఓటర్ల వ్యక్తిగత స్వేచ్ఛను భంగం చేయడమే అవుతుందని, అధికార పార్టీ అనైతిక చర్యలకు పాల్పడుతోందని సీఈసీకి వెల్లడించినట్టు జగన్ తెలిపారు. టీడీపీ పాలనలో రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోందని, పోలీసు వ్యవస్థ దుర్వినియోగమవుతోందని తెలిపానన్నారు. టీడీపీ సానుభూతిపరులు, ఒక సామాజిక వర్గానికి చెందిన పోలీసు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ మిగతా వర్గీయులను నిర్లక్ష్యం చేస్తున్నట్టు సీఈసీ దృష్టికి తీసుకెళ్లినట్టు జగన్ వెల్లడించారు. తనకు అనుకూలంగా పనిచేసే పోలీసు అధికారుల ద్వారా రాజకీయ నేతల ఫోన్లను అక్రమంగా టాప్ చేయడం, కులాన్ని బట్టి పదోన్నతుల కోసం పోలీసు అధికారులను ఎంపిక చేయడం, రాజకీయ ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సేకరించడం, అక్రమ కేసులు బనాయించి విపక్షాలను వేధించడం వంటి చర్యలకు టీడీపీ ప్రభుత్వం పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. కొందరు సీనియర్ పోలీసులను ఎన్నికల విధుల్లో నుంచి తొలగిస్తున్నట్టు కూడా సీఈసీ దృష్టికి తీసుకెళ్లినట్టు జగన్ తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలి



• ధర్నాచౌక్‌లో సామూహిక కార్మికుల ధర్నా

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాలను తక్షణమే పెంచాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం సామూహిక ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ రాష్ట్రగౌరవ అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ, 15 ఏళ్లగా మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాల కోసం దశల వారీగా ఏఐటీయూసీ పోరాటం చేయడం వలనే ప్రభుత్వం స్పందించి నెలకు రూ.3 వేలు వేతనాన్ని పెంచిందని పేర్కొన్నారు. మహిళా కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా ప్రైవేటు సంస్థకు అప్పగించేందుకు కుట్ర చేశారన్నారు. ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల పథకాన్ని పరిరక్షిస్తున్న కార్మికులకు కనీస వేతనంతోపాటు ఉద్యోగభద్రత కల్పించాల న్నారు. మధ్యాహ్న భోజన పథకంలో మహిళా కార్మికుల సమస్యల పరిష్కారానికి శాసనమండలి వేదికగా తన వాణిని వినిపిస్తామని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాల పెంపు ఏఐటీయూసీ పోరాటంతోనే సాధ్యమైందన్నారు. నిరంతరం కార్మికుల పక్షాన ఏఐటీయూసీ నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్రఉపప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షులు కె.శైలజ, ప్రధానకార్యదర్శి ఎం.రమేష్‌బాబు, ఆఫీసు బేరర్స్ చాంద్‌భాష, అరుణ్, ధనలక్ష్మీ, విజయలక్ష్మీ, పెంకి లక్ష్మీ, బుచ్చిబాబు, మహబూబ్‌బీ, నాగాంజనేయులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి

విశాలాంధ్ర-విశాఖ సిటిబ్యూరో : ఫిబ్రవరి మొదటి వారంలో కూడా చలి వణికిస్తుంది. రాష్ట్రంపై తూర్పు, ఈశాన్య గాలుల ప్రభావం అధికంగా వుంది. దీంతో రాష్ట్రంలో చలి కొనసాగుతోంది. ఒడిశాలో అతి శీతల గాలులు (కోల్డ్‌వేవ్స్) వీస్తుండటం ఈపరిస్థితికి కారణమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంపైకి తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో సాధారణంకంటే పగటి ఉష్ణోగ్రతలు 1 నుంచి 3 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల చొప్పున తక్కువగా నమోదవుతున్నాయి. చలి ప్రభావం కనిపిస్తోంది. రాయలసీమకంటే కోస్తాంధ్రలో చలి తీవ్రత ఒకింత ఎక్కువగా వుంది. ఒడిశాలో కోల్డ్‌వేవ్స్ ప్రభావం పొరుగున వున్న ఉత్తరాంధ్రపై చూపుతోంది. దీంతో మిగతా జిల్లాల కంటే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో చలి ప్రతాపం అధికంగా వుంటోంది. రాష్ట్రంలోనే అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు విశాఖపట్నంలో 16 డిగ్రీలు (-4), కళింగపట్నంలో 16 డిగ్రీలు(-3) జంగమహేశ్వరపురంలో 16 డిగ్రీలు (-2) నమోదు కావడం విశేషం. మరికొద్ది రోజులు ఈ పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు పగటి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల మొదలవుతుందని పేర్కొంటున్నారు.


రాష్ట్రంలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు....

విశాఖపట్నం 16, అమరావతి 18, నందిగామ 18, బాపట్ల 18, తిరుపతి 19, కళింగపట్నం 16, జంగమహేశ్వరపురం 16, ఆరోగ్యవరం 17, నంద్యాల 18, కడప 18, అనంతపురం 19, కర్నూలు 19, విజయవాడ 19

ఏప్రిల్‌లోగా డ్యామ్ పనులు పూర్తి

ఎర్త్ వర్క్, కాంక్రీట్ పనులు వేగవంతం చేయాలి

పోలవరం సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం డ్యామ్ పనులు ఏప్రిల్ నెలాఖరు లోపు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మరో 3నెలలు మాత్రమే సమయం ఉందని, తరువాత మళ్లీ గోదావరిలో వరదనీరు వస్తుందని ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. పోలవరం పనులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ఎర్త్ వర్క్, కాంక్రీట్ పనులు ముమ్మరం చేయాలని, ఎడమ, కుడి కాలువ పనులు వేగం పుంజుకోవాలని సూచించారు. ఇందుకోసం రోజువారీ పనుల లక్ష్యాన్ని నిర్ణయించి, అనుకున్న లక్ష్యాలను అందుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పోలవరం పనులు, ఇతర సాగునీటి ప్రాజెక్టులపై ఉండవల్లి ప్రజావేదికలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వివిధ దశల్లో పోలవరం పనుల ఏ మేరకు పూర్తయ్యాయి, లక్ష్యాలు చేరుకున్నారా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్టు పనులు 65.04% పూర్తయ్యాయి. హెడ్ వర్క్స్ 55.37 శాతం పూర్తయ్యాయి. ప్రధాన డ్యామ్ ప్యాకేజీలో 54.9 శాతం పనులు పూర్తయ్యాయి. స్పిల్ వే, స్పిల్ ఛానల్‌కు సంబంధించి తవ్వకాల పనులు 1115 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 953 లక్షల క్యూబిక్ మీటర్లు అంటే 85.5 శాతం పనులు పూర్తయ్యాయి. కాంక్రీట్‌కు సంబంధించి 36.79 లక్షల క్యూబిక్ మీటర్లకుగాను ఇప్పటికే 23.75 లక్షల క్యూబిక్ మీటర్ల మేరకు అంటే 64.55 శాతం పనులు పూర్తి చేశారు. కాఫర్ డ్యామ్‌కు సంబంధించి 20.7 శాతం పనులు పూర్తి చేశారు. వీటిలో కొన్ని కీలక ఘట్టాల్లో పనులు ఇంకా వేగవంతం చేసి ఏప్రిల్ నెలాఖరుకు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

నాలుగు ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధం

మొత్తం 62 సాగునీటి ప్రాజెక్టుల్లో ఇప్పటికే 19 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని, ఇంకా మరో నాలుగు ప్రాజెక్టులు ఇక ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని సీఎంకు అధికారులు వివరించారు. కేఎల్‌రావు సాగర్, పులిచింతల ప్రాజెక్టు, కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టు, గొల్లపల్లి రిజర్వాయర్ దిగువన మడకశిర బ్రాంచ్ కెనాల్, అడవిపల్లి రిజర్వాయర్ సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఈ 4 ప్రాజెక్టుల వ్యయం రూ.3,665కోట్లు. ఇప్పటికే రూ.3,333కోట్లు ఖర్చుచేశాం. ఇంకా రూ.332 కోట్లు వ్యయం చేయాలి. ఈ 4 ప్రాజెక్టుల ద్వారా 1,70,090ఎకరాల కొత్త ఆయకట్టు, 13,40,772ఎకరాల స్థిరీకరణ జరుగుతుందని ముఖ్యమంత్రికి వివరించారు. ఇవిగాక 28,246 కోట్ల రూపాయలతో మరో 26 ప్రాజెక్టుల పనులు పురోగతిలో ఉన్నాయని, వీటి వల్ల 11,87,588 ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తున్నాయని, 23 లక్షల ఎకరాలకు పైగా స్థిరీకరణ అవుతాయని ముఖ్యమంత్రి తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు పనులపై సమీక్షిస్తూ టన్నెళ్ల పనులు ప్రతివారం ఎంత చేశారో చెప్పాలని ఆదేశించారు. మదనపల్లికి 5కిలోమీటర్ల దూరానికి కృష్ణా జలాలు చేరాయనీ, మంగళవారానికి 50క్యూసెక్కులు చేరతాయని అధికారులు వివరించారు. చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి 150క్యూసెక్కులు విడుదల అవుతున్నాయని, చిత్తూరు సరిహద్దుకు 85క్యూసెక్కుల నీరు, కుప్పానికి ఈనెల 25కల్లా నీరు చేరాలని ముఖ్యమంత్రి తెలిపారు. జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీ బీసీగర్జన విజయవంతం చేయండి

ప్రచార రథాల ప్రారంభంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 17న పశ్చిమ గోదావరిజిల్లా ఏలూరులో నిర్వహించనున్న బీసీగర్జన సభను విజయవంతం చేయాలని పార్టీ కృష్ణాజిల్లా కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన బీసీగర్జన ప్రచార వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ బీసీలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్నదే..వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి, వైసీపీ ఎమ్మెల్యే రక్షణనిధి, పార్టీ నేతలు కె.పార్థసారథి, సామినేని ఉదయభాను, మల్లాది విష్ణు, జోగి రమేష్, వెలంపల్లి శ్రీనివాస్, యలమంచిలి రవి, బీసీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

బాలుకు మాతృవియోగం



విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో: ప్రఖ్యాత సినీ నేపథ్య గాయకుడు, నెల్లూరు వాసి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తల్లి శకుంతలమ్మ(90) సోమవారం కన్ను మూశారు. ఆమె కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. దీనికి తోడు వృద్ధాప్యం కావడంతో సోమవారం ఉదయం నెల్లూరు తిప్పరాజువారి వీధిలోని వారి స్వగృహంలో ఆమె కన్నుమూశారు. ప్రస్తుతం లండన్‌లో ఉన్న బాలు, విషయం తెలుసుకుని కన్నీరు పెట్టుకున్నారు. హుటాహుటిన బయలు దేరారు. మంగళవారానికి నెల్లూరు చేరుకునే అవకాశం ఉంది. నేటి సాయంత్రం నెల్లూరులోనే ఆమె అంత్యక్రియలు జరగనున్నాయి. శకుంతలమ్మ, సాంబమూర్తి దంపతులకు మొత్తం ఆరుగురు సంతానం. శకుంతలమ్మ భర్త శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి అప్పట్లో నెల్లూరులో వీధి వీధీ తిరుగుతూ త్యాగరాజ కీర్తనలను పాడేవారు. తండ్రి వారసత్వంగా రెండో కుమారుడైన బాలసుబ్రహ్మణ్యం సంగీతంపై పట్టు పెంచుకుని గాయకుడిగా, సంగీత దర్శకుడిగా ఎదిగారు.

యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్

ఏర్పాటు చేయాలంటూ సీఎంకు వినతి

విశాలాంధ్ర-అమరావతి : గిరిజనులలో అతి పురాతన తెగగా ఉన్న యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యానాది హక్కుల పరిరక్షణ సమితి నాయకులు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉండవల్లిలోని ప్రజావేదికలో వారు సీఎంను కలిసి వినతి పత్రం సమర్పించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి మాట్లాడుతూ గిరిజనులలో ఒక తెగగా ఉన్న యానాదులు అత్యంత వెనుకబడి ఉన్నారనీ, వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. రాష్ట్రంలో 28 గిరిజన తెగలు ఉన్నాయనీ, యానాది తెగకు చెందిన వారు 13 లక్షల వరకూ ఉన్నారన్నారు. యానాదులు అన్ని విధాలా వెనకబడి ఉన్నారని, ఐటీడీఏ ద్వారా ఆశించిన మేర అభివృద్ధి జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు పథకాలతో సీఎం యానాదుల సంక్షేమానికి కృషి చేస్తున్నా, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. తమ మొర విన్న సీఎం సానుకూలంగా స్పందించారని వెంకటపతి తెలిపారు. సమితి నాయకులు రావూరి శ్రీనివాసరావు, పొట్లూరి లక్ష్మయ్య, ప్రసాద్, భరత్ కుమార్ మురళి దేవి తదితరులు పాల్గొన్నారు.



అమెరికా కుట్రను నిలువరించాలి : ఇస్కఫ్

విశాలాంధ్ర -విజయవాడ (లబ్బీపేట) : లాటిన్ అమెరికాలోని ప్రగతిశీల దేశం వెనిజులాపై అమెరికా సాగిస్తున్న కుట్రలను నిలువరించాలని, వెనిజులా సంక్షోభానికి అంత పలకాలని కోరుతూ భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయం హాలులో వెనిజులా సంఘీభావ సభ జరిగింది. ఇస్కఫ్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కే సుబ్బరాజు ఈ సందర్భంగా ప్రసంగించారు. ఇస్కఫ్ నాయకులు మహబూబాద్ ఆజం అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అమెరికా ప్రపంచ దేశాలపై కోసం ఆధిపత్యం కోసం అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా పలుదేశాల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకొని సంక్షోభాలను సృష్టిస్తోందని అందులో భాగంగా వెనిజులాపై పెత్తనం కోసం బరితెగించిన రీతిలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. ఆరేళ్ల అధికారంతో గత సంవత్సరం ఎన్నికైన వెనిజులా అధ్యక్షుడు మదురో ప్రభుత్వాన్ని కూల్చడం కోసం అమెరికా అడ్డగోలు చర్యలను చేపడుతోందని సుబ్బరాజు పేర్కొన్నారు. వెనిజులాలో ప్రతిపక్షం రెచ్చగొట్టి మదురో ప్రభుత్వంపై తిరుగుబాటు చేయించి ప్రతిపక్ష నేత జాన్‌గాయిడో తానే దేశాధ్యక్షుడిగా స్వయంగా ప్రకటించుకునే దానికి అమెరికా, అమెరికా మిత్ర దేశాలు మద్దతు పలకడం సిగ్గుచేటని తెలియజేస్తూ, అత్యధిక ఆయిల్ నిక్షేపాలు ఉన్న వెనిజులాపై పెత్తనం కోసం దురహంకార చర్యలకు పాల్పడటం తగదన్నారు. తిరుగుబాటు దారులను అణచివేసేందుకు సైన్యం ముందుకు రావటం మదురో ప్రభుత్వానికి బాసటగా నిలవడం అభినందనీయమని సుబ్బరాజు పేర్కొంటూ వెనిజులాలో అమెరికా ఆంక్షలను సంక్షోభాన్ని నిలువరించేందుకు ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ సంస్థలు కృషి చేయాలని కోరారు. ఆజం, నీలం దుర్గారావు, పరుచూరి అజయ్, ఇస్కఫ్ నాయకులు జీఎల్ ఆనంద్, పూజారి దుర్గారావు, కొరివి సాంబశివరావు, వై.వెంకటేశ్వరరెడ్డి, తమ్మిన గణేష్, దేవేంద్రప్రసాద్, ఉండేటి చినబాబు పాల్గొన్నారు.

9న 'మోడీ గోబ్యాక్' జయప్రదం చేయండి

• 10న గుంటూరులో ఖాళీకుండలతో నిరసన

• వామపక్ష పార్టీల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రధాని మోడీ పర్యటనను నిరసిస్తూ ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా 'మోడీ గో బ్యాక్', 10న గుంటూరులో ఖాళీకుండలతో చేపట్టే నిరసనలను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు కె.రామకృష్ణ-సీపీఐ, పి.మధు-సీపీఎం, వై.సాంబశివరావు- సీపీఐ (ఎంఎల్-న్యూడెమోక్రసీ), గుర్రం విజయకుమార్-సీపీఐ(ఎంఎల్), కాటం నాగభూషణం- ఎంసీపీఐ(యు), బి.బంగార్‌రావ్ (సీపీఐ, ఎంఎల్-లిబరేషన్), చిట్టిపాటి వెంకటేశ్వర్లు-సీపీఐ (ఎంఎల్- న్యూడెమోక్రసీ), బీఎస్.అమర్‌నాథ్- ఎస్‌యుసీఐ(సీ), పీవీ సుందరరామరాజు-ఫార్వర్డ్‌బ్లాక్, జానకి రాములు- రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ నేతలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేకహోదా, విభజన హామీలను నెరవేర్చడంలో రాష్ట్రానికి మోడీ తీవ్ర అన్యాయం చేశారని, పార్లమెంటు సాక్షిగా చేసిన విభజన చట్టాలను, గత ఎన్నికల బీజేపీ మేనిఫెస్టోలో పొందుపరిచ్చిన అంశాలన్నీ గాలిమేడలయ్యాయని విమర్శించారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్టులోనూ రాష్ట్రానికి మొండిచేయి చూపారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల అమలు కోసం నాలుగున్నరేళ్లుగా ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు.

'అగ్రి' బాధితుల కోసం వైసీపీ ధర్నా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండు చేస్తూ విజయవాడ ధర్నాచౌక్ వద్ద వైసీపీ బాసట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్యేలు మేకా ప్రతాప అప్పారావు, రక్షణనిధి, రాష్ట్ర నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కొలుసు పార్థసారథి, ఎల్.అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, కార్యకర్తలు హాజరయ్యారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల్ని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

ఇంధన రంగంలో కొత్త ఆవిష్కరణల వేదిక

నేటి నుంచి ఎనర్జీ ఇన్నోవేషన్ సమ్మిట్ -2019

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఇంధన రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధిస్తున్న ఆంధ్రప్రదేశ్ నవ్యావిష్కరణలకు వేదిక కాబోతోంది. గడచిన నాలుగున్నరేళ్లలో చేపట్టిన చర్యల వల్ల విద్యుత్ రంగంలో కొత్త ఒరవడి సృష్టిస్తున్న నవ్యాంధ్ర వైపు అన్ని రాష్ట్రాలూ చూస్తున్న తరుణంలో ఇన్నోవేషన్ సమ్మిట్‌కు విజయవాడ ఆతిథ్యమివ్వబోతోంది. ఈనెల 5,6 తేదీల్లో జరిగే ఈ సదస్సును రాష్ట్ర ప్రభుత్వం, సాంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తోంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు నిర్వహణలో డాల్బర్గ్ (నాలెడ్జ్ పార్టనర్), సీఐఐ, ది ఎనర్జీ రిసోర్సెస్ ఇన్స్టిట్యూట్ భాగస్వాములుగా ఉన్నారు. వీరితో పాటు ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ, సోషల్ ఆల్ఫా, స్టార్ట్ అప్ ఇండియా, టీఐఈ అమరావతి, విలేజ్ కాపిటల్, సుజలాన్, గ్రీన్కో ఇకోరెన్ ఎనర్జీ కూడా ఈ సదస్సు నిర్వహణలో భాగస్వామ్యమవు తున్నాయి. ప్రధానంగా మూడు అంశాలపై ఈ సదస్సు దృష్టి కేంద్రీకరిస్తుంది. విద్యుత్ రంగంలో కొత్త సృజనాత్మక ఆవిష్కరణలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానం - భవిష్యత్ తరాలకు ఈ ఫలాలు అందేలా సంబంధిత నిపుణులు, ఇన్వెస్టర్లు, అంకుర సంస్థలు, ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలు తమ అనుభవాలను రంగరించి కొత్త ఆలోచనను ముందుకు తేవడం - ఈ సూచనలను వాస్తవికంగా అమలు చేసే యంత్రాంగాన్ని, వ్యవస్థను రూపొందించడం వంటి సిఫార్సులు చేయడంపై ఈ సదస్సు ప్రధానంగా చర్చిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఈ ఆవిష్కరణలు ఉపయోగించుకోవడమే ఇక్కడ కీలక అంశం. కొత్త రాష్ట్రానికి కొత్త ఆవిష్కరణలు పూర్తి స్థాయిలో వినియోగించుకుని విద్యుత్ రంగంలో ఒక ఒరవడి సృష్టించబోతోంది.రెండు రోజుల సదస్సులో ఈ రంగంలో పేరెన్నిక గన్న సంస్థలు, నిపుణుల నేత సమావేశాలు జరుగుతాయి. అధ్యయన గోష్ఠిలు, ఆలోచనలను ఇచ్చిపుచ్చుకోవడాలు, ఎగ్జిబిషన్ లకు ఈ సదస్సు వేదిక కాబోతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట రావుతో పాటు పలువురు ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ఇంధన రంగానికి చెందిన సుమారు 300 మంది ఈ సమ్మిట్‌కు హాజరు కానున్నారు.

మహిళలను మోసగిస్తున్న బాబు

వైసీపీ నేత రోజా విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: పోస్ట్‌డేటెట్ చెక్కులతో మహిళలను ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు ఆర్‌కె.రోజా విమర్శించారు. చంద్రబాబు పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇచ్చి పండగ వాతావరణం కొనసాగుతోందని ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఐదేళ్లుగా మహిళల తాళిబొట్లు తెగిపోయే విధంగా చంద్రబాబు పరిపాలించి నేడు మహిళలకు పసుపు-కుంకుమ ఇస్తున్నానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. లోటస్‌పాండ్ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో రోజా మాట్లాడుతూ రూ.10 వేలు అనేది పెద్ద డ్రామాగా అభివర్ణించారు. పసుపు-కుంకుమ అనేది చాలా పవిత్రమైనదని.. పసుపు-కుంకుమను మన ఇంట్లో ప్రేమతో ఇస్తామని.. అప్పుల రూపంలో, ఇన్‌స్టాల్‌మెంట్ రూపంలో ఇవ్వరన్నారు. ఎన్నికల సమయంలో ఇలాంటి పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇచ్చి మోసగించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సొంత అక్కాచెల్లెళ్లను మోసం చేసిన చంద్రబాబు, రాష్ట్రంలో అక్కాచెల్లెళ్లను మోసం చేశారనడంలో ఆశ్చర్యం లేదన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఈసీ అడ్డగిస్తుందనే నమ్మకంతోనే చంద్రబాబు డ్రామాలు ఆడుతున్నారన్నారు. మహిళలకు న్యాయం చేయాలనే ఆలోచనే లేదన్నారు. పాత మోసాన్ని కప్పిపుచ్చు కోవడానికే మళ్లీ కొత్తమోసానికి చంద్రబాబు తెరలేపాడన్నారు. 2014లో రూ. 14,200 కోట్లు డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి నేటి వరకూ మాఫీ చేయలేదన్నారు. నేడు రూ.22 వేల కోట్లకు మించిపోయిందన్నారు. తడి గుడ్డతో గొంతుకోసేసి పదివేల చెక్కును మూడు పోస్ట్ డేటెడ్ పేరుతో ఇచ్చేసి పండగ చేసుకోమంటే.. ఎలా చేసుకోవాలో చంద్రబాబే సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు మోసాలపై వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చైతన్యపరుస్తుంటే ఆయనపై టీడీపీ నేతలు దాడి చేయడం దారుణమన్నారు. రెండు సంవత్సరాలు వడ్డీలేని రుణాలు ఇవ్వకుండా డ్వాక్రా మహిళలను మోసం చేశారని, పోలీసులు లేకుండా డ్వాక్రా మహిళల దగ్గరకి వెళ్లే ధైర్యం ఉందా అని మంత్రి సునీతను ప్రశ్నించారు. ఆడవారి తాళిబొట్లు తెగిపోయేవిధంగా ప్రతి ఊరుకో బారు, వీధికో బెల్ట్‌షాపు పెట్టినందుకు చంద్రబాబుకు ఓట్లు వేయాలా.. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటి కొస్తుందని మోసం చేసినందుకు ఓట్లు వేయాలా అని రోజా నిలదీశారు.

రాజకీయంగా ఎదుర్కోలేక దుష్ప్రచారం

టీడీపీ తీరుపై వైసీపీ నేత పద్మ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఆయన కుటుంబ సభ్యుల వ్యక్తిత్వాలను దిగజార్చేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నాడని వైసీపీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ విమర్శించారు. జగన్ సోదరి వైఎస్‌షర్మిలపై సోషల్ మీడియాలో ఐదేళ్లుగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ సీపీకి ఇచ్చిన ఫిర్యాదుతో విషప్రచారం వెనుక తెలుగుదేశం పార్టీ కుట్ర ఉందని భయటపడుతుందన్నారు. లోటస్‌పాండ్‌లోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం వాసిరెడ్డి పద్మ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంబంధం లేని విషయాన్ని అంటగట్టి ఐదేళ్లుగా షర్మిలపై విస్తృతంగా దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. మహిళలను కించపరిచే విధంగా అసభ్య ప్రచారాలు చేసే విష సంస్కృతికి టీడీపీ ఆజ్యం పోస్తున్నదని ధ్వజమెత్తారు. మాకేం సంబంధం లేదని మాట్లాడిన చంద్రబాబు ఇప్పుడు జరిగిన అరెస్టులకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. టీడీపీకి చెందిన వారిని ఉపయోగించి సోషల్ మీడియాల్లో అసభ్యకర కామెంట్లు పెట్టిస్తున్నారని తేలిందన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న పిల్లల కెరీర్‌కు దెబ్బతగులుతుందనే ఆలోచన లేకుండా, ఆ కుటుంబాలు ఏమవుతాయనే ఇంగితం లేకుండా విద్యార్థులను చంద్రబాబు సమిధలుగా వాడుకుంటున్నాడన్నారు. అభిమానించే కుటుంబాల విద్యార్థులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకొని వారి భవిష్యత్తును చంద్రబాబు అంధకారంలోకి నెట్టేస్తున్నారన్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు అనే విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారని, షర్మిల ఇచ్చిన ఫిర్యాదుపై ఇంకా అనేక మంది అరెస్టు కావాల్సి ఉందన్నారు. వెంకటేశ్వర్లు తండ్రి మంత్రి సిద్ధారాఘవరావు ముఖ్య అనుచరుడని, రెండెకరాల ప్రభుత్వ భూమి ఆ కుటుంబానికి ఇచ్చినట్లుగా తేలిందన్నారు. మరికొన్ని అరెస్టులు జరిగితే టీడీపీ డైరెక్షన్, స్క్రీన్‌ప్లే మొత్తం అర్థం అవుతుందన్నారు.

కన్నతండ్రే కాలయముడు

దర్యాప్తు చేపట్టిన పోలీసులు



విశాలాంధ్ర-తాళ్లూరు : అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె వేరే కులం వ్యక్తిని ఇష్టపడిందనే కారణంతో హతమార్చాడు ఓ తండ్రి. ఈ ఘటన ప్రకాశం జిల్లా మండల కేంద్రమైన తాళ్లూరు పంచాయతీ పరిధిలోని కొత్తపాలెంలో సోమవారం వేకువ జామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కొత్తపాలెం గ్రామానికి చెందిన కోటా వెంకారెడ్డి రెండో కుమార్తె కోటా వైష్ణవి (20) ఒంగోలులోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. అదే కళాశాలలో చదువుతున్న వ్యక్తితో ప్రేమ వ్యవహారం నడుపుతోందని ఆమె తండ్రి వెంకారెడ్డి అనుమానించి వైష్ణవి గొంతు నులిమి హత్య చేశాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ డీ రంగనాథ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. దర్శి సీఐ ఎం శ్రీనివాసరావు గ్రామంలో పర్యటించి వైష్ణవి హత్యపై విచారణ చేపట్టారు.

అసలేం జరిగిందంటే..

వెంకారెడ్డిది నిరుపేద కుటుంబం. అద్దె ఇంట్లోనే ఉంటూ పెద్ద కుమార్తె వివాహం చేశాడు. వైష్ణవిని పై చదువులు చదివిస్తున్నాడు. డిగ్రీ చదువుతోన్న వైష్ణవి కాలేజీలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో చనువుగా ఉంటోంది. ఈ క్రమంలో అతడితో తిరుపతి వెళ్లినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న వెంకారెడ్డి తిరుపతి వెళ్లి వైష్ణవిని తీసుకొచ్చాడు. ఈ క్రమంలోనే ఆగ్రహంతో ఆమెను గొంతునులిమి హత్య చేసి ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు. మరిన్ని వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఉపాధ్యాయ ఉద్యమానికి ఊపిరి..'మొహియిద్దీన్'

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ ఉద్యమానికి ఊపిరిగా మగ్దుం మొహియిద్దీన్ నిలిచారని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) వ్యవస్థాపకులు మగ్దుం మొహియిద్దీన్ 111వ జయంతిని సోమవారం విజయవాడ హనుమాన్‌పేటలోని ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించారు. నిజాం నిరంకుశ పాలనలోనే ఉపాధ్యాయ ఉద్యమానికి ఈయన ఊపిరి పోశారని నరసింహారెడ్డి కొనియాడారు. అనంతరం మొహియిద్దీన్ చిత్రపటానికి కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు తదితరులు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయవాణి ప్రధాన సంపాదకుడు ఎస్.శ్రీనివాసరావు, యు. రామకృష్ణంరాజు, ఎస్.మరియదాసు, లక్ష్మీనారాయణ, జోజప్ప, రామారావు, రాజారత్నం, ముస్తాఫా పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీసు రూల్సుతో పదోన్నతులు చేపట్టాలి: ఎస్టీయూ

ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్‌తో రాష్ట్రంలో పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీం కోర్టు స్టే ఇచ్చిందని వివరించారు.

నేడు ఏపీ జేఏసీ అమరావతి ద్వితీయ మహాసభ

వేదిక విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు ఏపీ జేఏసీ అమరావతి ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ద్వితీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్రప్రధానకార్యదర్శి ఫణి పేర్రాజులు తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన వెలువరించారు. కార్యక్రమంలో జేఏసీలో భాగస్వాములైన 99 సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల కాలంలో జేఏసీ అమరావతి సాధించిన విజయాలు ప్రస్తావించడంతోపాటు భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలిండియా స్టేట్ పెన్షనర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, సచివాలయం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొంటారని వారు వెల్లడించారు.

పేదలను అవమానిస్తున్న అధికార నేతలు

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి టీజేఆర్ సుధాకర్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజ్యాంగ బద్ధంగా పేదలకు సంక్షేమ పథకాల పంపిణీచేసే సమయంలో అధికార మంత్రులు, ఎమ్మెల్యేలు దురుసుగా ప్రవర్తిస్తూ లబ్ధిదారులను అవమానపరుస్తున్నారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి టీజేఆర్ సుధాకర్‌బాబు మండిపడ్డారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లాలో పెన్షన్ తీసుకునేందుకు ఓ వృద్ధుడు వస్తే..ఆయనపై ఎమ్మెల్యే చింతమనేని దురుసుగా ప్రవర్తించడం దారుణమని దుయ్యబట్టారు.

సంపాదకీయం

బీజేపీ - మమత బాధ్యతారాహిత్యం

కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం పక్షపాత వైఖరితో ప్రజాస్వామ్య దేశంలో సమాఖ్య స్ఫూర్తికి అర్థం లేకుండా చేస్తుంది. దాన్ని హరించే విధంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అదే విధంగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోడానికి కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), ఆదాయపు పన్ను శాఖ (ఐటి)లను మోడీ ప్రభుత్వం బరితెగించి దుర్వినియోగానికి పాల్పడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. 2013 నుండి వున్న శారదా చిట్‌ఫండ్ కుంభకోణానికి సంబంధించి కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను ప్రశ్నించడానికి వెళ్లిన సీబీఐ బృందం పట్ల మమతా బెనర్జీ నేతృత్వంలోని పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ప్రతిస్పందన కూడా అప్రజాస్వామికంగా ఉందని చెప్పక తప్పదు. అతి పెద్దకుంభకోణమైన శారదా చిట్‌ఫండ్ నిందితుడ్ని కాపాడటానికి మమత ప్రభుత్వం తన రాష్ట్ర ప్రభుత్వ పోలీసు శాఖ ద్వారా అప్రజాస్వామికంగా వ్యవహరింపజేసి, పోలీసు వ్యవస్థ మధ్యే వివాదానికి బాధ్యతారహితంగా వ్యవహరించటం ప్రజాస్వామ్య వ్యవస్థకు శ్రేయోదాయకం కాదు. కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను ప్రశ్నించడానికి సీబీఐ బలగాలు శనివారం సాయంత్రం ఆయన నివాసానికి వెళ్లగా బెంగాల్ పోలీసులు నిర్బంధించారు. కేంద్రం చర్యపై మండిపడ్డ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నడిరోడ్డుపై ధర్నాకు దిగారు. ప్రధానమంత్రి మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా రాష్ట్రంలో తిరుగుబాటు జరిపించడానికి ప్రయత్నిస్తున్నారని, ప్రధానమంత్రి ఉత్తర్వు మేరకు జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి సీబీఐని ఆదేశిస్తున్నారని మమత ఆరోపించారు. కోల్‌కతాలోని మెట్రో సినిమా వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక వేదికపై ఆదివారం రాత్రి 8.30 గంటల నుండి మమత ధర్నా చేస్తున్నారు. దేశం, దాని రాజ్యాంగం కాపాడబడే వరకు తన "సత్యాగ్రహం" కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. నలభై రెండు లోక్‌సభ స్థానాలున్న పశ్చిమ బెంగాల్‌లో పాలకపక్షంపై ప్రజల్లో వున్న వ్యతిరేకతను ఉపయోగించుకొని రానున్న లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీజేపీ ఒక పక్క ఆరాటపడుతుంటే, మమత ప్రతి విషయాన్ని కేంద్ర-రాష్ట్ర సంబంధంగా మలిచేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం సీబీఐ నేపథ్యంగా సాగుతున్న పోరాటం సమంజసం కాదు. ఎందుకంటే సీబీఐ ప్రశ్నించాలనుకొన్నది ఒక అతిపెద్ద కుంభకోణానికి సంబంధించిన వ్యవహారంలో వేల కోట్ల రూపాయలు ప్రజలకు టోపీ పెట్టి తప్పించుకు తిరుగుతున్న దోషులను అరెస్టు చేయడానికి దర్యాప్తునకు నేతృత్వం వహించిన పోలీసు అధికారిని శారదా కుంభకోణం కేసు విషయంలో రాష్ట్ర పోలీసులు సక్రమంగా దర్యాప్తు చేయడం లేదని భావించి దర్యాప్తును సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగించింది. వేల కోట్ల రూపాయలు అవినీతి కుంభకోణంపై దర్యాప్తు జరగనివ్వాలి. వీలైతే అందుకు సహకరించాలి. అంతేగాని దర్యాప్తును అడ్డుకొని, ప్రజల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి, అంతర్యుద్ధంలాంటి పరిస్థితిని సృష్టించడం ఏమాత్రం సబబు కాదు. మరో మాటలో చెప్పాలంటే సుప్రీంకోర్టు ఆదేశాన్ని ధిక్కరించడమే అవుతుంది. రాజ్యాంగాన్ని పరిరక్షించే ఉద్యమాన్ని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిస్తూ, దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆ దేశాన్ని ఉల్లంఘించడంలో ఔచిత్యం లేదు. సీబీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దయెత్తున వీధుల్లోకి వచ్చి మోడీ, అమిత్‌షా దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. శారదా చిట్‌ఫండ్ కుంభకోణం కేసులో పోలీసు కమిషనర్‌ను ప్రశ్నించకుండా పోలీసులు సీబీఐ బృందాన్ని అడ్డుకొన్న తరువాత కోల్‌కతాలో ఏర్పడిన పరిస్థితిపై రాష్ట్ర గవర్నర్ కేఎన్ త్రిపాఠి కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సోమవారం నివేదిక సమర్పించారు. రాజ్‌నాథ్‌సింగ్‌తో కూడా సోమవారం ఉదయం గవర్నర్ మాట్లాడారు. కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయం దర్యాప్తు సంస్థ అధికారుల నివాస గృహాల వద్ద కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కేంద్ర బలగాలను మోహరించి, పరిస్థితిని సునిశితంగా పర్యవేక్షిస్తున్నది. శారద కుంభకోణం కేసులో దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందానికి నేతృత్వం వహించిన పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను గల్లంతైన కొన్ని పత్రాలు, ఫైళ్ల గురించి ప్రశ్నించడానికి హాజరు కావలసిందిగా ఎన్నిసార్లు నోటీసులు పంపినా ఆయన స్పందించలేదని సీబీఐ పేర్కొంది. శారదా ఛిట్‌ఫండ్ కుంభకోణం కేసుకు సంబంధించి ఎలక్ట్రానిక్ సాక్ష్యాన్ని కోల్‌కతా పోలీసు కమిషనర్ ధ్వంసం చేశారని ఆరోపిస్తూ ఒక పిటీషన్‌ను, కోర్టు ధిక్కారానికి పోలీసు కమిషనర్ పాల్పడ్డారని ఆరోపిస్తూ మరో పిటిషన్‌ను సీబీఐ దాఖలు చేయగా తక్షణ విచారణకు సోమవారం సుప్రీం అంగీకరించింది. సీబీఐ పిటీషన్‌లను నేడు సుప్రీం విచారిస్తుంది. కోల్‌కతాలో నెలకొన్న అసాధారణ పరిస్థితి మరింత జఠిలం కాకుండా కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు విజ్ఞత ప్రదర్శించి, సంయమనంతో వ్యవహరిచవలసిన అవసరం వుంది. శారదా చిట్‌ఫండ్ కుంభకోణంలో తిమింగలాలను అరెస్టు చేయడానికి పారదర్శకతతో కూడిన, స్వతంత్ర దర్యాప్తు కొనసాగించవలసిన ఆవశ్యకత వుంది. కేంద్ర - రాష్ట్ర సంబంధాలను పునర్‌నిర్వచించడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి కోల్‌కతాలో తలెత్తిన పరిస్థితిని చక్కదిద్దే చర్యలకు ఉపక్రమించాలి.

చురక

మోడీగిరి మమతాగిరి
మోహరించే కోలుకత్తా
సీబీఐ, పోలీసులు
చెరోపక్క చూపే సత్తా

రాబోయే ఎన్నికలకు
రాజకీయ యుద్ధం
పార్టీలకు పట్టబింక
ప్రజాస్వామ్య శుద్ధం

- వేల్పుల నారాయణ

బ్యాంకుల విలీనం దేశ ప్రగతికి గొడ్డలిపెట్టు

విశ్లేషణ


చలసాని వెంకట రామారావు.

1969 జులై 19న దేశంలోని 14 బ్యాంకులను జాతీయం చేయటం జరిగింది. ఇది దేశ రాజకీయ వ్యవస్థను ఒక కుదుపు కుదపటమే కాకుండా దేశ ప్రజల ఆర్థిక, సామాజిక జీవితాలపై ఎంతో ప్రభావం చూపించింది. నాటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ చూపిన చొరవ ఫలితంగా ప్రభుత్వరంగ బ్యాంకులు అవతరించి ప్రజల సామాజిక అవసరాలను తీర్చే విధంగా బ్యాంకులు మార్పుచెందాయి. జాతీయకరణకు ముందు బ్యాంకులు కేవలం కొద్దిమంది సంపన్న వర్గాల, పెట్టుబడిదారుల, భూస్వాముల, ప్రయోజనాలకు పెద్దపీట వేసేవి. జాతీయకరణ ఫలితంగా ప్రజల చెంతకు బ్యాంకులు చేరి చిన్న చిన్న రైతులు, చేతివృత్తులవారు, చిన్న పరిశ్రమలు, సాధారణ ప్రజలు, బడుగు, బలహీనవర్గాల ప్రజలు ప్రయోజనం పొందారు. ఫలితంగా వ్యవసాయరంగం ఎంతో అభివృద్ధిని సాధించింది. దేశ ఎగుమతులు పెద్దఎత్తున పెరిగాయి. ఉద్యోగ కల్పన వేగవంతమైంది. నూతన రంగాలలో అభివృద్ధి వేగం పుంజుకుంది. వెనుకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి బ్యాంకుల సహకారం పెరిగింది. ప్రభుత్వ పాలన వ్యవస్థ బహు ముఖంగా వృద్ధిచెంది మారుమూల పల్లెలకు సైతం బ్యాంకింగ్ కార్యకలాపాలు విస్తరించాయి. జాతీయకరణ ఫలితంగా బ్యాంకు డిపాజిట్లు పెద్ద ఎత్తున వృద్ధి చెందడమే కాకుండా, ఖాతాదారుల ప్రయోజనాలు విస్తరించాయి. బ్యాంకుల శాఖలు దేశమంతా పెరిగాయి. ఉద్యోగుల సంఖ్య 10లక్షలకు పైగా పెరిగింది. బ్యాంకింగ్ రంగంలో అనేక ఊహించని పరిణా మాలు జరిగాయి. 1975 ప్రాంతంలో గ్రామీణ బ్యాంకులు ఏర్పాటు చేయబడ్డాయి. 1969 బ్యాంకుల జాతీయకరణ మంచి ఫలితాలను సాధించి అభివృద్ధి వేగం పెంచడంతో 1980లో మరో ఆరు ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేసి ప్రభుత్వ రంగ బ్యాంకులుగా మార్పు చేయటం జరిగింది. సాధా రణ ప్రజలు, రైతులు, వ్యవసాయ రంగం, కార్మికవర్గం, వెనుకబడిన వర్గాలు, స్వయం ఉపాధి కార్మికులు, చిన్న, మధ్య తరహా రైతాంగం, చిల్లర వర్తకం, వాణిజ్య కార్యకలాపాలు, రవాణా రంగం, చిన్న పరిశ్రమలు అనేక విధాలుగా లబ్ధిపొందాయి.

1991లో నాటి ప్రధానమంత్రి పీ.వీ.నరసింహారావు నూతన ఆర్థిక విధానాల పేరుతో ఆర్థిక రంగంలో సంస్కరణలను ప్రారంభించారు. స్వేచ్ఛా వాణిజ్యం పేరున ప్రారంభించిన సంస్కరణలు ప్రైవేటు బ్యాంకులను ప్రోత్సాహించి కొత్తగా అనేక ప్రైవేటు బ్యాంకుల ఏర్పాటుకు దారితీసింది. ప్రభుత్వరంగ బ్యాంకులను నష్టాల పేరుతో విలీనం చేయడానికి మార్గం సుగమం చేసింది. జాతీయకరణ సందర్భంగా చిన్న, సన్నకారు వర్గాల ప్రయోజనాలకు పెద్దపీట వేసిన బ్యాంకింగ్ రంగం తిరిగి ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలకు ప్రాధాన్యత కల్పించటం ప్రారంభమైంది. దీనితో పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించక ఎగవేతకు పాల్పడటం వంటి చర్యలతో ప్రభుత్వరంగ బ్యాంకులు నష్టాల్లోకి వెళ్లడం ప్రారంభమైంది. రుణాల వసూళ్ళ సందర్భంలో రాజకీయ జోక్యం పెరిగి బ్యాంకులు మరింత సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. పారు బకాయిల భారంతో బ్యాంకిం గ్ వ్యవస్థ అస్తవ్యస్థం అయ్యింది. ఈ సంస్కరణలకు వ్యతి రేకంగా బ్యాంకింగ్ రంగంలో మొట్టమొదటి ప్రధాన ట్రేడ్ యూనియన్ ఏఐబీఈఏ చొరవతో పలు దేశవ్యాపిత సమ్మెలు జరిగాయి. గత 25 సంవత్సరాల కాలంలో సుమారు 45 రోజులు సమ్మెలు, నిరసనలతో ఆందోళనలు నిర్వహించడం జరిగింది. 1991 నుండి ప్రభుత్వాలు బ్యాంకుల విధానాలలో మార్పులు చేపట్టేందుకు పలు కమిటీలను ఏర్పాటు చేసి, వాటి సిఫారసుల ఆధారంగా కార్పొరేట్ వర్గాలకు బ్యాంకులు మరింత చేరువై వారికి మేలు చేసే విధంగా పలు సంస్కరణలు ఈ కమిటీలు అన్నీ కార్పొరేట్ పెట్టుబడిదారీ వర్గాలకు మేలు చేసేవిగా ఉన్నాయి. వీటి సిఫారసులు ఆధారంగా బ్యాంకు శాఖలు, ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గించబడింది. కార్పొరేట్ల అవసరాల మేరకు వడ్డీరేట్లు తగ్గించబడ్డాయి. బ్యాంకుల స్థితిగతులలో మార్పులు చోటుచేసుకుని గ్లోబల్ బ్యాంకులు, జాతీయ రీజనల్ బ్యాంకులు అవతరించాయి. బ్యాంకులలో ప్రభుత్వ వాటా తగ్గించబడింది. కార్పొరేట్ రాయితీలు ప్రతి సంవత్సరం పెంచబడ్డాయి. బ్యాంకులకు పారు బకాయిలు భారం రోజు రోజుకు పెరిగిపోయింది. నష్టాల పేరుతో బ్యాంకుల మూసివేతకు తెరతీశారు. అనేక ప్రైవేటు బ్యాంకులు కొత్తగా ఏర్పాటు కావటానికి ఈ కమిటీ సిఫారసులు తోడ్పడ్డాయి. బ్యాంకుల జాతీయకరణ నాటి లక్ష్యాలను విస్మరించి చిన్న చిన్న ప్రభుత్వరంగ బ్యాంకుల విక్రయాలు జరిగాయి. పీ.జే.నాయక్ నేతృత్వంలోని కమిటీ ఏకంగా బ్యాంకుల జాతీయకరణ చట్టాన్ని తొలగించాలని, జాతీయ బ్యాంకులను విజాతీయకరణ(డినేషనలైజేషన్) చేయాలని చెప్పింది. 2015లో బీజేపీ ప్రభుత్వ పాలనలో ఇంద్ర ధనుష్ (2015) జ్ఞాన్ సంఘం కార్పొరేట్ పెట్టుబడిదారీ ప్రయోజనాలే లక్ష్యంగా అనేక సిఫారసులు చేసింది.

1991 ఆర్థిక సంస్కరణల కొనసాగింపు ఫలితంగా ప్రభుత్వ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తుల విలువ రోజు రోజుకూ పెరిగిపోయింది. పారు బకాయిలు పెరిగిపోయి బ్యాంకింగ్ వ్యవస్థ సంక్షోభంలోకి నెట్టబడింది. అనేక మంది కార్పొరేట్‌లు తమ కంపెనీలు లాభాలు ఆర్జిస్తున్నా నష్టాలను చూపించి ఉద్దేశ పూర్వకంగా బ్యాంకు రుణాలకు ఎగనామం పెట్టారు. విజయ్‌మాల్యా, నీరవ్‌మోడీ, మోహుల్‌చోక్సీ వంటి వారు ప్రభుత్వ సహకారంతో బ్యాంకు రుణాలను ఉద్దేశ పూర్వకంగా ఎగ్గొట్టి విదేశాలలో తలదాచుకుంటున్నారు. పాలకుల, బ్యాంకు అధికారులలో చిత్తశుద్ధి లోపించిన ఫలి తంగా ప్రజాధనం కొల్లగొట్టిన వారు స్వేచ్ఛగా తిరగటమే గాక చట్టాన్ని తమకు అనుకూలంగా వినియోగిం చుకుంటున్నారు.

1997లో రూ.47,300కోట్లు ఉన్న నిరర్థక ఆస్తులు, వామపక్షాల ప్రాబల్యం ఉన్న యూ.పీ.ఏ-1 ప్రభుత్వంలో 39,030 కోట్లకు తగ్గాయి. యూ.పీ.ఏ.-2 ప్రభుత్వం ముగింపు దశలో 1,64,461 కోట్లకు పెరిగాయి. బీజేపీ 4 ఏళ్ళ పాలనా కాలంలో 8.4 లక్షల కోట్లకు పైగా పెరిగాయి. నిరర్థక ఆస్తులలో స్టేట్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, ఐడిబిఐ బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకులు ముందు వరుసలో ఉన్నాయి. 2005-2006 ఆర్థిక సంవత్సరం నుండి 2017-2018 వరకు 4,61,640 కోట్ల నిరర్థక ఆస్తుల పేర పారు బకాయిలు రద్దు చేయడం జరిగింది. ఇవన్నీ కార్పొరేట్ వర్గాల ఆర్థిక ప్రయోజనాలను ఉద్దేశించినవే. పాలకుల విధానాల ఫలితంగా నష్టాల ఊబిలో కూరుకుపోయిన బ్యాంకులను విలీనం చేయుట ద్వారా బ్యాంకులను పటిష్టం చేయాలని ప్రభుత్వం భావించింది. ఎఐబిఇఎ తదితర యూనియన్లు దేశవ్యాపితంగా వ్యతిరేకించి నప్పటికీ, సమ్మె పోరాటం నిర్వహించినా లక్ష్యపెట్టకుండా స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనీర్ అండ్ జయపూర్,స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూరు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ తిరువాన్‌కూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాటియాలాలను స్టేట్ బ్యాంక్ ఇండియాలో విలీనం చేశారు. తిరిగి బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయ బ్యాంక్,దీనా బ్యాంకులను విలీనం చేశారు. ఈ విలీనం ఫలితంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చరిత్రలో మొదటిసారి నష్టాలను నమోదు చేసింది. అనేక శాఖలను మూసివేసింది.ఉద్యోగులను పెద్ద సంఖ్యలో తొలగించింది. నూతన ఉద్యోగాల కల్పన ఆగిపోయింది. విలీనం ఫలితంగా బ్యాంకులు అన్ని రకాలుగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. అత్యధిక జనాభా కలిగిన భారతదేశంలో బ్యాంకుల సంఖ్యను తగ్గించటం, బ్యాంకుల విస్తరణ జరగకపోవడం తీవ్ర అనర్థాలకు దారితీస్తుంది. ప్రజా ప్రయోజనాలను పణంగా పెట్టి బ్యాంకుల విలీనం పేరుతో ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్యను తగ్గించడం దేశ శ్రేయస్సుకు తగినదికాదు. బ్యాంకుల విలీనం ఆర్థిక రంగంలో మరిన్ని సమస్యలు సృష్టిస్తున్నది. దేశ ప్రయోజనాలకు,అభివృద్ధికి ఇది గొడ్డలిపెట్టుగా పరిణమిస్తుందనటంలో సందేహంలేదు. దీనిని జాతియావత్తు ప్రతిఘటించాలి. బ్యాంకుల జాతీయకరణ లక్ష్యాలను పరిరక్షించాలి. అప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుంది.

వ్యాస రచయిత : ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు,
సెల్ : 9490952093

వి-మెయిల్

గాడి తప్పుతున్న పాలనను ప్రజలే గాడిలో పెట్టాలి

ఆధునిక విజ్ఞానమే ఈరోజు మనిషిని గ్రహాంతరాలలో కాపురం పెట్టేందుకు, మనిషి ఇంతగా ఎదిగేందుకు కారణమైంది. మరి ఇంతటి సైన్సును పక్కకునెట్టి, మనిషి ఆలోచించకుండా చేసేందుకు, మరలా ప్రజలను మధ్య యుగాలలోకి నెట్టేందుకు మన పాలకులు చేస్తున్న చర్యలను తిప్పికొట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. నిన్న ఆదివారంనాడు అమరావతిలో హైకోర్టు భవన శంకుస్థాపనలో రాజ్యాంగ విలువలను పాటించవలసిన న్యాయవ్యవస్థ చేసినదేమిటి? లౌకికదేశంలో అందునా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల సమక్షంలో హైకోర్టు భవన శంకుస్థాపనకు పూజలు, పురోహితుల మంత్రాలు.. ఎటుపోతున్నాం మనం? వారివారి స్వంత ఇళ్లకి ఈ రకంగా చేయవచ్చు. నిన్న జరిగింది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. అందునా న్యాయమూర్తుల సమక్షంలో లౌకికవాదం సమాధి చేయబడింది. ఇక తెలంగాణాలో అదొక రాజుల పాలనగా ఉంది. ఎన్నికలు జరిగి నెలరోజులైనా ఇంతవరకు మంచిరోజు లేదని మంత్రివర్గం ఏర్పడలేదు. కేసీఆర్ యజ్ఞాలు, యాగాలకి, యాదాద్రి గుడికి ఇచ్చిన ప్రాముఖ్యత ప్రజాపాలనకి ఇవ్వటంలేదు. వందల కోట్లు పెట్టి యాదాద్రిని తిరుపతికంటే పెద్దగుడిగా తయారు చేస్తానని నిన్న ప్రకటించాడు. పాలనలో పోటీ పడాలి. గుళ్లలోకాదు. గుళ్లు కట్టిస్తే ప్రజలు భక్తులుగా తయారౌతారు. భక్తి ప్రజలను ఆలోచించనీయదు. అంతావాడే చూస్తాడులే అనే పరాధీనతాభావం ప్రజల్లో ఏర్పడితే ప్రశ్నించేతత్వం నశిస్తుంది. ప్రశ్నించకుండా ఉండేందుకే ప్రభుత్వాలు ప్రజలలో భక్తిని ఎక్కిస్తున్నాయి.

ఇక మన ముఖ్యమంత్రి చంద్రబాబుగారు ఒకవారం క్రితం సంగమం వద్ద జరిగిన ఒక దొంగస్వామి యాగానికి వెళ్ళాడు. ఆ దొంగస్వామిపై ప్రభుత్వ భూఆక్రమణపై హైకోర్టులోనూ, లోకాయుక్త లోనూ కేసులున్నాయి. అలాంటి దొంగలు చేసే యాగానికి ముఖ్యమంత్రి వెళితే ప్రజలకు ఏ రకమైన సంకేతాలు వెళ్తాయి? దొంగల భూఆక్రమణను సమర్థించినట్లుకాదా! కనుక దారి తప్పుతున్న పాలనను ప్రజలే గాడిలో పెట్టవలసిన అవసరం ఉంది. అందుకొరకు రాజ్యాంగం అర్టికల్ 51 ఏలో ప్రశ్నించేతత్వము, శాస్త్రీయ అలోచన, మానవవాదాన్ని పెంచటం ప్రతిపౌరుని బాధ్యత అన్నసూత్రాలను విరివిగా ప్రజలలోకి తీసికెళ్ళాలి. లౌకికవాదం ఖచ్చితంగా అమలుపరచే విధంగాను ప్రభుత్వాలపై వత్తిడి తేవాల్సిన బాధ్యత కూడా చైతన్యవంతమైన ప్రజలపై ఉంది.

- నార్నె వెంకట సుబ్బయ్య, అధ్యక్షుడు, ఏపీ హేతువాదసంఘం

ఈబీసీలకు రిజర్వేషన్లు వికటించనున్న వైద్యమవుతుందా?

ప్రొఫెసర్ బి.రామకృష్ణారావు

సార్వత్రిక ఎన్నికలకు ఇంకా కేవలం మూడు నెలలు మాత్రమే వ్యవధి ఉండగా అధికారంలో ఉన్న మోడీ సర్కారు అగ్రకులాల పేదలకు రిజర్వేషన్ల అస్త్రాన్ని అనూహ్యరీతిలో సంధించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. విద్య, ఉద్యోగాలలో అగ్రకులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేవలం అయిదు రోజుల్లోనే చట్టాన్ని తెచ్చింది. ఫలితంగా ఇంత వరకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకున్న 49.5 శాతం రిజర్వేషన్లు 59.5 శాతానికి చేరాయి. సబ్ కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో పేదరికం నిర్మూలన ద్వారా సమ్మిళిత వృద్ధి సాధించడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశమని కేంద్ర పాలకులు పొగుడుతుంటే, ఇది కేవలం రాబోయే ఎన్నికల ముందు రాజకీయ లబ్ధికోసమేనని విపక్షాలు విమర్శిస్తున్నాయి. పార్లమెంటు ఆమోదం కోసం రాజ్యాంగంలోని 15, 16 అధికరణాలను సవరించవలసి వచ్చింది. ఈ బిల్లులో లోపాలున్నాయని ఉభయ సభల్లోనూ చెప్పిన విపక్షాలు, చివరకు బిల్లును సమర్థించడం విచిత్రం. ఇప్పటికే పలువురు నేతలు దీనిని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును, వివిధ రాష్ట్రాల హైకోర్టులను ఆశ్రయించారు. న్యాయసమీక్షకు ఈ చట్టం నిలబడుతుందా లేదా వేచి చూడాలి.

ప్రస్తుతం విద్య, ఉద్యోగాలలో అమలవుతున్న రిజర్వేషన్లు "కులం" ప్రాతిపదికన నిర్ణయించబడితే, కేంద్రం తాజాగా తెరపైకి తెచ్చిన 10 శాతం రిజర్వేషన్లు అగ్రవర్ణాల్లో "ఆర్థిక వెనుకబాటుతనం" అనే ప్రాతిపదికన నిర్దేశింపబడింది. భారత రాజ్యాంగసభ ఈ దేశంలో ఓబీసీలు ఎవరు? అన్నదానిపై సరైన స్పష్టత ఇవ్వలేదు. దానిని నిర్ధారించకపోవడం అగ్రకులాలు తమకు అనుకూలంగా మలచుకున్నాయి. ఓబీసీల నిర్వచనానికి మూలం కులమా? వర్గమా? అనే వాదనతోనే నాలుగు దశాబ్దాలు గడిచిపోయాయి. నేటికి కూడా రాజ్యాంగ బద్ధంగా పొందుపర్చిన సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనాన్ని అగ్రకులాలు అంగీకరించడం లేదు. సామాజిక వెనుకబాటుతనం ఒక ప్రామాణికమేనని అంతర్గతంగా అర్థమవుతున్నప్పటికీ, కాంగ్రెసు పార్టీ నాయకత్వం నెహ్రూ నుంచి ఇందిరా గాంధీ నుంచి రాజీవ్ గాంధీ వరకు అందరూ రిజర్వేషన్లకు ఆర్థిక వెనుకబాటుతనమే ప్రాతిపదికగా ఉండాలనే వాదించడం జరిగింది. ఆర్థిక వెనుకబాటుతనం అనే ప్రాతిపదికమీదనే తమకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని ఆయా రాష్ట్రాలలో కొన్ని అగ్రకులాలు ఉద్యమాలు చేస్తున్నాయి. మిగిలిన అగ్రకులాలు వీరికి దన్నుకాస్తున్నాయి. ఆర్థిక వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పలుమారులు స్పష్టం చేసింది. అయినా ఆ అంశాన్నే ఏదో ఒక రూపంలో తెరపైకి తెస్తూ, అదేసాకుగా అగ్రకులాల రిజర్వేషన్లను కాజేసే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒక విధంగా పేదరిక నిర్మూలనకు, రిజర్వేషన్లకు ఎట్టి సంబంధం లేదని కొందరి భావన. జనాభాలో 52 శాతం ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ వెనుకబడిన సామాజిక వర్గాలను అధికారానికి, అభివృద్ధికి, పదవులకు దూరం చేయడం అప్రజాస్వామికం. అరాచకం, దుర్మార్గం. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారత ప్రభుత్వం వెనుకబడిన వర్గాల స్థితిగతులపై అధ్యయనం చేయడానికి 1953లో నియమించిన కాకాకలేల్కర్ కమిషనుగాని, రెండోసారి 1978లో నియమించిన మండల్ కమిషన్ గాని కేవలం సామాజిక, విద్యాపరమైన అంశాలను మాత్రమే ప్రామాణికాలుగా తీసుకున్నాయి. అయితే మండల్ కమిషను మాత్రం సామాజిక అంశాలకు మూడు, విద్యాపరమైన వాటికి రెండు, ఆర్థిక అంశాలకు ఒక్కొక్కటి లెక్కన మార్కులు ఇస్తూ 11 సూచికలతో కూడిన సామాజికపరమైన, విద్యాపరమైన వెనుకబాటుతనాన్ని నిర్ధారించింది.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన మండల్ కమిషన్ నివేదిక అమలుపై అగ్రవర్ణాలు ఆగ్రహం చెందడంతో సెప్టెంబరు 1991లో పీవీ నరసింహారావు సర్కారు వారికి కూడా 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. అయితే మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదంటూ సుప్రీం కోర్టు దానిని ఇంద్రసహానీ కేసులో నవంబరు 1992లో తిరస్కరించింది. ఆ తర్వాత ఏ ప్రభుత్వమూ రిజర్వేషన్ల జోలికి పోలేదు. కాని ఈసారి చట్టపరంగా ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశ్యంతో "ఆర్థికంగా వెనుకబడిన వర్గం" అనే కొత్త వర్గాన్ని సృష్టించారు. కేంద్రం తాజా నిర్ణయం వెనుక కొన్ని తక్షణ రాజకీయ కారణాలు కనిపిస్తున్నాయి. అవి 1) ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నిరోధక చట్టంలో కొన్ని నిబంధనలను సుప్రీం కోర్టు నిర్వీర్యం చేసినా ప్రభుత్వం దానిని పునరుద్ధరించడంతో అగ్ర వర్ణాలవారు ఆగ్రహంతో ఉండటంతో వారిని బుజ్జగించ దానికి ఈ నిర్ణయం తీసుకుంది. 2) యూపీలో అగ్రవర్ణాలను కాంగ్రెసు నుంచి దూరం చేసి తమవైపు మళ్లించడం, 3) బీఎస్పీని ఇరకాటంలో పెట్టడం. గతంలో ఈ రిజర్వేషన్లను మాయావతే డిమాండు చేసారు. ఇప్పుడు కేంద్ర నిర్ణయాన్ని కాదన దానికి ఆమెకు కారణమేమీ కనిపించదు. 4)రాఫేల్ వ్యవహారంపై ప్రస్తుతం మీడియాలో చర్చ జరుగుతుండడంతో దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించడం. 5) ఒకవేళ విపక్షాలెవరైనా దీనిని వ్యతిరేకిస్తే, వారిని దోషులుగా చూపడం.

ఈ చట్టం అమలవడం మూలంగా, కొన్ని సందర్భాల్లో రిజర్వుడు కులాల అభ్యర్థులైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు రెండు విధాలుగా నష్టపోతారు. 1) గతంలో జనరల్ కేటగిరి కింద ఉన్న 50 శాతం 40 శాతానికి తగ్గడం వల్ల కోల్పోయిన 10 శాతంలో ఇన్నాళ్లూ అడ్మిషన్లలో గాని, ఉద్యోగాల్లో గాని ఎంపిక అవుతున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మెరిట్ అభ్యర్థులు ఇకపై ఎంపిక కారు. వారు ఆ అవకాశాన్ని కోల్పోతారు. 2) ఈ అవకాశాన్ని కోల్పోయిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు వారి వారి నిర్దేశిత కోటాలో మెరిట్ ప్రాతిపదికన తొలి అభ్యర్థులుగా ఎంపికవుతారు. వీరి ప్రవేశాల మూలంగా ఇన్నాళ్లూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటాలో చివరి అభ్యర్థులుగా ఎంపికైనవారు ఇకమీదట ఎంపిక కారు. వారంతా తమ అభ్యర్థిత్వాన్ని కోల్పోతారు. ఒకవేళ కోల్పోయిన 10 శాతం జనరల్ కేటగిరిలో అగ్రకుల పేదలున్నా ఇదే న్యాయం వారికీ వర్తిస్తుంది. ఇన్నాళ్ళూ జనరల్ కేటగిరిలో 50 శాతం రూలు కింద ఎంపికవుతున్న వీరు ఇకపై తాజాగా ఏర్పరచిన 10 శాతం కోటా కింద మెరిట్ ప్రాతిపదికన ఎంపికవుతారు. కాబట్టి ఇటువంటి ప్రత్యేక సందర్భాల్లో అగ్రకుల పేదలకు కేంద్ర తాజా నిర్ణయం వల్ల ఎటువంటి లబ్ధి చేకూరదు. మిగతా సందర్భాల్లో అంటే జనరల్ కేటగిరి 10 శాతం పరిధిలో మెరిట్ అగ్రకుల పేద అభ్యర్థులు లేనప్పుడు మాత్రమే వీరికి ఈ 10 శాతం రిజర్వేషన్ల లబ్ధి చేకూరుతుంది.

తలెత్తబోయే సమస్యలు :

1) దేశంలో అన్ని రాష్ట్రాల్లోని కొన్ని కులాలు ఒకే పేరుతో లేవు. అలాగే ఒక కులం ఒక రాష్ట్రంలో వెనుకబడిన కులంగా కొనసాగుతుంటే అదే కులం వేరొక రాష్ట్రంలో అగ్రకులంగా చలామణిలో వుంది. ఉమ్మడి రాష్ట్రంలో వెనుకబడిన కులాలుగా గుర్తింపు పొందిన 26 కులాలు విభజన అనంతరం తెలంగాణలో అవి అగ్రకులాలుగా మార్చబడ్డాయి.

2) చట్టంలో రూ. 8 లక్షలలోపు వార్షిక ఆదాయం గల అగ్రకులాల వారిని రిజర్వేషన్లకు అర్హులుగా చేశారు. ఇది చాలా పెద్ద మొత్తం అని చాలా మంది భావన. రూ. 2.5 లక్షల వార్షిక ఆదాయం గలవారు ఆదాయపు పన్ను కడుతున్నప్పుడు రూ. 8 లక్షల ఆదాయం గలవారు పేదవారు ఎలా అవుతారని కాంగ్రెస్ నేత కపిల్ సిబాల్ ప్రశ్నించారు. అంతేగాక, దారిద్ర్య రేఖకు దిగువవున్న వారి ఆదాయానికి నిర్ణయించిన పరిమితికి ఇది సుమారు 16 రెట్లు అధికం.

3) అసంఘటిత రంగంలో పనిచేసే వారి వార్షిక ఆదాయం స్థిరంగా ఉండదు. వారికి పనిచేస్తే ప్రతిఫలం ముడుతుంది లేకపోతే లేదు. అంతేగాక వీరు ఎటువంటి ఆదాయ పన్ను రిటర్న్స్ ప్రభుత్వానికి సమర్పించరు. వీరి ఆదాయాన్ని గుర్తించడం కష్టం.

4) అలాగే ఇతర ప్రాతిపదికలైన వ్యవసాయ భూమి విలువ, ఇంటి స్థలం విలువ దేశ వ్యాప్తంగా ఒకే విలువ కలిగి వుండవు. ఢిల్లీ లేదా ముంబయి వంటి పెద్ద పెద్ద నగరాల్లో 200 చ॥గ॥ స్థలం లేదా ఇంటి విలువ, ఇతర నగరాల్లోని 200 చ॥గ॥ల స్థలం లేదా ఇంటి విలువ కన్నా చాలా రెట్లు ఎక్కువగా ఉంటాయి. అలాగే 5 ఎకరాల వ్యవసాయ భూమి విలువ రాయలసీమ జిల్లాల కన్నా ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో ఎక్కువగా ఉంటుంది.

5. అగ్రకుల పేదలకేనా ఈ పరిమితులు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఈ క్రీమీలేయరు, ఇతర పరిమితులు వర్తించవా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు.

6. కేంద్రం తాజాగా తెచ్చిన ఈ 10 శాతం ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు భవిష్యత్తులో రాష్ట్రాలలోని స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా అగ్రకులాల వారు ముఖ్యంగా పేదలు డిమాండు చేసే అవకాశముంది. గతంలో కీ॥శే॥ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు విద్య, ఉద్యోగాలలో 4 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, ఆ తర్వాత వారంతా కోర్టుకెళ్లి విజయం సాధించారు.

7. దేశ వ్యాప్తంగా ఇడబ్ల్యుఎస్‌లకు సంబంధించి ఎటువంటి కమిషన్ నియమించకుండా, ఎటువంటి సమాచారం సేకరించకుండా ఈసారి పార్లమెంటులో ఆదరాబాదరాగా బిల్లును ప్రవేశపెట్టింది. 1931 తర్వాత నేటి వరకు దేశ వ్యాప్తంగా ఎటువంటి కుల ఆధారిత సెన్సెస్ జరగలేదు. ఈ చట్టం న్యాయసమీక్షకు నిలబడుతుందా? లేదా? అన్న అనుమానాలు అందరిలో ఉన్నాయి. రాజ్యాంగ సవరణ చేసే అధికారం పార్లమెంటుకున్నా, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని 1973 కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

మోడీ ప్రభుత్వం ఉన్న పళంగా ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల తేనెతుట్టను కదిపింది. ఇది చట్టరూపం దాల్చి న్యాయ సమీక్షలో నెగ్గుకొస్తుందా? లేదా? ఒకవేళ నెగ్గుకొస్తే అధికార పార్టీకి రాజకీయ లబ్ధి రాబోయే ఎన్నికలలో చేకూరుతుందా? అన్నది కాలమే నిర్ణయిస్తుంది. కోర్టులో ఇది నెగ్గుకురావాలంటే దీనిని తీసుకురావడానికి ప్రత్యేక పరిస్థితులను చూపించాలి. ఎందుకంటే ప్రత్యేక పరిస్థితులలోనే 50 శాతం దాటి రిజర్వే షన్లను కల్పించవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. న్యాయస్థానం ఒప్పుకున్నా లేక ఒప్పుకోకపోయినా ఘనత అధికార పార్టీకే దక్కుతుంది. దేశంలో 90 శాతం ఉద్యోగాలు ప్రైవేటు రంగమే ఆక్రమిం చినపుడు,ఆ రంగంలో రిజర్వేషన్లు లేవుడు ఈ కసరత్తు అంతా దేనికని కేంద్రాన్ని కొందరు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వంలో నేడు 24 కోట్ల కొలువులు ఖాళీగా ఉన్నాయి. వీటినన్నింటిని నింపితేనే ఈ రిజర్వేషన్ల విస్తరణకు అర్థం ఉంటుంది. ఒకవేళ ఈ బిల్లు న్యాయపరీక్షకు నెగ్గితే, గత కొన్నేళ్ళుగా కొన్ని రాష్ట్రాల్లో నలుగుతున్న అగ్రకుల రిజర్వేషన్ల ఉద్యమాలకు ముగింపు పడుతుంది. కాని వారంతా దీనికి అంగీకరిస్తారా? అన్నది ప్రశ్న. ఆంధ్రప్రదేశ్‌లో కాపులు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయమైన 10 శాతంలో అయిదు శాతం కాపులకు కేటాయించడం వారు దానిని స్వాగతించడం గమనార్హం. రాష్ట్రంలో కాపుల జనాభా 50 శాతం ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం సరైనదే అవుతుంది. అలా కాకపోతే, మిగతా అగ్రకులాల వారు ప్రభుత్వానికి వ్యతిరేకులుగా తయారవుతారు. రాష్ట్ర బీజేపీ నాయకులు ఇప్పటికే దీనిపై విమర్శలు కురిపిస్తున్నారు. ఈ బిల్లు అమలుకు ఆర్.ఎస్.ఎస్. ఒత్తిడి కూడా మోడీపై ఎక్కువగా ఉన్నట్లు భోగట్టా. అన్ని రకాల వెనుకబాటుతనానికి లోక్‌సత్తా పార్టీ నేత జేపీ గారు చెప్పినట్లు ముఖ్య కారణం అవిద్య. అతిహీనంగా ప్రాథమిక విద్య ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. విద్యా ప్రమాణాలు పెంచకుండా రిజర్వేషన్లు ఏంటని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. విద్యను ముఖ్యంగా ప్రాథమిక విద్యను పాలకులు నాశనం చేసి రిజర్వేషన్లు కల్పించడం సబబు కాదని ఆయన ఒక టివి ఇంటర్వ్యూలో వాపోయారు. ఈ బిల్లుపై సుప్రీంకోర్టు కూడా కీలక అంశాలపై ప్రశ్నలను లేవనెత్తే అవకాశాలున్నాయి. ఎన్నాళ్ళ నుండో పెండింగులో పెట్టిన ముఖ్యమైన మహిళా బిల్లును పరిష్కరించకుండా ఈ బిల్లును తేవడం ఏంటని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ సుప్రీంకోర్టు ఈ రిజర్వేషన్లను అంగీకరిస్తే, రేపు ఈ అగ్రకులాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తమకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేసినా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. అటువంటపుడు ఈ అగ్రకుల అభ్యర్థులతో ఓబీసీ అభ్యర్థులు పోటీ పడగలరా అన్నది ప్రశ్న. ఎందుకంటే ఎలక్షన్ కమీషన్ దృష్టిలో అగ్రకుల కమ్మ లేదా రెడ్డి లేదా కాపు అభ్యర్థి అయినా మంగలి, కుమ్మరి, చాకలి అభ్యర్థి అయినా ఒక్కటే. అధికార పార్టీ ఆశించినట్లు రిజర్వేషన్లను కొత్తగా కల్పించి వాటి నుండి లబ్ధి పొందనున్న ఈ అగ్రకులాల వారు రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీకి కృతజ్ఞతతో ఓట్లు వేస్తారా? అన్నది సందిగ్ధమే. ఎందుకంటే గత మూడు ఆసక్తికర చారిత్రాత్మక ఘటనలే ఇందుకు ఉదాహరణలు. 1. మొట్టమొదటి సంకీర్ణ జనతా పార్టీ ప్రధాని మొరార్జీ దేశాయి 1-1-1977న తన ప్రభుత్వంలో కొంత మంది ఒత్తిడి మేరకు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించుటకై మడల్ కమీషన్ నియమించారు. కమీషన్ తన నివేదిక ప్రభుత్వానికి అందజేసేలోపే జనవరి 1980లో మొరార్జీ ప్రభుత్వం పడిపోతుంది. 2. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఇందిరా ప్రభుత్వం ఆ రిపోర్టును పట్టించుకోలేదు. 1990లో విపిసింగ్ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ఏడాదిలో అంటే రిపోర్టు సమర్పించిన 10 సంవత్సరాలు తర్వాత 7-8-1990న కేంద్ర కేబినెట్ మండల్ కమీషన్ రిపోర్టును ఆమోదించి దానిని అమలుకు అంగీకారం తెలిపింది. అగ్రకులాలు రెచ్చిపోయి సృష్టించిన విధ్వంసకాండ ఇంతా అంతా కాదు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా రథయాత్ర చేస్తున్న అద్వానీని బీహారు ప్రభుత్వం జైల్లో పెట్టింది. బయట నుంచి విపిసింగ్‌కు సహకారం అందిస్తున్న బీజేపీ తన సహకారాన్ని ఉపసంహరించటంతో విపి సింగ్ సర్కారు 11 నెలల్లోనే పడిపోయింది. ఆ తర్వాత ఆయన తిరిగి అధికారంలోకి రాలేకపోయారు. సుప్రీంకోర్టు ఇంద్రసహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో మండల్ కమిషన్ నివేదికకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్నది. 3. అగ్రకులాల సపోర్టు కోసం మరియు వారి కోపాన్ని శాంతింపజేయడానికి ఆ తర్వాత వచ్చిన ప్రధాని పివి నరసింహారావు, అగ్రకులాలల పేదలకు 10 శాతం రిజర్వేషన్లను కల్పిస్తే, పైన చెప్పినట్లు ఆ తర్వాత దానిని కోర్టు కొట్టివేసింది. సెప్టెంబరు 1993 నుండి పివి నరసింహారావు ప్రభుత్వం మండల్ కమీషన్ రిజర్వేషన్లను అమలు చేసింది. కాని 1996లో కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. కాబట్టి రిజర్వేషన్ల జోలికిపోయిన ఏ ప్రధాని మరలా ప్రధాని పీఠం ఎక్కలేదని ఈ ఉదాహరణను బట్టి అర్థమవుతుంది. చివరిగా కాపులకు 5 శాతం రిజర్వేషన్లు రిజర్వు చేయడం వల్ల ఇతర అగ్రకులాల వారు ఉద్యమించే అవకాశం లేకపోలేదు.

వ్యాసరచయిత, విశ్రాంత ఆచార్యులు, ఏ.యూ.
సెల్ : 9849102403

విశాలాంధ్ర

బతుకు
The Life

మంగళవారం
05 ఫిబ్రవరి 2019

చిన్నారి కళాకారిణి

నాట్యాన్ని ప్రదర్శించేదుకు వయస్సుతో సంబంధంలేదు. కళను ప్రదర్శించే సత్తా ఉంటే చాలని ఈ చిన్నారి కళాకారిణి నాట్య ప్రదర్శనకు సిద్ధమవుతోంది. నాట్యానికి ముందే తన కళ్ళతో పది మందిని ఆకట్టుకుంటోందీ చిన్నారి.



అక్షరాలకు భావాలు అద్దండి



రాసే విధానంలో వ్యాసాలు, నివేదికలు, లేఖలు, ఉపన్యాసాలు, పనికి సంబంధించిన ఇమెయిల్స్ అని చాలా రకాలున్నాయి. వీటన్నింటికి ఒకే శైలిని ఫాలో అవ్వలేం. ఒక్కొక్క దానికి ఒక్కో శైలిని ఉపయోగించి రాస్తుంటాం. ఇలా రాయడం వల్ల అవి వాటితత్వాన్ని పాఠకులకు అర్థమయ్యేలా వివరిస్తాయి. మీ శైలి ఏదైనప్పటికీ మీరు కాగితంపై రాసే ప్రతి అక్షరం మీ భావాలను పలికించాలి. మరి ఇలాంటి అక్షరాలు రాసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో తెలుసుకుందామా...!

దేని గురించి రాస్తున్నారో పూర్తిగా తెలుసుకోండి.

రాయడం మొదలు పెట్టడానికి ముందు ఏ విషయం గురించి ఎందుకు రాస్తున్నారో ఒక్కసారి మిమ్మల్ని ప్రశ్నించుకోండి. అకడమిక్స్‌కి సంబంధించిన వ్యాసం లేదా అసైన్‌మెంట్స్‌కు సంబంధించిన పనైతే మీ పాఠ్యపుస్తకాల్లో ఉన్న సమాచారాన్ని ఉన్నది ఉన్నట్లుగా రాయాలి. మీరు ఏదైనా బిజినెస్ నివేదికలైన, సిఫార్స్, కంప్లెంట్‌కు సంబంధించిన లేఖలు రాసే విధానాన్ని బట్టి ఫలితం ఉంటుంది. అందుకని మీరు రాయడానికి ముందు రాసే విధానం గురించి కొంచెం ఆలోచించండి. అంతేకాక తక్కువ పదాల్లో ఎక్కువ అర్థం ఉండేలా చూస్తే చాలా బావుంటుంది.

సరైన శైలిని ఎంచుకోండి.

సంభాషణలో ఒక్కొక్కరికి ఒక్కో రకమైన శైలి ఉంటుంది. ఈ శైలి వారి ఆలోచన విధానాన్ని ప్రతిబింబిస్తుంది. మనం మేనేజర్‌తో ఒకలా మాట్లాడతాం, లెక్చరర్‌తో మరో రకమైన విధానంలో మాట్లాడతాం, స్నేహితులు, సన్నిహితులతో ఆప్యాయంగా మాట్లాడతాం. ఇదే విధానం రాసేటప్పుడు కూడా పాటించాలి. అందుకోసం సరైన శైలిని ఎంచుకోవాలి. దీని వల్ల అవతలి వ్యక్తులు స్పందన సరిగ్గా ఉండేలా చూసుకోవాలి. అకడమిక్ రాతకు ఒక శైలి, బిజినెస్‌కు మరొక శైలి ఉండేలా జాగ్రత్తపడాలి.

ఒక ప్రణాళికతో మొదలు పెట్టండి.

చాలా మంది ఒక ప్రణాళికనేదే లేకుండా రాస్తారు. దీని వల్ల రాసిన పదాలకు, వాక్యాలకు ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా ఉంటాయి. దీంతో విషయం పూర్తిగా ఉండదు. మీరు పదివేల పదాలతో ఒక నివేదిక లేదా ఫిర్యాదును ఒక ప్రణాళికతో రాస్తే మొదట ఏమి రాయాలో మధ్యలో ఏం రాయాలో అనే ఒక విధానం మీకు అవగతమవుతుంది. దీంతో మీరు రాసింది చాలా ప్రభావాన్ని చూపుతుంది. మీరు రాయడంతో పాటు అవసరమైన చిత్రాలను ఉపయోగిస్తే ఇంకా బావుంటుంది.

పాఠకులకోసం రాయండి, మీకోసం కాదు.

మీరు రాస్తున్నారంటే అర్థం అది మీకోసం కాదు, ఇతరుల కోసం. మీ రాతతో మీ భావాలను ఇతరులతో పంచుకోవడం మీ లక్ష్యం. అందుకనే మీ మనస్సులో ఉన్న ప్రతి పదాన్ని రాయండి. మీరు రాసే అంశంపై పూర్తి సమాచారం రాస్తున్నారో లేదో మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఒక వేళ మీరు సరిగ్గా రాయలేదంటే దీని వల్ల మీ సమయం, మిగిలిన వారి సమయం మీరు వృథా చేస్తున్నట్లే అనే విషయాన్ని గుర్తుంచుకోండి.

మీ రాతల ద్వారా పాఠకులను గైడ్ చేయండి.

పాఠకులకు అర్థమయ్యేలా విషయాన్ని రాయడం అవసరం. దీనిలో భాగంగా విషయం కచ్చితమైనదిగా త్వరగా అర్థమయ్యేదిగా ఉండాలి. అందుకని మొదటి నుంచి చివరి వరకు ఉన్న వాక్యాలు, పేరాలు ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉండేలా చూసుకోవాలి.దీని కోసం ఒకసారి పర్యాయపదాన్ని వినియోగిస్తే మరొకసారి వ్యతిరేకపదాన్ని వాడవలసి ఉంటుంది. దీని కోసం ఏ మాత్రం భయపడక్కర్లేదు. మీరు రాసేది ఒకటి రెండుసార్లు చూసుకోండి. దీని ద్వారా పాఠకుడు విషయాన్ని ఎలా అర్థం చేసుకుంటాడో అనే విషయం తెలుస్తుంది. ఇలా చేయడం వల్ల పాఠకులకు సరైన గైడెన్స్ ఇవ్వవచ్చు.

క్రియలను తగు రీతిలో ఉపయోగించండి.

రకరకాలుగా ఉన్న ఈ రాత విధానాల్లో క్రియను అన్నింటికి ఒకేలా వినియోగించరు. ఈ విషయాన్ని గుర్తుంచుకొని నిబంధనలకు లోబడి క్రియను రాయాల్సి ఉంటుంది. సాధారణంగా చాలా మంది రాసేటప్పుడు కర్తరీ వాక్యం కన్నా కర్మణీ వాక్యాన్ని ఎక్కువగా వినియోగిస్తారు. మీరు ఈ రెండింటిలో దేనిని ఎంచుకుంటారో దానిని చివరి వరకు ఫాలో అవ్వండి. రాతలో మనిషి పరోక్షంగా ఉంటాడు. అందుకని సమస్య వ్యక్తిగా, ధ్వని వారు రాసే అక్షరాలుగా ఉంటాయి. ఇందులో సందేశం కీలకమైన భాగం. దీన్ని క్రియాత్మకంగా వివరించడమే రచయిత ప్రత్యేకత. ఇలా వివరించడం వల్ల పాఠకులు త్వరగా అర్థం చేసుకుంటారు.



ఎడారి గులాబీ... ఇంట్లో



గులాబీలు అంటే తెలియని వారుండరు, ఇష్టపడని వారుండరు. మరి ఎడారి గులాబీ గురించి తెలిసిన వారెందరు.. దీని గురించి మాత్రం కనీసం వినుందరేమో ! అడినమ్ పువ్వును ఎడారి గులాబీ అంటారు. దీని పేరు ఎడారి గులాబీ కానీ దీనిని ఇప్పుడు ఇళ్లల్లోనూ పెంచేస్తున్నారు. ఆకర్షణీయమైన గార్డెన్ అంటే ఇది ఉండి తీరాల్సిందే. పువ్వుల మొక్కలు అందంగా ఉండాలంటే ఒకే రకానికి చెందిన పువ్వులు గుంపులుగా ఉండాలి. ఈ ఎడారి గులాబీ మాత్రం మిగిలిన పూల మొక్కలుకు భిన్నంగా ఒక్క మొక్క ఉంటే చాలు. మొత్తం గార్డెన్‌కే అందాన్ని తీసుకువస్తుంది.

ఎడారి గులాబీ దాని రంగుతో, ఆకారంతో ప్రత్యేకమైన గుర్తింపును కలిగి ఉంది. అలా అని ఈ పువ్వు రేకలు ఎక్కువగా ఉండవు. ఒంటిరేక కలిగిన పువ్వు ఇవి. ఈ ఎడారి గులాబీలో చాలా రకాలున్నాయి. రెండు రేకలు, మూడు రేకలున్నవీ ఉన్నాయి. ఇది మామూలు గులాబీను పోలి ఉంటుంది.

ఎడారి గులాబీలు మొదట్లో గులాబీ రంగులో మాత్రమే వచ్చేవి. ఇప్పుడు పసుపు, ఎరుపు, తెలుపు, వైలెట్ రంగుల్లో కూడా దొరుకుతున్నాయి. ఇది సంవత్సర కాలంలో ఎక్కువ సార్లు పూస్తుంది. అందుకనే దీన్ని పూల కుండీల్లో వేసి పెంచుతున్నారు.

విదేశీ మొక్కలు కేవలం బోన్‌సాయ్ గార్డెన్‌కు మాత్రమే సహకరిస్తున్నాయి. బోన్‌సాయ్ మొక్కలను అంటుకట్టడం ద్వారా అభివృద్ధి చేస్తారు. మీ గార్డెన్ వెలితిగా ఉన్నట్లయితే ఈ మొక్కను పెంచి చూడండి. ఇది బోన్‌సాయ్ పద్ధతిలో సులువుగా పెరుగుతుంది.

మొక్క నాటడానికి...

ప్లాస్టిక్ కుండీలైతే ఎడారి గులాబీల పెంపకానికి సరిగ్గా సరిపోతాయి. ప్లాస్టిక్ కుండీలు కనీసం 10నుంచి 12అంగుళాలైనా ఉండాలి. లేదా ఇంట్లో పాడైన ప్లాస్టిక్ వస్తువులను కూడా ఎడారి గులాబీని పెంచడానికి వినియోగించవచ్చు. కుండీలో మొక్కను వేయడం కోసం అర కుండీ ఎర్ర మట్టి, సహజమైన ఎరువు, వేప ఆకులును తీసుకోండి.



ముందుగా మట్టిని ఆ తర్వాత ఎరువు, వేప ఆకులను వేసి మొక్కను నాటండి. ఇలా చేయడం వల్ల మొక్కకు కావలసిన పోషకాలు అందడంతో పాటు బాక్టీరియా దరి చేరకుండా చక్కగా ఎదుగుతుంది.

తీసుకోవలసిన జాగ్రత్తలు

మొక్క నాటి ఆరు నెలలు గడిచిన తర్వాత లేదా సంవత్సరం తర్వాత మొక్కను సరైన రీతిలో కత్తిరించాలి. ఇలా చేస్తే మొక్క అందంగా ఎదుగుతుంది. కాండానికి ఐదు అంగుళాలపైన దీనిని కట్ చేయాలి. దీన్ని కత్తిరించడానికి వర్షాకాలం సరైన సమయం. ఒక్కసారి మొక్కను కత్తిరించాక మొక్కకు ఫంగస్ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈ ఎడారి గులాబీకి ఎక్కువగా సూర్యరశ్మి అవసరమవుతుంది. నీటి అవసరం మాత్రం చాలా తక్కువగా ఉంటుంది. రోజు మొక్కకు నీళ్లు పోయడం వల్ల పువ్వు ఎక్కువ సమయం తాజాగా ఉంటుంది. వర్షాకాలంలో మాత్రం మొక్కను జాగ్రత్తగా కాపాడుకోవాలి. వర్షం సరాసరి మొక్కపై పడకుండా చూసుకోవాలి. మరీ ముఖ్యంగా వర్షాకాలంలో కుండీలోని మట్టి పొడిబారినట్లు ఉంటేనే నీరు పోయాలి.

మేక ఎరువు, వేపతో తయారైన ఎరువు, ఆవు మూత్రాన్ని కలిపి ఇవ్వండి. ఇలా చేయడం వల్ల మొక్క ఆరోగ్యంగా ఉండి ఎక్కువ పువ్వులను ఇస్తుంది.

సంరక్షణ..

1 ఫంగస్‌కు దూరంగా ఉంచడానికి మూడు గ్రాముల ఇన్‌డోఫిల్ ఫంగిసైడ్‌ను తీసుకొని ఒక లీటరు నీటిలో కలిపి కుండీలో వేయండి. లేదా రెండు వారాలకు ఒకసారి ప్రత్యేకించి వర్షాకాలంలో మొక్కపై చల్లండి.

2 కాన్‌టఫ్/టాటామిదా ఫంగిసైడ్‌ను లీటరు నీటిలో కలిపి రెండు వారాలకొకసారి కుండీలో పోయండి. ఇలా చేస్తే కీటకాలు దరి చేరవు.

3 వానపాములు దరి చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సరైన విధానంలో మొక్కను కత్తిరించి ఫంగస్ దరి చేరకుండా చూసుకోవాలి.

గొడవ...మంచిదే!

భార్యాభర్తల మధ్య గొడవ సాధారణమే. గొడవ పడగానే ఇద్దరూ మూతులు ముడుచుకుంటారు. ఎడమొఖం...పెడమొఖం పెడతారు. ఆ తర్వాత ఇద్దరి మధ్యా ప్రేమానుబంధం మరింత పెరుగుతుంది. అందుకే గొడవ మంచిదే అన్నారు మన పూర్వీకులు, పెద్దలు. ఇప్పుడు పరిశోధనలూ అవే చెబుతున్నాయి. జంటల మధ్య ఫైటింగ్ ఆరోగ్యకరమే అంటున్నాయి. అయితే ఈ గొడవలు చిన్నగానే ఉండాలి తప్ప చిలికిచిలికి గాలివానలా మారకూడదు. బంధం తెగేవరకూ వెళ్ళకూడదు. అలాకాకుండా ఉండాలంటే తీవ్రంగా తిట్టుకోవడం, కొట్టుకోవడం, విపరీతమైన భావోద్వేగాలకి లోను చేయడం లాంటివి ఇద్దరి మధ్యా ఉండకూడదు. నిందార్హమైన మాటలు మాట్లాడకూడదు. అతి కోపం మాటల నుంచి వాదనలోకి దింపుతుంది. ఇవేమీ లేకుండా జరిగే చిన్నపాటి గొడవలు మాత్రం భాగస్వాముల మధ్య బంధాన్ని మరింత రెట్టింపు చేస్తాయి. ఇందుకు కొన్ని కారణాలూ ఉన్నాయి.

నమ్మకం పెరుగుతుంది

పెళ్ళైన కొత్తల్లో, ఒకరి గురించి ఒకరికి పూర్తిగా తెలియని రోజుల్లో ఇద్దరి మధ్య గొడవ మేలే చేస్తుంది. ఈ పరిస్థితి ఒకరినొకరు తెలుసుకునేలా చేస్తుంది. మీ మధ్య బంధంలో మీ నుంచి ఎదుటివారు ఏం కోరుకుంటున్నారో అర్థమయ్యేలా చేస్తుంది. అంటే పరస్పరం నమ్మకం, విశ్వాసం పాదుకొనేలా చేస్తుంది. మనస్పర్థలు తొలగిపోయేలా చేస్తుంది. సాధారణంగా మన మనస్సులో ఏముందనేది ఎదుటివారు గ్రహించడం కష్టం. అంతర్లీనంగా దాగి ఉన్న ఇలాంటి భావాలు కొన్నిసార్లు వాదన, గొడవ కారణంగా బయటపడతాయి. నిజాయితీగా మసలుకోవడం, పరస్పరం గౌరవించుకోవడం కూడా అలవడతాయి.



తప్పొప్పులు తెలుస్తాయి

గొడవ పడే క్రమంలో ఒకరినొకరు దూషించుకుంటూ ఎదుటివారిపై ఉన్న అభిప్రాయాలతో పాటు అక్కసులు బయటపడుతుంటాయి. ఇలాంటప్పుడు ఇద్దరూ చేయకూడని తప్పులేమిటో కూడా అర్థమయ్యే అవకాశం ఏర్పడుతుంది. ఇద్దరి మధ్య బంధం నిలబడాలనుకున్నప్పుడు, సామరస్యంగా ఉండాలనుకున్నప్పుడు ఈ తప్పులు మళ్ళీమళ్ళీ చేయకూడదనే నిర్ణయం తీసుకునేందుకు దోహదపడుతుంది. గొడవ సద్దుమణిగిన తర్వాత, కోపం చల్లారిన తర్వాత కూర్చుని మాట్లాడుకున్నప్పుడు రాజీకి రావడం మామూలే. తప్పొప్పులు తెలిసిన తర్వాత ఇద్దరి మధ్య బంధం మరింత పటిష్టమవుతుంది.

ఫీల్ బెటర్

భావాలను బయటపెట్టడమనేది ఎప్పుడూ మంచిదే. పరిష్కారం కాని సమస్య మనిషిని కుంగదీస్తుంది. ఇది బంధం మీద ప్రభావం చూపుతుంది. భాగస్వామి మీదే కాదు మీ చుట్టూ ఉన్న వాతావరణం మీదా ఈ ప్రభావం కనిపిస్తుంది. మన మనస్సు మీద, పనిమీద ఒత్తిడిని పెంచుతాయి. ఉన్న భావాన్ని బయటపెట్టేస్తే మనస్సు తేలికపడుతుంది. ఎంతో భారం దిగినట్టు అవుతుంది. అన్నింటినీ మించి మీ చుట్టూ ఉన్న ఒత్తిడి నుంచి బయటపడతారు.

జ్ఞాపకాలుగా...

కొన్ని గొడవలు మంచి జ్ఞాపకాలుగానూ మిగులుతాయంటే ఆశ్చర్యం కలుగుతుంది కానీ ఇది వాస్తవం. కొన్ని చిన్నచిన్న విషయాలే పెద్ద గొడవలుగా మారతాయి. తర్వాత ఆలోచిస్తే ఇంత ఫూలిష్‌గా ప్రవర్తించామా? అనిపిస్తుంది. అలాంటి గొడవల గురించి గుర్తు చేసుకున్నప్పుడు ఒక విచిత్రానుభూతి ఎదురవుతుంది. అలాంటిది మరి గొప్ప జ్ఞాపకం కాకుండా ఎలా ఉంటుంది. మరి గొడవ...బంధానికి మరింత బలాన్ని ఇస్తుందన్నది నిజమేనని ఇప్పుడు మనమూ ఒప్పుకోవలసిందే కదా !

కళ్ళకు...పసుపు నీళ్ళు



మానవ శరీరంలో అత్యంత అందమైన భాగం నయనాలు. కళ్ళను చూసి మనం ఎంత ఆరోగ్యవంతులమో చెప్పవచ్చుననేది ఎప్పటినుంచో వాడుకలో ఉన్న మాట. దీనినిబట్టే అర్థం చేసుకోవచ్చు కళ్ళు ఎంత ప్రాధాన్యతగలవో. కంటి ఆరోగ్యం కోసం పూర్వం తీసుకునే జాగ్రత్తలు ఏవీ ఇప్పుడు తీసుకోవడం లేదు. దాని ఫలితం కళ్ళ సమస్యలు. మరి కంటి కోసం ఆనాడు మన పెద్దలు తీసుకున్న జాగ్రత్తలు ఏమిటో తెలుసుకుందాం, ఆచరిద్దాం, కళ్ళను కాపాడుకుందాం.

- మేక పాలలో కొద్దిగా పంచదార కలిపి కంట్లో వేసుకోండి. ఎర్రబారిన కళ్ళు మామూలు స్థితికి వస్తాయి. చీము పట్టడం లాంటి సమస్యలూ తగ్గుతాయి.
- గంధంలో కొద్ది తల్లిపాలు కలపండి. ఇవి కంట్లో వేసుకుంటే కంటి దురదలు పోతాయి.
- ఆవుపాలు మరిగించి వాటి ఆవిరితో కంటికి వెచ్చదనాన్ని అందిస్తే కంటి ఆరోగ్యం బాగా మెరుగుపడుతుంది.
- కంటివెంబడి నీళ్ళు అదేపనిగా కారుతూ ఉంటే...పసుపు నీళ్ళల్లో ముంచిన గుడ్డతో కళ్ళు తుడవండి.
- వావిలి ఆకు రసం చుక్కలు ముక్కులో వేసుకుంటే కంటి నొప్పులు తగ్గుతాయి.
- కళ్ళల్లో దుమ్ము పడినప్పుడు ఉపశమనం కలగాలంటే....తమలపాకులు నూరి అందులో కొద్దిగా వెన్న, కొంచెం రాతి ఉప్పు కలిపి బాగా మెత్తగా గుజ్జులా చేసి కంటికి రాయండి.



దగ్గుకి తక్షణ ఉపశమనం కోసం...

- చలికాలంలో దగ్గు ఎక్కువగానే వేధిస్తుంది. దీనికి తక్షణ ఉపమశనం కావాలంటే కాఫీ లేదా టీ లేదా మీకు ఇష్టమైన ఏదైనా సూప్ తీసుకుని చూడండి.
- వేడి నీటి స్నానం చేయండి. స్టీమ్ షవర్ వల్ల దగ్గు మాత్రమే కాదు జలుబు, అలర్జీ, ఆస్తమా నుంచి కూడా రిలీఫ్ దొరకుతుంది.
- దగ్గుని నివారించే సహజమైన ప్రక్రియల్లో మసాలా ఛాయ్ ఒకటి. ఈ టీలో పసుపు కూడా వేస్తే మరింత ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. పెద్దలూ, పిల్లలూ కూడా తాగవచ్చు.

చంటి పిల్లలకు సౌకర్యంగా...!

మొదటిసారి తల్లిదండ్రులు కావడమనేది మాటల్లో వర్ణించలేని అనుభూతి. ఈ మధుర క్షణాలు జీవితంలో ఒక్కసారే వస్తాయి. జీవితంలో తల్లి అవ్వడం ఓ అద్భుతమైన అనుభూతిని కల్గిస్తుంది. ప్రసవ సమయంలో ఆ తల్లి పడే బాధ అంతో ఇంతో కాదు. ఆమెకు మళ్ళీ అది పునర్జన్మ అనే చెప్పుకోవాలి. కానీ బిడ్డ ముఖం చూడగానే ఆ తల్లి నొప్పులన్నీ మరిచిపోయి చిరునివ్వును చిందిస్తుంది. ఆ నిముషం భార్యాభర్తలు తమ జీవితంలోకి మూడో మనిషిని సాదారంగా ఆహ్వానిస్తారు. కొత్తగా వచ్చిన అతిధి కోసం వారి ఇంటిని జాగ్రత్తగా, అందంగా అలంకరిస్తారు. చంటి పిల్లల కోసం ఇంటిని అలంకరించడమనేది అంత సులువేం కాదు. కొంచెం ఆలోచించి కష్టపడాల్సి ఉంటుంది. చంటి పాపల కోసం ఇంటిని అలంకరిస్తుంటే ఇలా చేయండి.



ఇంట్లో ఎల్లప్పుడూ శబ్దం చేసే సామాన్లను ఏర్పాటు చేయండి. ఇంట్లోని కర్టెన్స్ ముదురు రంగులో ఉన్నవాటిని ఉపయోగించండి. అంతేకాక వీటికి శబ్దం చేసే డిజైన్ ఉన్న లేయర్లు ఉండేలా చూసుకోండి. ఇవన్నీ తల్లికి నిద్ర రాకుండా చేస్తాయి. ఎందుకంటే కడుపుతో ఉన్న సమయంలో తల్లి ఎక్కువ సమయం నిద్రపోతుంది. డెలివరీ తర్వాత నిద్ర రాకుండా ఉండడం కోసం ఇంటిని కొంచెం శబ్దం వచ్చేలా చూసుకోండి.

పూర్తిగా నిద్రపోవడం అనేది కొత్తగా తల్లయిన వారికి సాధ్యపడదు. దీని కారణం చంటి పాపలను సంరక్షించుకోవడం కోసం వారి నిద్రను త్యాగం చేస్తారు. అందుకని పిల్లలు పడుకున్న సమయంలోనే మీరు పడుకోవడానికి వీలుగా ఎక్కువ దిండ్లు, కుషన్స్ ఉండేలా చూసుకోండి. దీని వల్ల పిల్లలు కిందపడతారన్న భయం ఉండదు.

పిల్లల ఊయలను తల్లికి దగ్గరలే ఉండేలా ఏర్పాటు చేసుకోండి.ఎందుకంటే రాత్రి సమయంలో పిల్లలు తరచూ నిద్రలేస్తుంటారు. ఆ సమయంలో ఊయల దగ్గరగా ఉంటే తల్లి వెంటనే బిడ్డను దగ్గరకు తీసుకోగలుగుతుంది.

ఊయల చుట్టూ చిన్న చిన్న జేబులున్న కర్టెన్‌ను ఏర్పాటు చేయడం వల్ల పిల్లలకు అవసరమైన వస్తువులైన వైపర్స్, డైపర్స్, క్లాత్స్ వంటివి అందులో పెట్టుకోవచ్చు.

చాలా మంది పిల్లల గదిలో ఆడ, మగ అనే తేడాను బట్టి రంగులు ఎంచి పెడతారు. ఈ పద్ధతి సరైనది కాదు. ఇలా చేయడం వల్ల పిల్లలకు పెరుగుతున్న కొద్ది హద్దులను తెలియజేస్తుంది. అందుకని మీ పిల్లలను సమానంగా పెంచండి.

నేను - సుడిగుండం

(నవల) 36



పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575

నిన్నటి సంచిక తరువాయి

"ప్రభాత్ నువ్వు నన్ను రాత్రి పూట కారు తీయనీయవు. నాకు అది అలవాటు. నీకు ఛాదస్తమైన భావాలు వున్నాయా?"

"అంటే..."

"ఆడపిల్లలు అర్ధరాత్రి బయటకు వస్తే ఏదో జరిగిపోతుందని?"

"అలా జరగటం లేదా?"

నవ్వింది.

ప్రపంచంలో ఏవో జరుగుతుంటాయి. అవన్నీ మనం కేర్ చేయాలా? అంది.

ఇంకొంచెం సేపు వుండి బయలుదేరటానికి లేచాను. మా మధ్య టీపాయ్ వుంది. నేను దాని అంచులకి కొట్టుకున్నాను. అప్పుడు తను పడకుండా ఆపింది. అలా తెలియకుండా హగ్ చేసుకున్నాను.

"సారీ" అన్నాను.

"మళ్లీ సారీలు..." అంటూ నా కళ్లల్లోకి చూసింది. అప్పుడు నాలో ప్రకంపనలు మొదలయ్యాయి.

"నెలలు తరబడి నీ వైఫ్ కి దూరంగా ఎలా వుంటున్నావు? నీకు బిజినెస్, ఛానల్ తప్ప ఇంకేం పట్టదా" అంది.

"నువ్వు కూడా..." అని ఆగిపోయాను.

నన్ను బలంగా అదుముకుంది. నాలోకి మోహం ప్రవహించింది. ఆ తర్వాత ఇద్దరం ఒకరిలో ఒకరం లీనం అయిపోయాం .

"ఈ రాత్రికి యిక్కడే వుండు" అంది. "పనుంది. వెళ్తాను" అని వచ్చేసాను.

****

రాత్రి ఎంతకూ నిద్ర పట్టలేదు.

వెన్నెల గుర్తొచ్చింది. తనకు అన్యాయం చేసానా అనుకున్నాను. అంతలోనే ఇదంతా శీలం చుట్టూ మనం ఏర్పరుచుకున్న 'మిత్' అనిపించింది. సెక్స్ అనేది భౌతిక అవసరం. ఇప్పుడేదో జరిగిపోయిందనీ కృంగిపోవాల్సిన అవసరం లేదు. అనుకున్నాను అంతలోనే....

అయినా రకరకాల ఆలోచనలు. అమితా, వెన్నెల - మావయ్య అందరూ నా మీద పడి ఎందుకిలా చేసావు అని అరుస్తున్నట్లు...

ఉదయం లేచాను. మళ్లీ పనుల హడావుడి. 'అనీ' మామూలుగానే వుంది. లంచ్ టైమ్‌లో అడిగింది.

"రాత్రి ఇంటి దగ్గరే వుంటే హాయిగా నిద్ర పోయేవాడివి" అని. నేను మాట్లాడలేదు.

ఆ యాక్సిడెంట్ అనుభవం అంతటితో ఆగలేదు. కంటిన్యూ అయింది. నాలో అపరాధ భావన లాంటిది లేదు. అనిందితని నేను ప్రేమిస్తున్నాను అని అర్థం అయింది.

ఆఫీస్‌లో రూమర్స్ మొదలయ్యాయి. మేం మళ్లీ పెళ్లి చేసుకోబోతున్నాం అని. అవి హైదరాబాద్ వరకు పాకాయి. ఇలాంటివి అనీ అస్సలు కేర్ చేయదు.

రమాకాంత్‌తో ఛానల్ విషయాలు చర్చించాక ఈ విషయం అడిగాడు. నేను మాట్లాడలేదు.

"ఇది నీ వ్యక్తిగత విషయం. నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే ఓ సలహా.... నెలలకి నెలలు నువ్వు నీ భార్యకి దూరంగా వుంటున్నావు. మిగతా పనులన్నీ మానుకునేంతగా మోహంలోకి కూరుకుపోకు. ఇంకో విషయం నీ కుటుంబంలో ఇది చిచ్చు పెట్టకుండా చూసుకో... అలాగే రేపు అనిందిత నీమీద స్వారీ చేయకుండా జాగ్రత్త పడు" అంటూ ఓ ఉదాహరణ చెప్పాడు. ముంబయ్‌కి చెందిన ఓ రచయితకి పెళ్లి అయింది. అతను ఓ నటితో సంబంధం పెంచుకున్నాడు. తర్వాత ఆమెకు గర్భం వచ్చిందని చెప్పి బ్లాక్‌మెయిల్ మొదలు పెట్టింది- నన్ను పెళ్లి చేసుకో అని. అతను కుదరదన్నాడు. అయితే బిడ్డను కన్నాక ఈ విషయం బ్లాస్ట్ చేస్తాను. డి.ఎన్.ఎ. టెస్ట్ చేయిస్తే తండ్రి ఎవరో తెలిసిపోతుంది అని. అయిదు కోట్లు యిచ్చి ఆ నటిని వదిలించుకున్నాడు. అదీ అతన్ని అభిమానించే ఓ నిర్మాత నుండి డబ్బు తీసుకుని.

"థాంక్స్" అన్నాను. అనిందిత అలాంటిది కాదు. తనకు పెళ్లి అంటేనే అసహ్యం. నాకు సంప్రదాయవాదులుగాని, అభ్యుదయవాదులుగాని, ఇలాంటి విషయం మీద ఏర్పరుచుకున్న భావాల్ని బద్దలు చేయాలన్న పట్టుదల ఏర్పడింది. అంతేకాదు వ్యాపారానికి ఏదీ అతీతం కాదు.

మెల్లగా హైదరాబాద్ సర్కిల్స్‌లోనూ మందు తాగుతున్నప్పుడు ఇదో ఇష్యూ అయిందని తెలిసింది. అది వెన్నెల వరకూ



పాకింది. నాకు తెలిసినంత వరకు తనకు ఆకాశరామన్న ఉత్తరం వెళ్లింది.

****

నేను ఈ విషయంలో వెన్నెల దగ్గర ఏమీ దాయ దలుచుకోలేదు. హైదరాబాద్ వచ్చాక వెన్నెలా - నేను ఎదురెదురుగా కూర్చున్నాం. నిదా మా మధ్యలో లేదు. నాకు అనిందితకు మధ్య వున్న రిలేషన్ గురించి చెప్పాను.

"నువ్వు నన్ను పెళ్లి చేసుకోక ముందు, చేసుకున్నాక కూడా నా కాళ్ల మీద నేను నిలబడాలి అనేవాడివి. ఇందుకా బావా నన్ను చదువుకోమన్నది" అనగా నేను నిర్ఘాంతపోయాను.

"అంటే నీ మనసులో ఇలాంటిది భవిష్యత్తులో జరుగుతుందని ముందే వుందన్నమాట. ఒకందుకు నాకు సంతోషంగా వుంది. చాలామంది మగవాళ్లు ఇలాంటి అక్రమ సంబంధాలు పెళ్లానికి తెలియకుండా సాగిస్తారు. భార్య అడిగినా అదేం లేదని బుకాయిస్తారు. నువ్వు మాత్రం హాయిగా ముందు చెప్పావు" అంది.

తను పూర్తిగా మాట్లాడక నేను మాట్లాడాలనుకున్నాను.

"నాకు చెప్పినప్పుడు మాత్రం ఇలాంటిది జరుగుతుందని అనలేదు. నేను చచ్చిపోతే అన్నాను. నేను నీ అంత తెలివిగల దాన్ని కాదు. ఇన్ని జాగ్రత్తలు చెప్పినా నేను చదువుకోలేదు. నాకు నువ్వంటే వెర్రి నమ్మకం. ఇప్పుడూ అంతే. నావల్ల నీకు ఎలాంటి సమస్య రాకూడదని అప్పుడూ చెప్పాను. ఇప్పుడూ చెబుతున్నాను."

"నువ్వేమంటావు వెన్నెలా?"

"ఇప్పుడు మనం విడాకులు తీసుకుందాం అంటావా బావా?"

"అవన్నీ నేను ఆలోచించలేదు"

"ఆలోచించాలి కదా బావా. వెన్నెల నేను ఏం చెప్పినా ఒప్పుకుంటుంది అనుకున్నావా? నాకు భరణం ఇవ్వటానికి బేరం ఆడుతున్నావా?"

"నేను నీకు భరణం ఇవ్వను. విడాకులు ఇవ్వను"

"ఆమెను నువ్వు వదులుకుంటాను అంటున్నావా?"

నేను మాట్లాడలేదు.

"పెళ్లి చేసుకుంటావా? ఇంతకుముందు నన్ను పెళ్లి చేసుకున్నావు. ఇంకో పెళ్లి ఎలా చేసుకుంటావు - నేనింకా బతికివుండగా! పోనీ నన్ను ఆత్మహత్య చేసుకోమంటావా?"

"నువ్వు అసహ్యంగా మాట్లాడుతున్నావు. నేను అంత నీచమైన మనిషిగా కనిపిస్తున్నానా?" అన్నాను.

"అవన్నీ నాకు తెలియదు. నువ్వు చేసిన పని నేను చేసివుంటే నువ్వు నన్ను క్షమించేవాడివి. అలా నేను చేయను. ఎందుకంటే నాకు ప్రేమ గురించి చెప్పేంత జ్ఞానం లేదు. నేను నిన్ను ప్రేమించాను. ఇప్పుడు నిదాని. ఇంతకుముందు అత్తనీ, అమ్మా-నాన్నల్ని, నా చెల్లిని, అంటే మన కుటుంబాన్ని అంది.

"నీతో నేను తీరిగ్గా మాట్లాడతాను"

"ఇప్పుడే మాట్లాడుకుందాం. నువ్వు చెబుతున్న దాన్ని బట్టి ఇక్కడ నేను, అక్కడ ఆమె నీకు కావాలి..

"అనిందిత నన్ను పెళ్లి చేసుకోదు. మేం లివిన్ రిలేషన్‌లో వుంటాం"

"అంటే..."

"సహజీవనం"

"ఏదయితే ఏమిటి! నువ్వు చెబుతున్న ప్రకారం నీకు రెండు చోట్ల సంసారం కావాలి. అందుకు నేను ఒప్పుకోను"

"మీ ఊరు వెళ్లి మావయ్యా వాళ్ల దగ్గర వుంటావా?"

"ఉండను. వాళ్లు నాకు పెళ్లి చేసింది. మొగుడు వదిలేస్తే వాళ్ల దగ్గర వుంచుకోవటానికి కాదు. అలా అని నేను నీ ఇంట్లో వుండను. విడిగా వుంటాను"

"వెన్నెలా..." అంటూ ఏదో చెప్పబోయాను.

"నిదా గురించి... నేను పెంచుకుంటాను. నీ అంత మంచి బతుకు నేను నా కూతురికి ఇవ్వలేకపోవచ్చు. చదువుకుంటేనే ఆడవాళ్లు తమ కాళ్లమీద నిలబడతారు అని నువ్వంటావు. అది లేని ఆడవారు కూడా బతకగలరు"

"నిదా విషయం ఎందుకు?"

"నువ్వు తీసుకు వెళ్తావా? తన గురించి ఆలోచిస్తే ఇలాంటి పని నువ్వు చేయవు. అసలు అర్చన పెళ్లి చేసుకోవటాన్ని నేను ఇష్టపడలేదు. వాళ్లు ఇప్పటికి హాయిగా వుంటున్నారు. రేపు అతను కూడా నీలానే చేస్తే అందుకు అర్చన అనుభవిస్తుంది తను నిర్ణయం తీసుకుంది కాబట్టి. మన పెళ్లి వెనక అత్త వుంది. నాన్న వున్నాడు. అత్త బతికి వుంటే ఏమనేదో, నువ్వు ఏం చెప్పేవాడివో నాకు తెలియదు. కనీసం నిదా మీద నేను బతికి వున్నంత వరకు ఇలాంటి ప్రభావం పడకుండా చూసుకుంటాను"

ఈ పరిస్థితిలో వెన్నెలతో మాట్లాడటం అనవసరం అనుకున్నాను.

****

కాలం కొన్ని సమస్యలు పరిష్కరిస్తుందని నా అనుభవం నాకు చెప్పింది. అయితే నేను అనుకోని విధంగా రెండు చిన్న గదులు అద్దెకు తీసుకుని నిదాతో వెళ్లిపోయింది వెన్నెల. నాకు కొంచెం బాధ అనిపించింది.

ఇది వెన్నెల ఆవేశంతో చేసిన పని.

మళ్లీ నేనూ-వెన్నెల కలుస్తాం అనిపించింది. అయితే ముందు ముందు నేను మావయ్యనీ ఎదుర్కోవాలి అని నాకు తెలుసు.

నేను అనిందితతో బంధాన్ని ఇక్కడితో ముగించాలి అనుకున్నాను కూడా. నా మనసు అంగీకరించలేదు. తను నా ఆర్థిక స్థితిని చూసి రిలేషన్ పెట్టుకోలేదు. అలాంటి అవసరం తనకి లేదు.

'అని' గురించి ఆలోచిస్తుంటే నాకు ఆమె డేషింగ్ నేచర్- ఆమె రూపం గుర్తిస్తున్నాయి.

****

నరసయ్య మావయ్య

వెన్నెల మావయ్యకి ఈ విషయం చెప్పలేదు. నేను మా ఊర్లో ఎకరం భూమి కొన్నాను. అలాగే ఇంటి స్థలం కొని, ఇల్లు కూడా కట్టించాను. మావయ్య - అత్తయ్య పంటలు పండినప్పుడు వస్తుంటారు. అత్తయ్య వచ్చి వెళ్లింది. అలానే వచ్చారు. ఇంటికి తాళం వేసి వుంది. మా వాచ్‌మన్ వెన్నెల గురించి చెప్పాడు.

అప్పుడు నేను ముంబయ్‌లో వున్నాను.

నాకు అనిపిస్తున్నది ఒకటే. మనుషులు మారరా... ఎప్పుడూ ఒకేలా వుంటారా? మనకు ఇష్టమైన నిర్ణయాలు తీసుకోకూడదా? అన్నిటికీ మించి ఇలా చేసింది నేను మాత్రమేనా? నేనే ముందుగా ఇది చేసానా?

నిజానికి నేనూ, అనీ పని మీద దృష్టి పెట్టాం. పది రోజులకి ఓసారయినా మేం ఏకాంతంగా కలుసుకునే అవకాశం కలగటం లేదు. నేను తనతో ఈ విషయం మాట్లాడలేదు కూడా? నేను హైదరాబాద్ వచ్చాను. (ఇంకా ఉంది)

74వ రాజ్యాంగ సవరణ ఎప్పటినుంచి అమలులోకి వచ్చింది ?



దేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ బిట్‌బ్యాంక్



- ప్రతి గ్రామ పంచాయతీకి ఒక కార్యదర్శిని ప్రభుత్వం ఎప్పుడు ఏర్పాటు చేసింది ? **- 1.1.2002**
- గ్రామ కార్యదర్శి విధులు ఏమిటి ? **- గ్రామ పంచాయతీల తీర్మానాలు, కమిటీల తీర్మానాలు అమలు చేయాలి - గ్రామ పంచాయతీలో పనిచేసే ఉద్యోగులపై నియంత్రణ - జనన మరణాల నమోదు - వివాహాల నమోదు - చట్టంలో నిర్దేశించిన ఇతర బాధ్యతలు**
- గ్రామ పంచాయతీకి ప్రధాన వనరులు ఏవి ? **- ఇంటి పన్ను, వృత్తిపన్ను, దుకాణాలపై పన్ను, ప్రకటనలపై పన్ను - ఫీజులు, రుసుములు, ఆదాయాన్నిచ్చే ఆస్తులు - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంట్లు - రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసులపై రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులు**
- స్థానిక సంస్థలకు ప్రధానమైన ఆదాయ వనరు ఏది ? **- ఇంటిపన్ను**
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్ని అంశాలను స్థానిక సంస్థలకు బదిలీ చేసింది ? **- 10 అంశాలు**
- అన్ని అంశాలను స్థానిక సంస్థలకు బదిలీ చేసిన రాష్ట్రాలు ఏవి ? **- కర్ణాటక, కేరళ, తమిళనాడు**
- రెండంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులో ఉన్న కేంద్ర పాలిత ప్రాంతాలు ఏవి ? **- దాద్రానగర్ హవేలి, డామన్ అండ్ డయ్యూ, గోవా, లక్షద్వీప్, పుదుచ్చేరి**
- భారతదేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థల పనివిధానంపై శిక్షణ ఇవ్వడానికి ఏర్పాటైన సంస్థ ఏది ? **- ఎన్ఐఆర్‌డి**
- విలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ పేరుతో గ్రామీణ సంస్థలను ఏర్పాటు చేసిన రాష్ట్రం ఏది ? **- హర్యానా**
- 73వ రాజ్యాంగ సవరణ తరువాత 3 స్థాయిల్లోని సంస్థలకు 'గ్రామ స్వరాజ్' అనే పేరుతో ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించిన రాష్ట్రం ఏది ? **- మధ్యప్రదేశ్**
- స్థానిక సంస్థల్లో సమర్థవంతంగా పనిచేయనప్పుడు ప్రజాప్రతినిధులను మధ్యలోనే తొలగించే రీకాల్ పద్ధతిని ప్రవేశపెట్టాలని సూచించింది ఎవరు ? **- మహాత్మా గాంధీ**
- ఏ రాష్ట్రప్రభుత్వం ప్రయోగాత్మకంగా స్థానిక సంస్థల ప్రతినిధులను వెనుకకు పిలిపించే పద్ధతిని ప్రవేశపెట్టింది ? **- మధ్యప్రదేశ్**
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేయడాన్ని తప్పనిసరి చేస్తూ చట్టం చేసిన రాష్ట్రం ఏది ? **- గుజరాత్**
- గ్రామసభ ద్వారానే ప్రభుత్వ పథకాలకు లబ్ధి చేకూర్చుతున్న రాష్ట్రం ? **- కేరళ**
- 1978 నుంచి నేటివరకూ స్థానిక సంస్థలకు నియమబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తున్న రాష్ట్రం ఏది ? **- పశ్చిమ బెంగాల్**
- కేంద్రప్రభుత్వంలో ప్రత్యేకంగా పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు ? **- 27 మే, 2004**
- జిల్లాస్థాయిలో స్థానిక సంస్థల్లో సామాజిక న్యాయ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించిన కమిటీ ఏది ? **- జలగం వెంగళరావు కమిటీ**
- ఏ రాష్ట్రంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు జిల్లా పరిషత్‌లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉండరు ? **- మహారాష్ట్ర**
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అశోక్ మెహతా కమిటీ సిఫారసులకు అనుగుణంగా చట్టంను రూపొందించగా, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజాపరిషత్‌లు, జిల్లా ప్రణాళిక, అభివృద్ధి సమీక్ష మండలులు ఏ సంవత్సరం నుండి అమలులోకి వచ్చాయి ? **- 15 జనవరి, 1987**
- మండలాధ్యక్షునిగా పోటీ చేయడానికి గల అర్హతలేమిటి ? **- 21 సంవత్సరాలు నిండి ఉండాలి, ఏ మండల పరిషత్ సభ్యునిగా పోటీ చేయాలనుకుంటే ఆ మండలంలో ఓటరుగా పేరు నమోదు చేసుకుని ఉండాలి**
- మండల పరిషత్ చివరి సమావేశం జరిగిన తేదీ నుండి 90 రోజుల లోపల మరొక సమావేశం ఏర్పాటు చేయనట్లయితే ఎవరిపై రాష్ట్రప్రభుత్వం క్రమశిక్షణా చర్య తీసుకుంటుంది ? **- ఎంపీడీఓ**
- జిల్లా పరిషత్‌లో ఎన్ని రకాల సభ్యులుంటారు ? **- ఎక్స్ అఫిషియో సభ్యులు, ఆ జిల్లాలోని శాసనసభ్యులు, ఆ జిల్లాలో ఓటరుగా నమోదైన ఎమ్మెల్సీలు, ఆ జిల్లాలోని లోకసభ సభ్యులు, జిల్లాలో ఓటరుగా నమోదైన రాజ్యసభ సభ్యులు**
- జిల్లా పరిషత్‌లో శాశ్వత ఆహ్వానితులు ఎవరు ? **- జిల్లా కలెక్టర్, జిల్లాలోని మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా మార్కెటింగ్ సొసైటీ చైర్మన్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్**
- జిల్లా పరిషత్ సంవత్సరానికి కనీసం ఎన్నిసార్లు సమావేశమవ్వాలి ? **- నాలుగుసార్లు**
- జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్, ఎన్నికైన సభ్యులు రాజీనామా లేఖలు ఎవరికి పంపడం ద్వారా రాజీనామా చేయవచ్చు ? **- కలెక్టర్**
- చైర్మన్, వైస్ చైర్మన్‌లను ప్రభుత్వం ఏ సంవత్సరాలలో తొలగిస్తుంది ? **- ప్రభుత్వ ఉత్తర్వులను అమలుచేయనప్పుడు, అధికార దుర్వినియోగానికి పాల్పడినప్పుడు, చట్టం ద్వారా తనకు సంక్రమించిన అధికారాలను నిర్వర్తించడంలో పలుసార్లు విఫలమైనప్పుడు, అధికార విధులను స్వార్థానికి వినియోగించినప్పుడు**
- 2009లో ప్రభుత్వం జారీచేసిన ఆదేశాన్ని అనుసరించి వారి పదవీకాలం లో ఎన్నిసార్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చు ? **- ఒకసారి మాత్రమే**
- ప్రతి జిల్లా పరిషత్‌లో ఎన్ని స్థాయీ సంఘాలు ఉంటాయి ? **- 7**
- వ్యవసాయాభివృద్ధి స్థాయీ సంఘానికి ఎవరు ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా వ్యవహరించడమే కాకుండా ఆ స్థాయీ సంఘానికి చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తాడు ? **- జిల్లా పరిషత్ వైస్ చైర్మన్**
- జెడ్.పి. చైర్మన్ అధికారాలేమిటి ? **- జెడ్.పి. సమావేశాలకు అధ్యక్షత వహించడం, జెడ్.పి. సీఈఓ మీద పాలనాపరమైన నియంత్రణ, జెడ్.పి. రికార్డులు తనిఖీ చేయడానికి సంబంధించి పూర్తి అధికారాలను కలిగి ఉంటారు**
- జిల్లా పరిషత్ ఆదాయ వనరులు ఏమిటి ? **- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరుచేసే నిధులు, రాష్ట్ర ప్రభుత్వ పన్నులు, ఫీజులలో జిల్లా పరిషత్ వాటా, మండల పరిషత్‌ల ద్వారా, ప్రజల ద్వారా వచ్చే విరాళాలు, జిల్లాలోని ఒక్కొక్క పౌరునికి రూ.4 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం విడుదల చేసే గ్రాంటు**
- చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఇద్దరూ ఎన్ని రోజులకు మించి హాజరు కాలేని సందర్భంలో చైర్మన్ అధికార విధులను జిల్లా పరిషత్ సభ్యులలో ఒకరికి రాష్ట్ర ప్రభుత్వం బదలాయిస్తుంది. అతడే తాత్కాలిక అధ్యక్షుడుగా ఉంటాడు. **- 15 రోజులకు మించి**
- గెలిచిన అభ్యర్థి అక్రమంగా గెలిచాడని కోర్టు భావించినట్లయితే అభ్యర్థి ఎన్నికను రద్దు చేయవచ్చు. ఎన్నికల నియమాల ప్రకారం ఎన్ని సంవత్సరాలపాటు అతడు ఎన్నికల్లో పాల్గొనకుండా చేయవచ్చు ? **- 6 సంవత్సరాలు**
- జిల్లా పరిషత్ అధ్యక్ష/ ఉపాధ్యక్షులు ఎన్ని రోజుల వరకు కూడా ఒక్క సమావేశాన్ని ఏర్పాటు చేయలేకపోయినట్లయితే ఎవరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయి ? **- కార్యనిర్వహణాధికారులపై**
- గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలు తాలూకా/ బ్లాక్ పంచాయతీలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తే, మహారాష్ట్ర, తమిళనాడు దేనికి ప్రాధాన్యతను ఇస్తున్నాయి ? **- జిల్లాలకు**
- ఏ గవర్నర్ జనరల్ 11 మే, 1772లో సూపర్‌వైజర్లను కలెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశాడు ? **- వారెన్ హేస్టింగ్**
- రాజ్యాంగంలోని ఏ ప్రకరణం కార్యనిర్వాహకవర్గం నుండి న్యాయ విధులను వేరుపరచినది ? **- 50వ ప్రకరణం**
- పంచాయతీరాజ్ సంస్థలకు ఆర్థిక వనరులు ముఖ్యంగా నాలుగు మార్గాల ద్వారా లభిస్తున్నది అవి ? **- రుణాలు, గ్రాంట్లు, పన్నులు, వర్తక వ్యాపారాల నుండి వచ్చే ఆదాయం**
- ఏ ప్రకరణ ప్రకారం రాష్ట్రాలు జిల్లా ప్రణాళికా కమిటీలను ఏర్పాటు చేసుకున్నాయి ? **- 243 జెడ్‌డీ**
- "పంచాయతీరాజ్ ఫ్రమ్ లెజిస్లేషన్ టు మూవ్‌మెంట్" గ్రంథ రచయిత ఎవరు ? **- డాక్టర్ జార్జ్ మాథ్యూ**
- MP LADS (Member of Parliaments Local Area Development Scheme) రూపొందించిన భారత ప్రధాని ఎవరు ? **- పి.వి.నరసింహారావు**
- పంచాయతీరాజ్ సంస్థలు ప్రభావవంతమైన సమర్థవంతమైన స్థానిక స్వపరిపాలనా సంస్థలుగా పనిచేయాలని తమిళనాడు ప్రభుత్వం భావించింది. ఇందుకొరకు వాటికి తగిన అధికారాలు కల్పించేందుకు సిఫారసులు చేయడానికి 1996లో ఏర్పాటు చేసిన కమిటీ ఏది ? **- ఎల్.సి.జైన్ కమిటీ**
- పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ 2000 సంవత్సరంలో ఎవరి ఆధ్వర్యంలో కమిటీని వేసింది ? **- వి.ఎస్.రమాదేవి**
- వి.ఎస్.రమాదేవి కమిటీ సూచించిన సిఫారసులలో ప్రధానమైనవి ఏవి ? **- గ్రామ పంచాయతీలను స్వయం ప్రతిపత్తిగా సంస్థలుగా తీర్చిదిద్దాలి, జిల్లా ప్రణాళికా సంఘాలు ఆచరణలో సక్రమంగా పనిచేసేలా చూడాలి, పంచాయతీరాజ్ సంస్థలకు శిక్షణ పొందిన సాంకేతిక సిబ్బందిని నియమించాలి, పంచాయతీలు పన్నులు విధించుకునేందుకు వీలుగా రాష్ట్రప్రభుత్వాలు తగిన చట్టాలు చేయాలి**
- స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు విద్యార్హతలను ఏ రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది ? **- రాజస్థాన్**
- పంచాయతీ ఎన్నికల్లో విద్యార్హతతోపాటు వివిధ ప్రమాణాలను పాటించాలని ఏ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించింది ? **- హర్యానా**
- 15 ఆగస్టు, 2015 నాటికి ఏ రాష్ట్రాల్లో మాత్రమే స్థానిక సంస్థల్లో 'రీకాల్ పద్ధతి' అమలులో ఉంది ? **- మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్**
- ఏ భారత ప్రభుత్వ చట్టంలో స్థానిక ప్రభుత్వాలను రాష్ట్ర జాబితాలో చేర్చారు ? **- 1935**
- 1989లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం పట్టణ, నగరపాలక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించడం కోసం ఎన్నవ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది ? **- 65వ**
- 74వ రాజ్యాంగ సవరణ ఎప్పటినుంచి అమలులోకి వచ్చింది ? **- 1 జూన్, 1993**
- 74 వ రాజ్యాంగ సవరణ (1993) ద్వారా IXA భాగాన్ని కలుపగా ఎన్నవ షెడ్యూల్‌ను కొత్తగా చేర్చారు ? **- XII షెడ్యూల్‌ను**
- పట్టణ, నగరపాలక వ్యవస్థలకు సంబంధించిన ఎన్ని అధికారాల విధుల గురించి XIIవ షెడ్యూల్‌లో పేర్కొన్నారు ? **- 18 అధికార విధులు**
- 74వ రాజ్యాంగ సవరణ చట్టం (1992) ద్వారా మున్సిపాలిటీ (కొత్త పట్టణ, నగరపాలక వ్యవస్థ)ల చట్టంను రాజ్యాంగంలోని IX (A) భాగంలో మొత్తం ఎన్ని ప్రకరణల్లో పొందుపరిచారు ? **- 18 ప్రకరణలు**
- ప్రస్తుతం భారతదేశంలో 10 లక్షల జనాభా దాటిన నగరాలు ఎన్ని ఉన్నాయి ? **- 53**
- ఏ ప్రకరణ ప్రకారం ప్రతి రాష్ట్రంలోను మున్సిపల్ వ్యవస్థను వివరించినది ? **- 243 ఓ**
- ఏ ప్రకరణ ప్రకారం మెట్రోపాలిటన్ ప్రాంతం అనగా 10 లక్షలు లేక అంతకన్నా ఎక్కువ జనాభా కలిగిన ప్రాంతం. ఆ ప్రాంతం ఒకటి లేక అంతకన్నా ఎక్కువ జిల్లాలకు విస్తరించి ఉండవచ్చు, లేక ఒకటి లేక అంతకన్నా ఎక్కువ మున్సిపాలిటీలు లేక పంచాయతీలు లేక మరేవైనా ప్రాంతాలను కలపడం వల్ల ఏర్పడవచ్చు ? **- 243 పి (సి)**
- ప్రకరణ 243 ఆర్ ఏమి తెలియజేస్తున్నది ? **- మున్సిపాలిటీల నిర్మాణం**
- ఏ ప్రకరణ ప్రకారం శాసనసభ వార్డు కమిటీలతో పాటుగా మరికొన్ని ఇతర కమిటీలను కూడా ఏర్పాటు చేయవచ్చును ? **- 243 ఎస్ (5)**
- ఈ క్రింది దానిని పరిశీలించి సరైనదో కాదో చెప్పండి ?

	కనిష్టం	గరిష్టం
మున్సిపాలిటీ వార్డుల సంఖ్య	23	50
మున్సిపల్ కార్పొరేషనలో వార్డుల సంఖ్య	50	100
మెట్రోపాలిటన్ సిటీలో	100	200

- సరైనదే

- మున్సిపాలిటీలలో సీట్ల రిజర్వేషను తెలియజేయు ప్రకరణ ఏది ? **- 243 టీ**
- సభ్యత్వానికి సంబంధించిన అనర్హతలను ఏ ప్రకరణ తెలియజేస్తుంది ? **- 243 వీ**
- మున్సిపాలిటీల అధికారాలు, హక్కులు, బాధ్యతల గురించి వివరించే ప్రకరణ ఏది ? **- 243 డబ్ల్యూ**
- మున్సిపాలిటీలకు పన్నులు-విధులు వంటి వాటి గురించే వివరించే ప్రకరణం ఏది ? **- 243 ఎక్స్**
- మున్సిపాలిటీల ఆర్థిక స్థితిగతులపై ఆర్థిక కమిషన్ ఏ ప్రకరణ ప్రకారం ఏర్పాటు చేస్తారు ? **- 243 వై**
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ఆర్థిక సంఘం (స్టేట్ ఫైనాన్స్ కమిషన్) ఏ సంవత్సరంలో ఏర్పడింది ? **- 1994**
- ప్రకరణ 243 జెడ్‌బీ ప్రకారం కేంద్రపాలిత ప్రాంతాలకు వర్తింపచేయడం కాగా, ఏ భాగం నుండి కొన్ని ప్రాంతాలకు మినహాయింపును కల్పిస్తున్న ప్రకరణ ఏది ? **- 243 జెడ్‌సీ**
- జిల్లా ప్రణాళికా కమిటీ ఏ ప్రకరణం ప్రకారం ఏర్పాటు చేయడమైనది ? **- 243 జెడ్‌డీ**
- జిల్లా ప్రణాళికా కమిటీకి ఎక్స్ అఫిషియో చైర్‌పర్సన్‌గా ఎవరు వ్యవహరిస్తారు ? **- జిల్లా పరిషత్ చైర్మన్**
- జిల్లా ప్రణాళికా కమిటీకి మెంబర్ సెక్రటరీగా వ్యవహరించేది ఎవరు ? **- కలెక్టర్**
- జిల్లా ప్రణాళికా కమిటీకి 24 మంది సభ్యులు ఎన్నుకోబడగా, శాశ్వత ఆహ్వానితులు మినహా మొత్తం సభ్యుల సంఖ్య ఎంత ? **- 30**
- జిల్లా ప్రణాళికా సంఘానికి ఎంతమందిని నామినేట్ చేస్తారు ? **- 4**
- జిల్లా ప్రణాళికా కమిటీకి శాశ్వత ఆహ్వానితులు ఎవరు ? **- జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు. - కార్పొరేషన్ మేయర్లు, మున్సిపాలిటీ చైర్మన్‌లు**
- ఏ ప్రకరణ ప్రకారం జిల్లా ప్రణాళికా కమిటీ రూపొందించిన అభివృద్ధి ప్రణాళికను జిల్లా ప్రణాళికా కమిటీ అధ్యక్షుడు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలి ? **- 243 జెడ్‌డీ (4)**
- మెట్రోపాలిటన్ కోసం ప్రణాళికా కమిటీ ఏర్పాటును తెలియజేస్తున్న ప్రకరణ ఏది ? **- 243 జెడ్‌ఈ**
- దేశంలోని మొట్టమొదటి పట్టణాభివృద్ధి సంస్థ ఏది ? **- ఢిల్లీ (1964)**
- భారతదేశంలో పట్టణ స్థానిక సంస్థలను ఎన్ని రకాలుగా వర్గీకరించారు ? **- 8 రకాలు**
- తెలంగాణలోని పట్టణ స్థానిక సంస్థలను 3 రకాలుగా విభజించారు. అవి ? **- మున్సిపల్ కార్పొరేషన్లు, - పురపాలక సంఘాలు - నగర పంచాయతీలు**
- నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి తెలంగాణలో పట్టణ స్థానిక సంస్థలను రెండు రకాలుగా విభజించారు అవి ఏవి ? **- మున్సిపల్ కార్పొరేషన్లు -మున్సిపాలిటీలు**
- ఏ చట్టాన్ని అనుసరించి మొదటిసారిగా హైదరాబాద్ నగరానికి, సికింద్రాబాద్‌లకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు ? **- 1950 హైదరాబాద్ కార్పొరేషన్ చట్టం**
- ఏ చట్టం ప్రకారం 3 ఆగస్టు 1960న హైదరాబాద్, సికింద్రాబాద్ కార్పొరేషన్‌లను ఒకే కార్పొరేషన్‌గా విలీనం చేశారు ? **- హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం - 1955**
- కేంద్రపాలిత ప్రాంతాలలో స్థానిక సంస్థలను దేని ద్వారా ఏర్పాటు చేస్తారు ? **- పార్లమెంట్ చట్టం**
- 2 అక్టోబర్ 2016 నాటికి భారతదేశంలో మొత్తం 206 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వాటిలోకెల్లా అత్యంత పెద్దది ఏది ? **- గ్రేటర్ ముంబయి కార్పొరేషన్**
- ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ల సంఖ్య ఎంత ? **- 14**
- భారతదేశంలో మొదటిసారిగా మేయర్‌గా ఎన్నికైన పర్వీన్ భాను అనే హిజ్రా ఏ రాష్ట్రానికి చెందినది ? **- కర్ణాటక (బళ్లారి)**
- ఉమ్మడి రాష్ట్రంలోని పురపాలక సంఘాలన్నీ ఒక సమగ్ర చట్టం ద్వారా నిర్వహించడం కోసం ఏ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల చట్టాన్ని రూపొందించారు ? **- 1965**
- ఎన్ని లక్షల జనాభా దాటిన ప్రాంతాన్ని మెట్రోపాలిటన్ ప్రాంతాలుగా గుర్తిస్తారు ? **- 10 లక్షల జనాభా**
- మున్సిపల్ కార్పొరేషన్లకు ఆదాయ వనరుల మార్గాలు ఏవి ? **- ప్రజలపై వేసే పన్నులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి లభించే గ్రాంట్లు, ఫీజులు, అద్దెలు, ప్రజలు, సంస్థల నుంచి సేకరించే రుణాలు**
- 40 వేల కంటే ఎక్కువ, 4 లక్షల కంటే తక్కువ జనాభా ఉన్న పట్టణాన్ని దేనిగా గుర్తిస్తారు ? **- మున్సిపాలిటీగా**
- మున్సిపల్ చైర్మన్ గురించి కింది వాటిని పరిశీలింపుము ? **- పురపాలక సంస్థ ప్రథమ పౌరుడు, పార్టీ ప్రాతిపదికపై ప్రస్తుతం పరోక్షంగా ఎన్నికవుతున్నాడు. మండలిలోని కొన్ని స్థాయీ సంఘాలకు అధ్యక్షత వహిస్తాడు**
- పురపాలక సంస్థ పాలనాధిపతిగా వ్యవహరించేది ఎవరు ? **- మున్సిపల్ కమిషనర్**
- ప్రతి పురపాలక సంస్థలో కొన్ని స్థాయీ సంఘాలుంటాయి. అవి ఏవి ? **- విద్య, విత్తం, ఆరోగ్యం, మహిళా సంక్షేమం, పన్నులు, వెనుకబడిన వర్గాల సంక్షేమం**
- ప్రకరణ ఎన్నవ దానిలో పేర్కొన్న 18 విధులు పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ అయ్యాయి ? **- 243 డబ్ల్యూ**
- పురపాలక సంఘాలకు వచ్చే ఆర్థిక వనరులు ఏవి ? **- పన్నుల ద్వారా వచ్చే ఆదాయం ఉదా: ఆస్తి పన్ను, పన్నేతర ఆదాయం ఉదా : నీటి చార్జీలు, నిర్దేశించిన ఆదాయాలు ఉదా : వినోద పన్ను, స్టాంపు డ్యూటీపై సర్‌చార్జి వృత్తిపన్ను, ప్రభుత్వం నుండి వచ్చే ప్రణాళికా గ్రాంటు ఉదా : నీటి సరఫరా అభివృద్ధి, పథకాలు, స్వర్ణ జయంతి షహరీ రోజ్‌గార్ యోజన మొదలగునవి.**
- పారిశ్రామికంగా శీఘ్రగతిన అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో అలాగే మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడానికి అనువైన పరిస్థితులు లేని ప్రాంతాలలో ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేస్తే దానిని ఏమంటారు ? **- నోటిఫైడ్ ఏరియా కమిటీలు**
- పౌర సదుపాయాలు కల్పించడానికి చిన్న పట్టణాలలో 'సెమీ మున్సిపల్' అథారిటీ పద్ధతిలో ఏర్పాటు చేసినవాటిని ఏమంటారు ? **- టౌన్ ఏరియా కమిటీలు**
- సైనిక స్థావరాలు ఉన్న ప్రాంతాలలో పౌర సదుపాయాలు కల్పించడానికి కేంద్రప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటిని ఏమంటారు ? **- కంటోన్మెంట్ బోర్డు (Cantonment Board)**
- 2017 నాటికి దేశవ్యాప్తంగా ఎన్ని కంటోన్మెంట్ బోర్డులున్నాయి ? **- 62**
- కంటోన్మెంట్ బోర్డు చట్టాన్ని మొదటిసారిగా ఏ సంవత్సరంలో రూపొందించారు ? **- 1924**
- ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు, ఆ ప్రాంతంలో నివశించేవారిక పౌర సదుపాయాలను కల్పించడానికి ఏర్పాటు చేసినవాటిని ఏమంటారు ? **- టౌన్‌షిప్ (Townships)**
- మేజర్ పోర్ట్స్ చట్టం-1963 ప్రకారం ప్రస్తుతం భారతదేశంలో ఎన్ని పోర్టుట్రస్టులు ఉన్నాయి ? **- 13**

విశాలాంధ్ర బిజినెస్

113.31 ▲ సెన్సెక్స్	18.60 ▲ నిఫ్టీ	50 ▲ బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	500 ▼ వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
35,582.74	10,912.25	31,450 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	31,810 / ప్రొద్దుటూరు 31,810 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	41,300 (కిలో (రూపాయల్లో))	41,300 / ప్రొద్దుటూరు 43,848 (కిలో (రూపాయల్లో))	71.80

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాభం (శాతాల్లో)
టైటన్ కంపెనీ	1,025.75	3.45
రిలయన్స్	1,290.90	3.28
ఓఎన్‌జీసీ	146.25	3.14
ఐషర్ మోటార్స్	20,431.95	2.36
బజాజ్ ఆటో	2,672.40	1.53

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	నష్టం (శాతాల్లో)
ఇండియాబుల్స్	650.75	-4.11
హిందాల్కో	204.20	-3.41
హెచ్‌పీసీఎల్	226.50	-3.21
ఎస్-బ్యాంక్	184.70	-3.13
పవర్‌గ్రిడ్ కార్ప్	189.50	-2.94

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	71.24	71.10
యూరో	80.65	81.16
పౌండ్	93.12	93.48
ఆస్ట్రేలియా డాలర్	50.64	50.96
సింగపూర్ డాలర్	52.48	52.52

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	31,810	34,021
చెన్నై	31,810	34.021
బెంగళూరు	31,250	33,422
ముంబై	32,490	34,748
విజయవాడ	32,450	34,440
విశాఖపట్నం	31,810	33,870
ప్రొద్దుటూరు	31.810	33,400
ముడి చమురు	61.87	

చమురుకు అతి తక్కువ నిధులు

- వచ్చేసారికి 93,693 కోట్లే
- నాలుగేళ్ల కనిష్ఠ స్థాయికి ప్రభుత్వ చమురు సంస్థల పెట్టుబడులు
- 2019-20 మధ్యంతర బడ్జెట్‌లో వెల్లడి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ చమురు సంస్థలు.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను నిర్దేశించుకున్న పెట్టుబడులు నాలుగేండ్ల కనిష్ఠ స్థాయిలో ఉన్నాయి. ఓఎన్‌జీసీ, ఇండియన్ ఆయిల్, గెయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం, మంగళూరు రిఫైనరీస్ అండ్ పెట్రోకెమికల్స్ తదితర సంస్థలు.. చమురు, సహజ వాయువుల అన్వేషణ, శుద్ధి, పెట్రోకెమికల్స్‌ల్లో రూ.93,693 కోట్ల పెట్టుబడులను పెట్టాలని చూస్తున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరం తర్వాత ఇదే అత్యంత కనిష్ఠ స్థాయి అని తాజా మధ్యంతర బడ్జెట్ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది మార్చి 31తో ముగుస్తున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను రూ.89,335 కోట్ల పెట్టుబడులను చమురు రంగ సంస్థలు ప్రతిపాదించినా.. అవి రూ.94,438 కోట్లకు చేరువవుతున్నాయి. ఇక 2017-18లో రూ. 1,32,003 కోట్లు, 2016-17లో రూ. 1,04,426 కోట్లు, 2015-16లో రూ.97, 223 కోట్ల మేర ఆయా చమురు సంస్థలు తమ కార్యకలాపాల అభివృద్ధి, విస్తరణ నిమిత్తం పెట్టుబడులను పెట్టాయి.

2014-15లో రూ.89,180 కోట్ల పెట్టుబడులుండగా, మళ్లీ ఆ తర్వాత 2019-20లోనే తక్కువ పెట్టుబడులకు చమురు సంస్థలు ముందుకొస్తున్నాయి. కాగా, అంతర్జాతీయ మార్కెట్ నుంచి చమురు దిగుమతులు తగ్గించుకుని, దేశంలో ముడి చమురు ఉత్పత్తిని పెంచుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకెళుతున్న వేళ.. ప్రభుత్వ రంగ సంస్థలే పెట్టుబడులను తగ్గించుకోవడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. దేశీయ ఇంధన అవసరాల్లో 80 శాతానికిపైగా దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి.

గత ఆర్థిక సంవత్సరం 2017-18లో భారత చమురు, గ్యాస్ దిగుమతులు 109.1 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం మరింత పెరిగి 130 బిలియన్ డాలర్లకు చేరవచ్చని అంచనా. దీంతో విదేశీ మార్కెట్‌లో ధరలు ఒడిదుడుకులకు లోనైనప్పుడు భారతీయ మార్కెట్‌లోనూ చమురు ధరలు పడుతూలేస్తున్నాయి. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ కూడా ప్రభావితం అవుతున్నది. ఈ క్రమంలోనే స్థానిక ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రైవేట్ రంగ సంస్థలనూ కేంద్రం కోరుతున్నది. పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నది. కానీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ సంస్థల పెట్టుబడులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.

ఏ సంస్థ ఎంతెంత..!

వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20)లో ఓఎన్‌జీసీ రూ.32,921 కోట్ల పెట్టుబడులను పెట్టనున్నట్లు తాజా మధ్యంతర బడ్జెట్ అంచనాల ప్రకారం తెలుస్తున్నది. ఇక ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రూ.25,083 కోట్ల పెట్టుబడులను పెట్టనుండగా, హిందుస్థాన్ పెట్రోలియం రూ.9,500 కోట్లు, భారత్ పెట్రోలియం రూ.7,900 కోట్ల పెట్టుబడులను పెట్టనున్నాయి. వీటిలో దేశీయ చమురు మార్కెటింగ్ దిగ్గజం ఐవోసీ పెట్టుబడులు దాదాపు 2 శాతం తగ్గగా, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ పెట్టుబడులు పెరుగడం గమనార్హం. అలాగే గెయిల్ ఇండియా పెట్టుబడులూ 10 శాతం క్షీణించి రూ.5,339 కోట్లుగా ఉన్నాయి. ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్ కూడా గతంతో పోల్చితే పెట్టుబడులను 15.5శాతం తగ్గించి రూ. 5,161 కోట్లకు పరిమితం చేసింది. కేంద్రం ఆలోచనలు ఒకలాగా, సంస్థల ఆలోచనలు మరొకలాగా ఉన్నాయా? అన్న సందిగ్ధం ఏర్పడుతున్నది.

విజ్ఞానం



వ్యాయామంతో కొవ్వుకు చెక్..

వ్యాయామంతో పలువ్యాధులకు కారణమైన విసరల్ కొవ్వును తగ్గించుకోవచ్చునని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ వెల్లడించింది. గుండెవ్యాధులకు, దయాబెటిస్‌కు కారణమైన అత్యంత ప్రమాదకరమైన అంతర్గత కొవ్వును (విసరల్ ఫ్యాట్) నిర్మూలించవచ్చునని తెలుస్తోంది. జీవనవిధానంలో మార్పులు వంటి వ్యాయామంతో ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. 3,602 మందిపై ఆరునెలల కాలం చేపట్టిన అధ్యయనంలో సిటీ, ఎమ్ఆర్ఐల పరిశీలించిచూడగా 54ఏళ్ల వయసున్న మహిళల్లో వ్యాయామంతో 65శాతం ఫ్యాట్ తగ్గుముఖం పట్టినట్లు తెలిసింది. విసరల్‌ఫ్యాట్‌తో ముఖ్యంగా గుండె, కాలేయం తీవ్రంగా దెబ్బతీస్తున్నట్లు గుర్తించారు. శరీరంలో ఫ్యాట్ నిల్వ ఉండే ప్రదేశాలు పైకి కనబడకపోయినప్పటికీ అవి అంతర్గతంగా పలు అవయవాలకు అనారగ్యాన్ని కలిగిస్తాయి. ఒబెసిటీతో ప్రపంచవ్యాప్తంగా 40శాతం మంది పలు రోగాలకు గురవుతున్నట్లు గుర్తించారు.

నెమురీ వల్లే నిద్ర

అలసిపోయినప్పుడు లేదా అనారోగ్యం పాలైనప్పుడు త్వరగా నిద్రలోకి జారుకుంటాం. ఇలా నిద్రలోకి తీసుకెళ్లే జన్యువును యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆ జన్యువును 'నెమురీ' అంటారన్నారు. ఈ వివరాలను సైన్స్ అనే జర్నల్‌లో ప్రచురించారు. సాధారణంగా అనారోగ్యంగా ఉన్నప్పుడు ఎక్కువగా నిద్ర వస్తుంది. దీంతో రోగ నిరోధక శక్తికి, నిద్రకు సంబంధం ఉందని భావిస్తారు. కానీ, గాయమైన ప్రదేశంలో పరాధీయ బాగాల్లోని సూక్ష్మజీవులను నెమురీ చంపేస్తుంది. తద్వారా మెదడు నుంచి అందే సంకేతాలతో బాగా నిద్ర పడుతుందని పరిశోధకులు తెలిపారు.

మార్కెట్‌లో బీఎండబ్ల్యూ జీఎస్



విజయవాడ : బీఎండబ్ల్యూ మోటర్రాడ్ తన ఆల్‌న్యూ బీఎండబ్ల్యూ ఆర్ 1250 జీఎస్, బీఎండబ్ల్యూ ఆర్ 1250 అడ్వంచరస్‌ను భారత దేశంలో విడుదల చేసింది. ఆల్ న్యూ బీఎండబ్ల్యూ ఆర్ 1250 జీఎస్, బీఎండబ్ల్యూ ఆర్ 1250 అడ్వంచర్ కంప్లీట్లీ బిల్ట్ అప్ యూనిట్‌గా లభిస్తాయి. బీఎండబ్ల్యూ మోటర్రాడ్ డీలర్‌షిప్స్‌లో బుకింగ్స్ ప్రారంభించారు. బీఎండబ్ల్యూ ఇండియా యాక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ హాన్స్ క్రిస్టియన్ బార్టెల్స్ మాట్లాడుతూ, బీఎండబ్ల్యూ మోటర్రాడ్ జీఎస్ మోడళ్లు తన ప్రత్యేక పవర్‌ఫుల్ విశ్వాసార్హ ప్రాపల్షను విస్తరించిన పర్యటన లేదా సుదూర ప్రయాణాలకు ఉపయుక్తంగా అందిస్తుందన్నారు. వీకెండ్ ట్రిప్‌ను ఆనందించే సమయంలోనూ అందిస్తుందన్నారు. బీఎండబ్ల్యూ ఆర్ 1250 జీఎస్ స్టాండర్డ్ రూ.16,85,000లు, బీఎండబ్ల్యూ ఆర్ 1250 జీఎస్ ప్రో ధర రూ.20,05,000లు, బీఎండబ్ల్యూ ఆర్ 1250 జీఎస్ అడ్వంచర్ స్టాండర్డ్ రూ.18,25,000లు, బీఎండబ్ల్యూ ఆర్ 1250 జీఎస్ ప్రో ధర రూ.21,95,000లు.

11 శాతం తగ్గిన ఎఫ్‌డీఐలు

ఐదేళ్లలో ఇదే కనిష్టం



న్యూఢిల్లీ : దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల శాతం భారీగా తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) 11 శాతం మేర తగ్గాయి. దీంతో 22.66 బిలియన్ డాలర్ల విదేశీ మారకం మాత్రమే దేశంలోకి వచ్చినట్లు వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే గత ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీఐలు 25.35 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఆరు నెలల వ్యవధిలో సర్వీస్ సెక్టార్(4.91 బిలియన్ డాలర్లు), సాఫ్ట్‌వేర్ రంగం (2.54 బిలియన్ డాలర్లు), టెలీకమ్యూనికేషన్ రంగం (2.17 బిలియన్ డాలర్లు), కెమికల్స్ (1.6 బిలియన్ డాలర్లు), ఆటోమొబైల్ రంగం (1.59 బిలియన్ డాలర్ల) పెట్టుబడులు ఆకర్షించాయి. సింగపూర్ (8.62 బిలియన్ డాలర్ల) ఆరు నెలల కాలంలో ఎక్కువ పెట్టుబడులు పెట్టిన దేశంగా నిలిచింది. తర్వాత స్థానాల్లో మారిషస్ (3.88 బిలియన్ డాలర్లు), నెదర్‌లాండ్స్ (2.32 బిలియన్ డాలర్లు), జపాన్ (1.88 బిలియన్ డాలర్లు), అమెరికా (970 మిలియన్ డాలర్లు), యూకే (845 మిలియన్ డాలర్లు) ఉన్నాయి. ఐదేళ్ల కాలంలో ఇంత తక్కువ స్థాయిలో ఎఫ్‌డీఐలు నమోదుకావడం ఇదే తొలి సారి. ఈ తగ్గుదల భారత చెల్లింపులను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అలాగే రూపాయి విలువపైనా ప్రభావం పడనుంది.



స్టార్టప్‌లపై కేంద్రం చిన్నచూపు

బడ్జెట్ కేటాయింపులు రూ.25 కోట్లే

న్యూఢిల్లీ: స్టార్టప్‌లపై కేంద్ర ప్రభు త్వం చిన్నచూపు చూస్తున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో వీటి కోసం రూ.25 కోట్ల నిధులను మాత్రమే కేటాయించింది. అంతక్రితం కేటాయించిన రూ.28 కోట్ల కంటే ఇది తక్కువ. అత్యంత వేగవంతంగా పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కేంద్రం స్టార్టప్ ఇండియా పేరుతో ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. మరోవైపు మేక్ ఇన్ ఇండియా పథకాలకు మాత్రం రూ.232.02 కోట్లు, జాతీయ తయారీదారుల పథకాలకోసం రూ.8.47 కోట్లు, ఫండ్ ఆఫ్ ఫండ్స్‌కోసం రూ.100 కోట్లను కేటాయించింది. మొత్తంమీద వచ్చే ఏడాది మేక్ ఇన్ ఇండియా కోసం రూ. 473.3 కోట్ల నిధులను అందించనున్నది. 2018-19లో కేటాయించిన రూ.149 కోట్లతో పోలిస్తే రెండు రెట్లు అధికం. భారత్‌ను అంతర్జాతీయ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో సెప్టెంబర్ 25, 2014న కేంద్ర ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియా పథకాన్ని ప్రారంభించారు. అలాగే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీయల్ పాలసీ అండ్ ప్రమోషన్ నిధుల కేటాయింపులు రూ.5.674.51 కోట్లకు తగ్గించింది.



'డెన్వర్' అంబాసిడర్‌గా మహేశ్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: పురుషుల సువాసన పరిమళాల బ్రాండ్ డెన్వర్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా హీరో మహేశ్‌బాబు వ్యవహరించనున్నారు. మహేశ్‌బాబుతో ఈ అనుబంధం తమను మరింత మందికి చేరువ చేస్తుందని డెన్వర్ మార్కెటింగ్, సేల్స్ డైరెక్టర్ సౌరబ్ గుప్తా తెలిపారు. మహేశ్‌తో టీవీసీని లాంచ్ చేయాలని సంస్థ ప్రయత్నిస్తోందన్నారు. దక్షిణాదిన ఉన్న విస్తృత అవకాశాలను సద్వినియోగం చేసుకోవడమే తమ సంస్థ లక్ష్యమని చెప్పారు. మహేశ్ బాబు మాట్లాడుతూ అత్యంత ప్రామాణికమైన ఉత్పత్తులకు సుపరిచితమైన చిరునామా డెన్వర్ అని అన్నారు. ఇలాంటి సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియామకం పొందడం సంతోషంగా ఉందని అన్నారు.

వాన్ హ్యుసెన్ కొత్త కలెక్షన్స్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ నూతన వ్యాపార విభాగం.. వాన్ హుసెన్ ఉమెన్ ఇన్నర్‌వేర్, అథ్లీజర్ స్టైల్‌ను హైదరాబాద్‌లో ఆవిష్కరించింది. కార్యక్రమంలో వాన్ హ్యూసెన్ లింగరే, అథ్లీజర్ లాంజ్ కలెక్షన్స్‌ను ప్రదర్శించారు. సీఈవో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వాన్ హుస్సేన్ ఉత్పత్తులకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తుందని అన్నారు. బ్రాండెండ్ అపారెల్స్ విభాగంలో కొత్త ట్రెండ్ తీసుకొచ్చామన్నారు.

వెల్లువెత్తిన కొనుగోళ్లు

లాభాల్లో బ్యాంకింగ్, ఎనర్జీ, ఐటి

ముంబై: బడ్జెట్ అనంతరం స్టాక్ మార్కెట్లలో తొలి ట్రేడింగ్ సెషన్ సోమవారం లాభాల్లో ముగిసింది. ఉదయం నష్టాలతో ప్రారంభమైన దేశీయ సూచీలు మధ్యాహ్నం నాటికి కోలుకున్నాయి. ఆటో, లోహ, ఎఫ్ఎంసీజీ, ఫార్మా రంగాలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దీంతో మధ్యాహ్నం వరకు మార్కెట్లు నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. కానీ చివరి గంటలో బ్యాంక్, ఎనర్జీ, ఐటీ రంగాల్లో కొనుగోళ్లు ఊపందుకోవడంతో సెన్సెక్స్ 113 పాయింట్లకు పైగా లాభపడింది. అటు నిఫ్టీ కూడా 10,900 మార్క్ పైనే స్థిరపడి ట్రేడింగ్‌ను ముగించింది. ఉదయం 93 పాయింట్ల నష్టంతో ట్రేడింగ్‌ను ఆరంభించిన సెన్సెక్స్ ఒకానొక దశలో తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనైంది. దీంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాదాపు 200 పాయింట్లకుపైగా నష్టాల్లో కొనసాగింది. అటు నిఫ్టీ కూడా 10,800 మార్క్‌లో కదలాడింది. కానీ చివరి గంటలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో ఉదయం నాటి నష్టాల నుంచి కోలుకోని లాభాలను గడించింది. సెన్సెక్స్ 113.31 పాయింట్లు లాభపడి 0.31శాతంతో 36,582.74 వద్ద ముగిసింది. నిఫ్టీ 18.60 పాయింట్లు లాభపడి 0.17శాతంతో 10,912.25 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ ప్యాక్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యధిక లాభదాయికాగా 3.52శాతంతో రూ.1292.15 షేర్ ధరతో ర్యాలీ నమోదుచేసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్‌జీసీ, బజాజ్ ఆటో, టీసీఎస్, కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు భారీ లాభాలను గడించాయి. ఎన్ఎస్ఈలో యస్ బ్యాంక్, హిందాల్కో, హిందుస్థాన్ పెట్రోలియం, పవర్ గ్రిడ్, ఎన్టీపీసీ షేర్లు నష్టాలను చవిచూశాయి. రియలన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.8లక్షల కోట్లు దాటింది. బజాజ్ ఆటో, ఓఎన్‌జీసీ, కొటక్ బ్యాంకు, టాటాస్టీల, యాక్సిస్ బ్యాంకు, ఎన్‌టిపిసి, సన్‌ఫార్మా, ఐటిసి, బజాజ్ ఫైనాన్స్ టాప్ లూజర్స్‌కాగా 3.13 శాతం నష్టపోయాయి. మంళవారం జరగనున్న రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ద్రవ్యపరపతి విధాన సమీక్ష సమావేశంతో ఆర్‌ఐఎల్ కొనుగోళ్లు అధికంగా జరిగినట్లు ట్రేడర్లు వెల్లడించారు. అంతర్జాతీయంగా కొనుగోళ్లు వెలు వెత్తాయి. బిఎస్ఇ మిడ్‌కాప్, స్మాల్‌కాప్ 1.17శాతం నష్టపోయాయి. విదేశీ మదుపరులు రూ.1315.89 కోట్ల విలువగల షేర్లను కొనుగోలు చేయగా, దేశీయ మదుపరులు రూ.5.07కోట్ల షేర్లను అమ్మినట్లు తెలుస్తోంది. ఆసియాలో హాంగ్‌కాంగ్ హేంగ్‌శాంగ్ 0.21శాతం, జపాన్ నిక్కీ 0.46శాతం షాంఘై కాంపోజిట్ ఇండెక్స్ 1.30శాతం లాభపడగా, కొరియా కాస్పి 0.06శాతం నష్టపోయింది.

ఒడుదొడుకుల్లో టెక్నాలజీ ఇండస్ట్రీ



న్యూఢిల్లీ: గతేడాది టెక్నాలజీ ఇండస్ట్రీ ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొంది. ప్రముఖ ఐఫోన్‌ల తయారీ సంస్థ యాపిల్ వ్యాపారం ఆశించిన రీతిలో వృద్ధిని నమోదు చేయలేదు. స్మార్ట్‌ఫోన్ షిప్‌మెంట్లలో యాపిల్, శాంసంగ్‌లకు గతేడాది అత్యంత చెత్త సంవత్సరమని ఇటీవల ఐడీసీ గణాంకాల ద్వారా వెల్లడైంది. 2018లో 1.4 బిలియన్ల స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు జరిగాయని ఐడీసీ పేర్కొంది. వేగంగా వృద్ధి చెందుతున్న స్మార్ట్‌ఫోన్ ఇండస్ట్రీలో ఈ విక్రయాలను పరిగణనలోకి తీసుకుంటే అంచనాల కన్నా 4.1శాతం తక్కువని ఐడీసీ తెలిపింది. 2014లోనే ఈ సంఖ్యను స్మార్ట్‌ఫోన్ ఇండస్ట్రీ దాటింది. 2018 నాలుగో త్రైమాసికంలోనూ స్మార్ట్‌ఫోన్‌ల షిప్‌మెంట్ 4.9శాతంగా నమోదైంది. 2017 నాలుగో త్రైమాసికంతో పోలిస్తే, 2018లో ఐఫోన్ ఆదాయం 15శాతం తగ్గింది. చైనాలో ఆర్థిక మందగమనం కూడా ఐఫోన్ అమ్మకాలపై పడిందని సీఈవో టిమ్‌కుక్ తెలిపారు. దీంతో పాటు, డాలర్ బలపడటం, సబ్సిడీల తగ్గింపు, యాపిల్ బ్యాటరీ రీప్లేస్‌మెంట్‌లు కూడా అమ్మకాల తగ్గుదలకు కారణమ య్యాయి. ఇక శాంసంగ్ అమ్మకాలు 5.5శాతం తగ్గాయి. కాగా, హువావే అమ్మకాలు మాత్రం 33.6శాతం పెరగ్గా, షామీ, ఒప్పోలు విక్రయాలు కూడా వృద్ధిని నమోదు చేశాయి

కార్పొరేషన్ బ్యాంకు సీఈఓగా పీవీ భారతి



కెనరా బ్యాంకుకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పీవీ భారతిని కార్పొరేషన్ బ్యాంకుకు మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈఓ)గా నియమిస్తున్నట్లు కార్పొరేషన్ బ్యాంకు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. బ్యాంకు చరిత్రలోనే ఒక మహిళకు ఈ హోదా దక్కడం ఇదే ప్రథమం. సెప్టెంబరు 15, 2016 నుంచి ఆమె కెనరా బ్యాంకుకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు. బ్యాంకింగ్ రంగంలో ఆమెకు 37 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉంది. ఇప్పటి వరకు ఆమె తమిళనాడు, నేషనల్ కాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్) పరిధిలోని వివిధ శాఖల్లో విధులు నిర్వర్తించారు. గ్రామీణ, పట్టణ, మెట్రోనగరాల్లో పనిచేసిన అనుభవం ఆమె సొంతం.

నష్టాల్లోనే ఐడీబీఐ

ఎల్ఐసీ చేతిలోకి బ్యాంకు

న్యూఢిల్లీ : డిసెంబర్ 2018తో ముగిసిన త్రైమాసికంలో ఐడీబీఐ బ్యాంకు మెప్పించలేకపోయింది. భారీ నష్టాలనే చవిచూసింది. డిసెంబర్ చివరికి ఈ ఆర్థిక సంవత్సరంతో రూ.4,185.48 కోట్ల నష్టపోయినట్లు తేల్చింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ సమయానికి రూ.1,524.3 కోట్లు నష్టాలు చూపింది. గత తొమ్మిది క్వార్టర్లలోనూ ఐడీబీఐ నష్టాల్లోనే సాగుతుండడం గమనార్హం. మొత్తం ఆదాయం ఈ క్వార్టర్‌కు గాను రూ. 6,190.94 కోట్లకు తగ్గిపోయింది. ఎన్‌పీఏలు సైతం 29.67 శాతం పెరిగినట్లు బ్యాంకు తెలిపింది. వసూలుకాని లోన్ల మొత్తం రూ. 5,074.80 కోట్లకు చేరింది. అధికారికంగా బ్యాంకు ఎల్ఐసీ చేతిలోకి వెళ్లినట్లు జనవరి 21 నాటికి 51 శాతం షేర్లు ఎల్ఐసీ చేతికి చేరినట్లు దీనికి గానూ రూ. 21,624 కోట్లు ఎల్ఐసీ నుంచి అందినట్లు ఐడీబీఐ ప్రకటనలో తెలిపింది.

చైనా ఉత్పత్తులపై డంపింగ్ వ్యతిరేక డ్యూటీ

99 రాకాల ఉత్పత్తులపై విధింపు



న్యూఢిల్లీ : భారత ప్రభుత్వం 99 రకాల చైనా ఉత్పత్తులపై డంపింగ్ వ్యతిరేక డ్యూటీని విధించింది. తక్కువ స్థాయి రకాలైనా చైనా ఉత్పత్తుల నుంచి దేశీయంగా ఉన్న వ్యాపారాలను కాపాడే విధానంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు, జనవరి 28 నుంచి ఇది అమల్లోకి వస్తున్నట్లు వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ లోక్‌సభకు రాసిన లేఖలో తెలిపింది. డ్యూటీ విధించిన వస్తువుల్లో రసాయనాలు, పెట్రో రసాయనాలు, ఫార్మా సంబందిత వస్తువులు, రబ్బర్, స్టీల్, ఫైబర్, యార్న్ ఉన్నట్లు తెలిపారు. భారత్ నుంచి ఎగుమతులు పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే భారత వ్యవసాయ , ఫార్మా ఉత్పత్తుల మార్కెట్‌ను చైనాలో పెంచేందుకు అక్కడి ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. చైనా నుంచి దిగుమతులు భారీగా తగ్గాయి. ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నాటికి దిగుమతులు 53.87 బిలియన్ డాలర్లు ఉండగా గత ఏడాది 76.38 బిలియన్ డాలర్లు ఉన్నట్లు లోక్‌సభకు తెలిపింది. నాన్యత తక్కువ విదేశీ వస్తువులు దేశీయ మార్కెట్లను దెబ్బతీస్తే ప్రభుత్వాలు డంపింగ్ వ్యతిరేక డ్యూటీని విధిస్తాయి.

విక్రయానికి 35 ప్రభుత్వ సంస్థలు

న్యూఢిల్లీ: దాదాపు 35 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో వ్యూహాత్మక వాటాలను విక్రయించేందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రణాళికలు రచిస్తోంది. మరోవైపు విక్రయ ప్రక్రియను సులభతరం చేయటమే కాకుండా గడువును తగ్గించే విధంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ రంగ సంస్థలను ఏకమొత్తంగా విక్రయించే ఉద్దేశంతో ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని చూస్తున్నట్లు దీపమ్ కార్యదర్శి అతను చక్రవర్తి తెలిపారు. ప్రస్తుతం పవన్ హన్స్ విక్రయ ప్రక్రియ కొనసాగుతోందని, దీంతో పాటు మరికొన్ని కంపెనీలను విక్రయించేందుకు సులభతర ప్రక్రియను చేపట్టాలని చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యూహాత్మక వాటా విక్రయానికి సంబంధించి సరైన పద్ధతిని పాటించనున్నామని, అయితే ఇందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతానికి పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని, వీటిపై ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత ముందుకు సాగనున్నట్లు చక్రవర్తి తెలిపారు. లాభాల్లో ఉన్న, లాభాల్లో లేని ప్రభుత్వ రంగ సంస్థల ఐదో జాబితాను ఈ మధ్యనే నీతీ ఆయోగ్.. దీపమ్‌కు సమర్పించింది. దీంతో వ్యూహాత్మక వాటాలను విక్రయించే ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య 35కు చేరుకుంది. ఐదో జాబితాకు సంబంధించి కేబినెట్ అనుమతి తీసుకోవాల్సి ఉందని చక్రవర్తి తెలిపారు. త్వరలోనే ఆసక్తి వ్యక్తీకరణలు వ్యూహాత్మక వాటాలను విక్రయించనున్న కంపెనీల జాబితాలో ఎయిర్ ఇండియా, దాని అనుబంధ సంస్థ ఏఐఏటీఎసఎల్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, బీఈఎంఎల్, స్కూటర్స్ ఇండియా, భారత్ పంప్స్ కంప్రెసర్స్, భద్రావతి, సెయిల్‌కు చెందిన సేలం, దుర్గాపూర్ యూనిట్లు ఉన్నాయి. వీటితోపాటు

దీపమ్ సన్నాహాలు

ఏకమొత్తంగా కంపెనీలను విక్రయించే జాబితాలో హిందుస్తాన్ ఫ్లూరోకార్బన్, హిందుస్తాన్ న్యూస్ ప్రింట్, హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్, సెంట్రల్ ఎలక్ట్రానిక్స్, బ్రిడ్జ్ అండ్ రూఫ్ ఇండియా, ఎన్ఎండీసీకి చెందిన నాగర్నార్ స్టీల్ ప్లాంట్, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా యూనిట్లు, ఐటీడీసీ ఉన్నాయి. ఈ కంపెనీల విక్రయాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని చూస్తున్నట్లు చక్రవర్తి తెలిపారు. ఈ కంపెనీలను గుర్తించటంతో ఇక ఆసక్తి వ్యక్తీకరణలను కోరాల్సి ఉందని ఆయన చెప్పారు. మరోవైపు ఎయిర్ ఇండియాలో వాటాల విక్రయాన్ని మాత్రం సంస్థ ఆర్థిక ఫలితాలను ప్రకటించిన తర్వాత చేపట్టాలని చూస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫలితాలు మెరుగ్గా ఉంటే విక్రయం సులభం అవుతుందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎయిర్ ఇండియాలో ప్రభుత్వం 76 శాతం వాటాలను విక్రయించాలని చూస్తున్న సంగతి తెలిసిందే.

న్యూక్లియర్ ఫిజిక్స్‌లో నిష్ణాతుడు.. ఎమిలియో సెగ్రీ

గత శతాబ్దంలో సైన్సు ప్రపంచంలో వివిధ దేశాలలో, అందులోనూ పాశ్చాత్యదేశాలన్నింటిలో వికసించి పరిమళించ వలసిన తరుణంలో, జర్మనీ, ఇటలీ, స్పెయిన్ దేశాలలో హిట్లర్, ముస్సోలినీ, ఫ్రాంకో వంటి నియంతలు అధికారం హస్తగతం చేసుకొని, జాత్యహంకార విధానాలు అమలు పరచడంతో, యూదులను, అభ్యుదయ భావాలు, విశాల మనస్తత్వం గల వారిని బాధలగాధలకు గురిచేసి, వారిని తరిమివేయడంలో చాలానష్టం వాటిల్లింది. చివరకు వారు అష్టకష్టాలూ పడి అమెరికా చేరుకుని, అక్కడ వారి సైన్సు పరిజ్ఞానాన్ని కారుచౌకగా అమెరికాకు ధారాదత్తం చేయడంతో, ఎన్నో పాశ్చాత్యదేశాలు తీవ్రంగా నష్టపోయాయి. సైన్సుపై, పరిశోధనలపై అమెరికా గుత్తాధిపత్యం పెరిగింది. దాదాపు పేటంట్లన్నీ అమెరికా పరం అయి, సైన్సు, పరిశోధన, అణుశక్తి పరిశోధన - యివి అన్నీ అమెరికా గుప్పిట్లో చిక్కుకుపోయాయి. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో అమెరికా Unipolar World అయింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో సైన్సు-టెక్నాలజీ స్వతంత్రంగా అభివృద్ధి చెందకుండా అమెరికా అడ్డుపడుతోంది. ఇది దాచేస్తే దాగని సత్యం.

యూదులు స్వతహాగా బాగా తెలివైనవారు. చొరవ, సైంటిఫిక్ అన్వేషణలో అగ్రగాములు. జర్మనీలో హిట్లర్ యూదు వ్యతిరేక జాత్యహం కారంతో లక్షలాదిమంది అమాయక యూదు లను కాన్‌సన్‌ట్రేషన్ క్యాంపులలో పెట్టి వారిని హతమార్చాడు. జర్మనీకి అండగా ఇటలీలో ముస్సోలినీ, స్పెయిన్‌లో ఫ్రాంకో వంత పడుతూ, యూదులు ఏ ఉద్యోగం చెయ్యకూడదని ఫాసిస్టు దేశాలలో ఆంక్షలు విధించారు. అందులో ముఖ్యంగా యూనివర్శిటీలలో, ప్రభుత్వ పదవులలో ఎక్కడా వుండకూడదని అందరినీ తొలగించారు. దానిలో అతికష్టం మీద కొంతమంది యూదులు, అభ్యుదయవాదులు కట్టుబట్టలతో ఎంతో కష్టంమీద అమెరికాకు శరణార్థులుగా వెళ్లారు. అమెరికా వారి దైన్యస్థితిని సాధనంగా చేసుకొని, మహాశాస్త్రజ్ఞులకు కూడా అతి తక్కువ జీతం యిచ్చి, వారిచేత బండచాకిరీ చేయించుకుని, వారు కనుగొన్నవాటికి పేటెంట్లు కూడా సక్రమంగా యివ్వకుండా, వారిని అన్నివిధాలా దోపిడీ చేసింది. అయినా, అలాంటివారితో అష్టకష్టాలు పడి చివరకు వారు నోబెల్ బహుమతి పొందారంటే వారి పట్టుదల, దీక్ష, సైన్సు ద్వారా సత్యాన్వేషణ చేసి ప్రకృతి రహస్యాలు ఛేదించాలన్న వారి తపన వలననే సాధ్యం అయింది. ఆ విధంగా ఫిజిక్స్‌లో నోబెల్ బహుమతి పొందిన శరణార్థులలో ఎమిలో జి.సెగ్రీ ఒకరు. నిరంతర సంఘర్షణలో ముందుకు సాగుతూ అణుశక్తి రహస్యాలను ఛేదించిన గొప్ప వ్యక్తి.

ఎమిలో గినో సెగ్రీ 1905 ఫిబ్రవరి 1న టివోరీ, ఇటలీలో జన్మించాడు. 84 సంవత్సరాల వయస్సులో 1989 ఏప్రిల్ 22న అమెరికాలో లెఫాయిట్, కాలిఫోర్నియాలో ఆయన సంఘర్షపూరిత జీవనయానం ముగిసింది. అణుశక్తిలో Technetium, Astatine మరియు Antiproton అనే Sub-Atomic Particleని కనుగొన్నాడు. అతని విశిష్ట పరిశోధనల ఫలితంగా అణువిజ్ఞానరంగం కొత్తపుంతలు త్రొక్కింది. ఇటలీ రాజధాని రోమ్ దగ్గరలో జన్మించి, రోమ్ యూనివర్శిటీలో చదివి, 1932 నుండీ నాలుగు సంవత్సరాలు ఫిజిక్స్‌లో అసిస్టెంటు ప్రొఫెసరు అయి, 1936 నుండి 1938 వరకూ ఫిజిక్స్ లేబరేటరీ డైరెక్టరై, అమెరికా పర్యటించారు. తన పర్యటనలో అమెరికాలో బెర్క్లీ రేడియేషన్ లేబరేటరీలో వుండగా అమెరికాలో తమ రేడియేషన్ లేబరేటరీలో ఎదురవుతున్న అంతుబట్టని సమస్య గురించి అతనికి తెలియజేసి, తమ లేబరేటరీ సైక్లోట్రాన్ డిఫ్లెక్టర్ నుండి రకరకాల అణుధార్మికత వెలువడుతోందని తెలియజేసి, అతని సలహా అడిగారు. అతను దానిపై సైద్ధాంతికంగాను, కెమికల్‌గాను పరిశోధించి, అంతవరకూ తెలియని ఒక రేడియో యాక్టివ్ ఎలిమెంటు ఒకటి కారణం అని గుర్తించాడు. ఈ విధంగా Technetium కనుగొన్నాడు. ప్రకృతిలో లేని ఆర్టిఫిషియల్‌గా సింథసైజ్




చేయబడిన కెమికల్ ఎలిమెంట్ ద్వారా ఆ రేడియేషన్ వస్తోందని నిర్ధారించాడు. ఈ కెమికల్ ఎలిమెంట్ కొంత సమయం మాత్రమే వుంటుంది. అమెరికా నుండి తన పర్యటన ముగించుకుని వెళ్లబోతూవుండగా ఇటలీలో ముస్సోలినీ ఒక జాత్యహంకార నిర్ణయం తీసుకుని, యూదులు ఇటలీలో ఏ పదవిలో వుండటానికి వీలులేదని శాసించాడు. అమెరికాలో బెర్క్లీ రేడియేషన్‌లాబ్ 300 డాలర్లు యిచ్చే రీసెర్చి అసిస్టెంటు ఉద్యోగం ఆ మహాశాస్త్రజ్ఞునికి యిచ్చింది. అతను అమెరికాలో శరణార్థిగా మారాడని తెలియగానే, ఆ జీతాన్ని 116 డాలర్లకు అమెరికాలో తగ్గించారు. అంత తక్కువ జీతంతో అమెరికాలో పనిచేస్తూ Meta stable Isotope Technetium-99m కనుగొన్నాడు. న్యూక్లియర్ మెడిసిన్‌లో ఈనాడు ప్రతీసంవత్సరం కోట్లాదిమంది చికిత్సకు వినియోగిస్తున్న Isotope 99m కనుగొన్నాడు. తరువాత తన పరిశోధనలలో Element 93 ని కూడా కనుగొన్నాడు.

Periodic Table Missingగా వున్న Element 85 ని కూడా కనుగొన్నాడు. దానిని యిప్పుడు Astatine అని పిలుస్తారు. 1941 డిశంబరులో పెర్ల్‌హార్బర్‌పై జపాను దాడి చెయ్యగానే, అమెరికా ఇటలీపై యుద్ధం ప్రకటించింది. సెగ్రీ కనుగొన్న Isotopesని ఈనాడు న్యూక్లియర్ మెడిసిన్‌లో ప్రతీఏటా ఒక కోటిమందికి పైగా వినియోగిస్తున్నారు. ఎలిమెంట్ 93 కనుగొందామని ప్రయత్నించినా, అది అంతుచిక్కలేదు. కాని, Xenon-135ని కనుగొన్నాడు. పీరియాడిక్ టేబుల్ missingగా వున్న Element 85, దానిని Isolate చెయ్యడాన్ని సాధించి ఈనాడు Astatineగా వున్న కొత్త ఎలిమెంట్‌ని కనుగొన్నాడు. అమెరికా యాటం బాంబు రూపొందించడానికి ప్రారంభించిన మాన్ హాటన్ ప్రాజెక్టులో రేడియో యాక్టివిటీ గ్రూపుకు హెడ్ అయ్యాడు. రెండవప్రపంచయుద్ధం అనంతరం చికాగో యూనివర్శిటీ Full Professor చేస్తానని సెగ్రీని రమ్మంది. అయినా తాను కాలిఫోర్నియాలో బర్క్లీలోనే వుండాలని నిశ్చయించుకున్నాను. అయితే అక్కడ లారెన్స్‌తో సంబంధాలు చెడినాయి. హైడ్రోజన్ బాంబు తయారుచెయ్యాలన్న లారెన్స్ నిర్ణయాలతో సెగ్రీ విభేదించాడు. హైడ్రోజన్ బాంబు ఉపయోగం తక్కువ అని అభిప్రాయపడ్డాడు.

రెండవ ప్రపంచయుద్ధానికి ముందు అతను కనుగొన్న విషయాలకు చివరకు పేటెంట్లు లభించాయి. కోర్టు అతనికి చివరకు 400,000 డాలర్లు యివ్వాలని ఆదేశించింది. కాని, లాయర్లు తమ కోర్టుఫీజుల క్రింద డబ్బంతా తీసుకొని కేవలం 20 వేల డాలర్లు సెగ్రీ చేతిలో పెట్టారు. మరోప్రక్క విదేశస్థులు "లాయల్టీ" అంటే అమెరికాకు విధేయులై వుంటామని హామీ యివ్వాలని అమెరికన్ సైంటిస్టులు సెగ్రీని గోలచేశారు. అసలు Proton వుందా అని అమెరికన్ సైంటిస్టులు సెగ్రీని అల్లరిచేశారు. Anti-Protons వున్నాయన్న విషయాన్ని సెగ్రీ చివరకు నిరూపించాడు. దానితో సెగ్రీకి 1959లో నోబెల్ బహుమతి లభించింది.

సెగ్రీ తన డాక్టరేటుకి అడ్వయిజరు అయిన ఎన్‌జెకో ఫెర్మీ రీసెర్చి పేపర్లు అన్నీ వెలువరించారు. 1973 వరకూ అమెరికాలో వుండి, యూనివర్శిటీలో రిటైర్‌అయి, తన జన్మస్థానమైన రోమ్ యూనివర్శిటీకి ప్రొఫెసర్‌గా తిరిగి వచ్చాడు. తన 84వ ఏట 1989లో మరణించాడు. న్యూక్లియర్ ఫిజిక్స్‌పై సెగ్రీ ఎన్నో ప్రామాణిక గ్రంథాలు రచించాడు. "Nuclei and Particles", "From X-Rays to Quarks: Modern Physicists and their Discoveries," "From falling bodies to Radio Waves" వంటి ప్రామాణికగ్రంథాలు రాశాడు. 1993లో సెగ్రీ ఆత్మకథ "A Mind in motion"ని కాలిఫోర్నియా యూనివర్శిటీ వెలువరించింది.

ఫిజిక్స్‌లో పరిశోధకులు, పరిశోధనలపై సెగ్రీ అమూల్యమైన ఫోటోలు తీసి ఫిజిక్స్ చరిత్రను ఫోటోలుగా అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్‌కి యిచ్చి చరిత్రలో శాశ్వతస్థానం పొందాడు. జీవితంలో ఎన్నో నిమ్నోన్నతాలు చవిచూసిన సెగ్రీ ధైర్యంతో, సాహసంతో ముందడుగు వేసి సైన్సుకు ఎనలేనిసేవ చేశాడు. జాత్యహంకారం తప్పు అని నిరూపించాడు. హిట్లర్, ముస్సోలినీ మట్టిలో కలిసిపోయారు. కాని, సైంటిస్టుగా సెగ్రీ చిరస్థాయిగా తనస్థానం పొందడం గర్వకారణం.



టాలీవుడ్‌ని వదలను



మొన్నటిదాక టాప్‌ఫామ్‌లో ఉన్న రకుల్ ప్రీత్‌సింగ్‌కు తెలుగులో కొంత గ్యాప్ వచ్చింది. ప్రస్తుతం ఆమె ఫోకస్ మొత్తం బాలీవుడ్, కోలీవుడ్ మీదే పెట్టింది. అయితే తెలుగులో ఆఫర్స్ తగ్గిపోవడం వల్లే రకుల్ అక్కడికి మకాం మార్చిందన్న మాటను పూర్తిగా కొట్టిపారేస్తోంది. అలాంటిదేమి లేదని ఇది అనుకోకుండా వచ్చిన గ్యాప్ తప్ప వేరే కారణం లేదని చెప్పింది. ఇతర భాషల్లో బిజీగా ఉండటం వల్ల కొన్ని మిస్ అయ్యుండొచ్చేమో గాని తెలుగుకు తన ప్రాధాన్యత ఎప్పుడూ తగ్గదని స్పష్టం చేసింది. ఎప్పటికీ హైదరాబాద్ తన పుట్టినిల్లు లాంటిదని టాలీవుడ్‌ని వదిలే ప్రసక్తే లేదని చెబుతోంది. అయితే రకుల్ బిజీగా ఉన్న మాట నిజమే. ఫిబ్రవరి 14న ఆమె నటించిన కార్తిదేవ్ విడుదల కానుంది. అలాగే మరో సినిమాలో శివ కార్తికేయన్ సరసన మరో ఛాన్స్ కొట్టేసింది. ఇవికాకుండా హిందీలో మార్జవాన్ కోసం ఈ భామ యోగా కసరత్తులు కూడా చేస్తోంది. గతంలో కొన్ని సినిమాల ఎంపికలో పొరపాటు చేసానని ఈసారి అవి రిపీట్ కాకుండా జాగ్రత్తపడతానని చెబుతోంది.

దూసుకుపోతున్న సుకుమార్



బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ ఓ వైపు దర్శకుడిగా సినిమాలు చేస్తూనే, మరోవైపు నిర్మాతగాను చిత్రాలను నిర్మిస్తూ దూసుకుపో తున్నాడు. తన నిర్మాణ సంస్థ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లో తన దర్శకత్వంలో పనిచేస్తున్న యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ, ఇతర ప్రముఖ నిర్మాణ సంస్థలతో కలిసి సినిమాలను రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల సుకుమార్ మైత్రీ మూవీ మేకర్స్ సంస్థతో కలిసి తన శిష్యుడుని దర్శకుడిగా పరిచయం చేస్తూ సాయిధరమ్ తేజ్ సోదరుడు వైష్ణవ తేజ్ హీరోగా ఓ సినిమాని ప్రారంభించారు. తాజాగా సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ పైన నార్త్ స్టార్ ఎంటర్‌టైన్మెంట్ శరత్ మరార్‌తో కలిసి ఓ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నాడు. ఈ చిత్రంలో నాగశౌర్య హీరోగా నటిస్తున్నాడు. సుకుమార్ దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న కాశీ విశాల్ ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ విధంగా సుకుమార్ కెరీర్లో స్పీడు పెంచాడన్నమాట.

చాలా ధైర్యవంతురాలిని



తెలుగు చిత్రరంగంలో తనదైన ముద్రను వేసిన ఉత్తరాది బ్యూటీ కాజల్ అగర్వాల్ మొదట్లో ప్రదర్శించినంత వేగం కన్పించట్లేదనిపిస్తోంది. అయినా ఒక హీరోయిన్ ఇంతకాలం పాటు ఇండస్ట్రీలో నిలబడటం అంత మామూలు విషయం కాదు. తాజాగా ఈ భామ కమల్‌హాసన్‌తో సరసన నటిస్తోంది. ఈ సందర్భంగా ఆమెను పలకరించినప్పుడు, కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. తన మార్కెట్ పడిపోతుందని తానెప్పుడూ భయపడలేదని, అలాంటి భయాలు ఉండవని స్పష్టం చేసింది. తాను ధైర్యవంతురాలినని అంటూ ఒక ఉదంతాన్ని చెప్పుకొచ్చింది. ఒకసారి తన స్నేహితురాలిని ఒక వ్యక్తి వేధింపులకు గురి చేశాడని.. ఆ విషయం తనకు తెలిసి.. అతగాడి కాలర్ పట్టుకొని ముఖం పచ్చడయ్యేలా కొట్టానని చెప్పుకొచ్చింది. సినిమాలో ఛాన్సుల కోసం కలవాలని చెప్పే వారు ఈ పరిశ్రమలో ఉంటారని, కాకుంటే తనకు అలాంటి పరిస్థితిని ఎప్పుడూ ఎదుర్కోలేదని చెప్పింది.



వరుణ్ తేజ్ సరసన ఎవరబ్బా !







ఎఫ్-2 సినిమా తర్వాత మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తదుపరి సినిమాలో నటించేందుకు రెడీ అవుతున్నాడు. హరీశ్ శంకర్ దర్శకత్వంలో 'వాల్మీకి' సినిమా చేస్తున్నాడు. తమిళంలో భారీ హిట్ కొట్టిన జిగిర్తాండ సినిమాకు ఇది రీమేక్. తమిళంలో బాబీసింహా చేసిన పాత్ర కోసం వరుణ్ తేజ్ ఎంపికయ్యాడు. ఇక సిద్ధార్థ్ చేసిన పాత్రకు శ్రీ విష్ణువును తీసుకున్నాడు. కథానాయికగా రష్మిక మందన పేరును పరిశీలిస్తున్నట్టుగా వార్తలు వచ్చాయి. కానీ తాజాగా ఈషా రెబ్బా పేరు తెరపైకి వచ్చింది. బిజీ షెడ్యూల్ కారణంగా రష్మిక వరుణ్ తేజ్ సినిమాలో నటించే అవకాశాలు తక్కువగా ఉన్నాయని, ఈషా రెబ్బ ఈ సినిమాకు ఈజీగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఛాన్సుందని సినీ జనం అనుకుంటున్నారు. మరి ఈషా రెబ్బా, రష్మిక మందనల్లో ఎవరు వరుణ్ తేజ్ సరసన నటిస్తారనేది వేచి చూడాలి.

ఇక్కడ ఫట్..అక్కడ హిట్

సైలిష్ స్టార్ బన్నీని నిరాశపరిచిన సినిమా నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా. ఈ సినిమా వల్ల నిర్మాతలకు, బయ్యర్లకు భారీ నష్టాలు వచ్చాయి. అయితే ఇక్కడ ఫ్లాప్ అయిన ఈ సినిమా మరోచోట సూపర్‌హిట్ అయింది. సినిమా ఇక్కడ ఫ్లాప్ అయినా అక్కడ హిట్ అయినందుకు బన్నీ అభిమానులు సంతోషపడుతున్నారట. ఆ విశేషాల్లోకి వెళితే, గత ఏడాది మే నెలలో విడుదలైన ఈ సినిమా హిందీ డబ్బింగ్ వెర్షన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో యూట్యూబ్‌లో విడుదలైంది. విడుదలైన రెండు రోజులకే ఈ సినిమాను కోటిమందికి పైగా వీక్షించారు. దీనికి వచ్చే లైక్‌లు కూడా లక్షల్లో ఉండటం విశేషం. ఇంతకుముందు కూడా బన్నీ సినిమాలు డబ్ అయి యూ ట్యూబ్‌లో విడుదలైనప్పుడు వాటికి కూడా అత్యధిక వ్యూస్ వచ్చాయి. అయితే ఈ సినిమాకు ఊహించనంత రెస్పాన్స్ వచ్చిందని చిత్ర యూనిట్ పేర్కొంది.



ఫ్యాషన్ వీక్‌లో కంగన

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ క్రిష్‌తో కంగన గిల్లికజ్జాల గురించి తెలిసిందే. మణికర్ణిక - ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ చిత్రాన్ని క్రిష్ 70శాతం చిత్రీకరించినా ఆ క్రెడిట్ అంతా తనదే అంటూ కంగన కలరింగ్ ఇవ్వడంపై సర్వత్రా ఆసక్తికర చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ భామ తాజాగా కంగన ముంబై లాక్మే ఫ్యాషన్ వీక్‌లో అనూహ్యంగా ప్రత్యక్షమైంది. మణికర్ణిక విజయంతో కంగన ముఖంలో కొత్తకాంతులు కనిపిస్తున్నాయని అభిమానులు సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం తొలి వీకెండ్ 50 కోట్లు పైగా షేర్ సాధించి తను వెడ్స్ మను రికార్డుల్ని సైతం బ్రేక్ చేసింది. కంగనకు ఆల్ టైమ్ బెస్ట్ చిత్రంగా నిలవనుందని విశ్లేషకులు చెబుతున్నారు. 100 కోట్లు పైగా షేర్ వసూలు చేసే దిశగా మణికర్ణిక దూసుకెళుతోందన్నది ట్రేడ్ రిపోర్ట్.



'యాంగ్రీ స్టార్'గా రాజశేఖర్

'యాంగ్రీ యంగ్ మ్యాన్' అని ప్రేక్షకులచేత పిలిపించుకున్న రాజశేఖర్ తాజాగా 'యాంగ్రీ స్టార్' అయ్యారు. రాజశేఖర్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఆయన కొత్త సినిమా 'కల్కి' టీజర్‌ను విడుదల చేశారు. ఇది రెగ్యులర్ టీజర్‌లా కాకుండా జస్ట్ బర్త్‌డే ట్రీట్‌లా ఉంది. 37 సెకన్ల టీజర్లో సినిమాకు సంబంధించిన కథను కానీ ఇతర వివరాలేవీ కూడా వెల్లడించకుండా ఒక స్టైలిష్ యాక్షన్ సీక్వెన్స్ మాత్రం చూపించాడు దర్శకుడు ప్రశాంత్ వర్మ. వర్షంలో రాజశేఖర్‌పై రౌడీలు దాడికి ప్రయత్నించడం.. వారి నుంచి రాజశేఖర్ ఒడుపుగా తప్పించుకోవడం..కత్తితో పొడవబోతే పక్కకు జరిగినప్పుడు గొడుగుకు కత్తి రాసుకోవడం.. వాటి ఘర్షణకు దీపావళి క్రాకర్స్‌లా మంట రావడం.. ఆ సమయంలో 'హ్యాపీ బర్త్ డే యాంగ్రీ యంగ్ మ్యాన్ డా. రాజశేఖర్' అనే క్యాప్షన్ వేసి ఆ తర్వాత 'యంగ్ మ్యాన్' పదం కాస్తా 'స్టార్' గా మారడం సూపర్ స్టైలిష్‌గా ఉంది. తన ట్యాగ్‌కు తగట్టే రాజశేఖర్ ఓ ఇంటెన్స్ లుక్ ఇచ్చారు. దర్శకుడు రాజశేఖర్ బలం అయిన యాంగ్రీ ఇమేజిని ప్రశాంత్ వర్మ బాగా వాడుకున్నట్టు కన్పిస్తోంది.

6న జీశాట్ -31 ప్రయోగం

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 40వ కమ్యూనికేషన్ శాటిలైట్ జీశాట్-31ను బుధవారం ఫ్రెంచ్ గుయానా నుంచి పంపడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీని కాలపరిమితి 15 ఏళ్లు. జీశాట్ 31ద్వారా భూకక్ష్యంలోకి సమాచార సంకేతాలను ఆటోమేటిక్‌గా పంపవచ్చని సంస్థ తెలిపింది. ఈ ఉపగ్రహం బరువు 2,535 కేజీలు. ఫ్రెంచ్ గుయానాలోని అరియానే-5 (వీఏ 247) నుంచి ఈ ప్రయోగం చేపడతారు. ఇస్రో చేపట్టిన ఇన్‌శాట్/జీశాట్ శాటిలైట్ల వరుస క్రమంలో ఇది ఉంటుంది. వీశాట్ నెట్వర్కులు, టీవీ అప్ లింకులతోపాటు డిజిటల్ శాటిలైట్‌లను కూడా కలుపుకుంటూ జీశాట్ 31 పనిచేస్తుంది. దీంతో డీటీహెచ్ టెలివిజన్ సర్వీసులు, సెల్యూలర్ కనెక్టివిటీ వంటి అప్లికేషన్లను పెంపొందించు కోవచ్చు. జీశాట్ 31తో అరేబియా, హిందూ, బంగాళాఖాతం సముద్రాల్లోకూడా సమాచార వ్యవస్థ పటిష్టమవుతుందని ఇస్రో తెలిపింది.

గడ్కరీ దమ్మున్నోడు.. : రాహుల్

న్యూఢిల్లీ : 'ఇంట గెలిచి.. రచ్చ గెలవాలి' అన్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఫిదా అయ్యారు. సొంతింటిని చక్కబెట్టలేనోడు దేశనిర్వహణకు అనర్హుడన్న గడ్కరీ వ్యాఖ్యలను రాహుల్ అభినందించారు. బీజేపీలో గడ్కరీ దమ్మున్నోడని, రాఫెల్ ఒప్పందం, రైతుల దుస్థితి, స్వయంప్రతిపత్తిని కోల్పోతూ నాశమవుతున్న ప్రతిష్టాత్మక సంస్థలపైనా ఆయన మాట్లాడాలని అన్నారు. 'గడ్కరీజీ మీకు అభినందనలు. బీజేపీలో మీరు ఒక్కరే దమ్మున్నవారు. దయచేసి రాఫెల్ కుంభకోణం, అనిల్ అంబానీ, రైతుల దుస్థితి, సంస్థల వినాశనంపైనా మాట్లాడండి' అంటూ ట్వీట్ చేశారు. గడ్కరీ వ్యాఖ్యలపై నివేదికనూ జతచేశారు. శనివారం నాగ్‌పూర్‌లో బీజేపీ విద్యార్థి సంఘమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నిర్వహించిన సమావేశంలో గడ్కరీ ఆ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నాయకత్వాన్ని ఎద్దేవా చేసేలా కేంద్రమంత్రి ఇటీవల పలు సందర్భాల్లో మాట్లాడటాన్ని కాంగ్రెస్ నేతలు స్వాగతిస్తున్న నేపథ్యంలో రాహుల్ ఆయనను అభినందించారు. 'హామీలను నిలబెట్టుకోలేని నేతలను ప్రజలు చితకబాదతారు' అని గడ్కరీ అనడాన్ని ప్రశంసించిన కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీశ్ తివారీ... ఆయన టార్గెట్ ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆయన చూపు ప్రధాని కుర్చీపై ఉందంటూ ఎద్దేవా చేశారు. డిసెంబరులో పూనేలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న గడ్కరీ.. వైఫల్యాలు, ఓటములను స్వీకరించే మనస్తత్వం నాయకత్వానికి ఉండాలని అన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో బీజేపీ పరాజయాన్ని ఉద్దేశించి ఆయన పై వ్యాఖ్యలు చేశారు.

పార్లమెంటులో కోల్‌కతా కుదుపు

- ఉభయ సభలు నేటికి వాయిదా
- సీబీఐని అడ్డుకోవడం విచారకరం : రాజ్‌నాథ్
- కేంద్రం సీబీఐని కీలుబొమ్మగా మార్చింది : ప్రతిపక్షాలు



న్యూఢిల్లీ : సీబీఐ-కోల్‌కతా పోలీసుల మధ్య నెలకొన్న వివాదంతో సోమవారం పార్లమెంట్ ఉభయ సభల కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. పశ్చిమ బెంగాల్‌లో కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా తృణమూల్ ఎంపీలు ఆందోళన చేపట్టడంతో లోక్‌సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. సభ ప్రారంభం కాగానే టీఎంసీ ఎంపీలు కోల్‌కతా వ్యవహారాన్ని లేవనెత్తారు. ప్రశ్నోత్తరాల తర్వాత దీనిపై చర్చ చేపడదామని స్పీకర్ సుమిత్రా మహజన్ చెప్పడంతో వారు ఆందోళనకు దిగారు. వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన చేపట్టారు. దీంతో సభను మధ్యాహ్నానికి ఆ తరువాత పలుమార్లు వాయిదాపడి చివరికి మంగళవారానికి వాయిదాపడింది. మొదటి వాయిదా అనంతరం 12 గంటలకు సభ ప్రారంభం కాగానే టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తాజా పరిణామాలపై ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. దీనికి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ.. సీబీఐ అధికారులను విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం దురదృష్టకరమని అన్నారు. 'కోల్‌కతా ఘటన దేశ రాజకీయ వ్యవస్థకు ముప్పు లాంటిది. శారదా కుంభకోణంలో బడా రాజకీయ నాయకులు ఉన్నట్లు సీబీఐ దర్యాప్తులో తేలిందని గతంలో సుప్రీంకోర్టు కూడా చెప్పింది. దీనిపై నేను బెంగాల్ గవర్నర్‌తో మాట్లాడాను. ఘటనపై నివేదిక ఇవ్వాలని కోరాం' అని తెలిపారు. అయితే రాజ్‌నాథ్ ప్రసంగాన్ని తృణమూల్ నేతలు అడ్డుకోవడంతో సభలో మళ్లీ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో స్పీకర్ సుమిత్రా మహజన్ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకున్న పరిణామం 'అసాధారణమైనది' అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. చర్య తీసుకునే అధికారం కేంద్రానికి ఉన్నదని హెచ్చరించారు. ఉభయ సభలు పదేపదే వాయిదాపడిన అనంతరం మంగళవారానికి వాయిదాపడ్డాయి. లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు చేస్తున్న ఆందోళనకు కాంగ్రెస్, బీజేడీ, ఎన్సీపీ, ఎస్పీ, ఆర్‌జేడీ మద్దతు ప్రకటించాయి. పశ్చిమ బెంగాల్‌లో పరిణామానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం సీబీఐని దుర్వినియోగం చేస్తోందని వారు విమర్శించారు. చిట్‌ఫండ్ కుంభకోణానికి సంబంధించి కోల్‌కతా పోలీసు చీఫ్‌ని ప్రశ్నించేందుకు సీబీఐ ప్రయత్నించడంతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ ఆదివారం నిరసన ప్రారంభించారు. నగరంలోని లౌడోన్ స్ట్రీట్ ప్రాంతంలోని కుమార్ నివాసంలోకి ప్రవేశించేందుకు సీబీఐ బృందం ప్రయత్నించగా అనుమతించలేదు. పోలీసు జీపుల్లో ఎక్కించుకుని వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లారు.

తృణమూల్ కాంగ్రెస్ సభ్యుల నిరసనల మధ్య రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, ఇది 'అసాధారణమైంది', సీబీఐని అడ్డుకోవడం చట్టప్రకారం వారి విధులను నిర్వహించకుండా అడ్డుకోవడమేనన్నారు. చిట్‌ఫండ్ కుంభకోణానికి సంబంధించి కోల్‌కతా పోలీసు చీఫ్ రాజీవ్ కుమార్‌ని ఆదివారం ప్రశ్నించేందుకు పూనుకున్న సీబీఐ బృందాన్ని అడ్డుకోవడం సబబుకాదని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తరపున హోం మంత్రి మొదటగా స్పందించారు. కుమార్‌ని ప్రశ్నించాలని సీబీఐ బృందం భావించిందనీ, అయితే ఆయన సహకరించలేదని తెలిపారు. కోల్‌కతాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిపై లోక్‌సభలో రాజ్‌నాథ్ ఒక ప్రకటనతో సీబీఐ దర్యాప్తు బృందంతో వ్యవహరించిన తీరు అసాధారణమైనది, దేశ ఫెడరల్ వ్యవస్థకు ప్రమాదకరమైనదని చెప్పారు. "పశ్చిమ బెంగాల్‌లో రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే, దేశంలో ఏ భాగంలోనైనా సాధారణ పరిస్థితులను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం తన అధికారాలను వినియోగిస్తుంది" అని చెప్పారు. "ఆదివారం జరిగిన పరిణామాలు రాజ్యాంగ ఉల్లంఘనలను సూచిస్తున్నాయి" అని తీవ్రగందరగోళం మధ్య రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గవర్నరు నుంచి నివేదికను కూడా కోరామని చెప్పారు. దర్యాప్తు ఏజెన్సీలు తమ విధులను నిర్వర్తించుకునేందుకు సుహృద్భావ వాతావరణాన్ని పశ్చిమ బెంగాల్ అదేవిధంగా ఇతర రాష్ట్రాలు కల్పిస్తాయన్న ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు. అంతకుముందు బీజేడీ సభ్యుడు బి. మహతబ్ మాట్లాడుతూ, పశ్చిమబెంగాల్‌లో చోటుచేసుకున్న పరిణామాలు సరైనవి కావన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న వారి చేతిలో సీబీఐ కీలుబొమ్మగా మారుతోందని చెప్పారు. వృత్తిపరమైన సంస్థలా సీబీఐ వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖార్గె మాట్లాడుతూ, ప్రతిపక్షాన్ని మట్టుపెట్టేందుకు సీబీఐని సాధనంగా ప్రభుత్వం వాడుకుంటోందని విమర్శించారు. సీబీఐని దుర్వినియోగం చేసే ఘటనలు ఒక్క పశ్చిమ బెంగాల్‌లోనే చోటుచేసుకోలేదని, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులలో కూడా ఇంతకుముందు చోటుచేసు కున్నాయని చెప్పారు. ఎన్సీపీ నాయకుడు సుప్రియా సూలే, ధర్మేంద్ర యాదవ్ (ఎస్పీ), నారాయణ్ యాదవ్ (ఆర్‌జేడీ) కూడా కేంద్రానికి వ్యతిరేకంగా మాట్లాడారు. సీపీఎం సభ్యులు బదరుద్దోజా ఖాన్ మాట్లాడుతూ, ఈ వ్యవహారానికి సంబంధించి తృణమూల్ కాంగ్రెస్, కేంద్రం తప్పువుందన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలలో సీబీఐ ఎటువంటి చర్య తీసుకోలేదని చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్ తరపున విజయం సాధించి ఇటీవల బీజేపీలో చేరిన సౌమిత్ర ఖాన్ కూడా మాట్లాడారు.

రాజ్యసభలో కూడా ఇదే విధమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి. కేంద్రాన్ని సీబీఐ దుర్వినియోగం చేస్తోందన్న అంశంపై తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు గందరగోళం సృష్టించడంతో సభాకార్యక్రమాలు తుడిచిపెట్టుకుపోయాయి. సభ ప్రారంభమైన వెనువెంటనే టీఎంసీ సభ్యులు ఈ అంశంపై నినాదాలు చేయడం ప్రారంభించారు. దానితో గందరగోళం నెలకొనడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదావేశారు. సభ తిరిగి సమావేశమైన తరువాత కూడా పరిస్థితిలో మార్పులేకపోవ దంతో మంగళవారానికి వాయిదాపడింది. అంతకు ముందు టీఎంసీ నాయకుడు డెరిక్ ఓ'బ్రెయిన్ ఈ అంశంపై చర్చ చేపట్టాలని నోటీసు ఇచ్చారు. అయితే, ఛైర్మన్ వెంకయ్యనాయుడు నోటీసును తిరస్కరిస్తూ, జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తాలని సూచించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా కూడా లేవనెత్తవచ్చునని అన్నారు. టీఎంసీ, ఎస్పీ సభ్యులు వెల్ వద్దకు దూసుకువచ్చి నినాదాలు చేయడం ప్రారంభించారు. దానితో వెంకయ్య నాయుడు సభను మంగళవారానికి వాయిదావేశారు.

కోల్‌కతా పోలీస్ వర్సెస్ సీబీఐ

రంగంలోకి ఎంహెచ్ఏ - దర్యాప్తు అధికారుల ఇళ్లు, కార్యాలయం వద్ద కేంద్ర బలగాల మోహరింపు

న్యూఢిల్లీ : శారదా కుంభకోణం కేసు విచారణ నేపథ్యంలో సీబీఐ బృందం కోల్‌కతాకు వెళ్లడం రాజకీయంగా దుమారం రేపింది. సీబీఐ రాకను ఖండిస్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధర్నాకు దిగారు. ఈ క్రమంలో రాష్ట్రంతో పాటు కేంద్రంలోనూ ప్రకంపనలు మొదలయ్యాయి. దీంతో సీబీఐ బృందాన్ని అడ్డుకోవడంలో ఐపీఎస్ అధికారుల పాత్రపై ఆరా తీసేందుకు కేంద్ర హోంశాఖ (ఎంహెచ్ఏ) రంగంలోకి దిగింది. కోల్‌కతా నగర పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించేందుకు వెళ్లిన సీబీఐ బృందాన్ని అక్కడి పోలీసులు అడ్డుకున్న వ్యవహారంలో ఎంహెచ్ఏ విచారణ చేపట్టినట్టు శాఖాధికారులు సోమవారం తెలిపారు. 'సీబీఐ విచారణను అడ్డుకున్న ఐపీఎస్ అధికారులపై నివేదికను ఎంహెచ్ఏ కోరనుంది. ఆదివారం జరిగిన కోల్‌కతా ఎపిసోడ్‌లో వారి పాత్రను అంచనా వేయనుంది. అదే క్రమంలో వారు విధి ధర్మాన్ని, నిబంధనలను అతిక్రమించారా అన్నదీ పరిశీలించనుంది' అని హోంశాఖ అధికారి ఒకరు తెలిపారు. కేంద్ర హోంశాఖకు అందిన నివేదికల ప్రకారం సీబీఐ బృందాన్ని పశ్చిమ బెంగాల్ పోలీసులు అడ్డుకున్నట్టు తెలుస్తోందని అని మరొక అధికారి అన్నారు. 'రాష్ట్రంలోని సీబీఐ అధికారుల ఇళ్లు, సీబీఐ కార్యాలయం వద్ద భారీఎత్తున కేంద్ర బలగాలను హోంశాఖ మోహరించింది. రాష్ట్రంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ.. నిశితంగా పరిశీలిస్తోంది. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇప్పటికే పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేసరీనాథ్ త్రిపాఠితో మాట్లాడారు. అక్కడి పరిస్థితుల గురించి తెలుసుకున్నారు' అని అధికారులు వెల్లడించారు.

నల్లధనంపై నివేదికలను బయట పెట్టలేం

పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉన్నాయి

ఆర్టీఐ ప్రశ్నకు ఆర్థిక మంత్రిత్వ శాఖ సమాధానం

న్యూఢిల్లీ : పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉన్నందున నల్లధనానికి సంబంధించిన నివేదికలను వెల్లడించలేమని ఆర్థికమంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దేశం లోపల, వెలుపల భారతీయుల నల్లధనానికి సంబంధించి మూడు నివేదికల ప్రతులను వెల్లడించేందుకు మంత్రిత్వ శాఖ తిరస్కరించింది. ఈ నివేదికలను పార్లమెంటరీ ప్యానల్ పరిశీలిస్తోందని, అందువల్ల వివరాలను వెల్లడించడం సభా హక్కులను ఉల్లంఘించినట్లు అవుతుందని తెలిపింది. ఈ నివేదికలను నాలుగేళ్ల క్రితం ప్రభుత్వానికి సమర్పించాయని తెలిపారు. నల్లధనంపై అధ్యయనం చేసేందుకు యూపీఏ ప్రభుత్వం 2011లో ఢిల్లీకి చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ), నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రిసెర్చ్ (ఎన్సీఏఈఆర్), ఫరీదాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐఎఫ్ఎం)లను నియమించింది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) చట్టం క్రింద అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రిత్వ శాఖ సమాధానం ఇస్తూ, ఎన్ఐపీఎఫ్‌పీ, ఎన్సీఏఈఆర్, ఎన్ఐఎఫ్ఎం తమ నివేదికలను వరుసగా 2013 డిసెంబరు 30, 2014 జూలై 18, 2014 ఆగస్టు 21 తేదీలలో సమర్పించాయని తెలిపింది. ఈ నివేదికలు పార్లమెంటరీ కమిటీ ముందు ఉన్నాయని, కమిటీ పరిశీలిస్తోందని లోక్‌సభ సచివాలయం తెలిపింది. పీటీఐ విలేకరి ఆర్టీఐ క్రింద అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రిత్వ శాఖ పేర్కొన్నది. ఈ నివేదికల ప్రతులను ఇచ్చేందుకు తిరస్కరించింది. ఆ విధంగా చేయడం పార్లమెంట్‌ను ధిక్కరించడం క్రిందకు వస్తుందని తెలిపింది. అందువల్ల సమాచార హక్కు చట్టం సెక్షన్ 8 (1), (సి) క్రింద వెల్లడించడాన్ని మినహాయించాలని కోరింది. సమాచారాన్ని ఇవ్వటాన్ని ఈ సెక్షన్లు అడ్డుకుంటున్నాయనీ, "నివేదికలను వెల్లడించడం పార్లమెంట్‌ను హక్కులను ధిక్కరించడమే అవుతుంది" అని ఆ సెక్షన్లు పేర్కొంటున్నాయి. ఈ నివేదికలను 2017 జూలై 21న పార్లమెంటరీ కమిటీ ముందు ఉంచారు.

రబ్బర్ గోడౌన్లు బుగ్గి

థానే : రబ్బరు, ప్లాస్టిక్ నిల్వ ఉంచిన 25 గోడౌన్లు అగ్నికి ఆహుతయ్యాయి. సోమవారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగిందని అధికారులు వెల్లడించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, థానే మున్సిపల్ కార్పొరేషన్ విపత్తు నిర్వహణాధికారి సంతోష్ కదమ్ తెలిపారు. దహిసర్- మోరీకి చెందిన ఉత్తర్‌శివ్ గ్రామంలో గోడౌన్‌లోని ఆక్సీ-ఎసిటిలీన్ సిలిండర్ పేలడంతో ఈ ఘటన జరిగిందని, దగ్గర్లోని వేర్‌హౌస్‌లకు మంటలు పాకడంతో 25 గోడౌన్లు ఆహుతయ్యాయన్నారు. ఐదు అగ్నిమాపక దళాలు నాలుగు గంటలపాటు కష్టపడి మంటలను అదుపులోకి తెచ్చారని కదమ్ తెలిపారు. గోడౌన్ యాజమాన్యం నిల్వ ఉంచిన సరుకులు గురించి తెలపకపోవడంతో అగ్నిమాపక దళాలు ఇబ్బందులను ఎదుర్కొన్నాయన్నారు.

అన్న అక్కసు - నలుగురి సజీవదహనం

మాల్డా : కారుణ్య నియామకంలో తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని ఆగ్రహానికి గురైన అన్న సొంత ఇంటికి నిప్పుపెట్టాడు. దీంతో కుటుంబంలోని నలుగురు మృతి చెందగా,మరో నలుగురు గాయాల పాలయ్యారని సోమవారం పోలీసులు వెల్లడించారు. ప.బెంగాల్ మాల్డా జిల్లాలోని మదంతోల గ్రామంలో ఈ ఘటన జరిగిందన్నారు. కుటుంబ సభ్యులు నిద్రపోతుండగా,నిందితుడు మఖన్ మోండల్ రెండు రూములున్న ఇంటిపై పెట్రోలు పోసి తగుల బెట్టాడన్నారు. మఖన్ చిన్నతమ్ముడు గోవింద, పెద్దన్న వికాస్, గోవిందా ఇద్దరు కూతుర్లు మంటల్లో కాలిపోయారు. గోవింద, వికాస్ భార్య, కుమారుడు, కుమార్తె మాల్డా వైద్య కళాశాలలో చికిత్స పొందుతున్నారని పోలీసులు తెలిపారు. తల్లి వేరొక గదిలో పడుకోవడంతో ఆమె సురక్షితంగా తప్పించుకోగలిగింది. నిందితుడి తండ్రి నేషనల్ వాలంటీర్ ఫోర్స్ (ఎన్‌వీఎఫ్)లో మృతి చెందడంతో గోవిందకు ఉద్యోగం వచ్చింది.దీంతో వికాస్ ఆగ్రహానికి గురై ఈ దారుణానికి ఒడికట్టాడు.

హజారే ప్రాణాలు కాపాడండి : శివసేన

ముంబై : సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారేను కాపాడాలని శివసేన సోమవారం విజ్ఞప్తి చేసింది. 81 ఏళ్ల హజారే లోక్‌పాల్ బిల్లు కోసం చేపట్టిన నిరాహార దీక్ష ఆరోరోజుకు చేరుకోవడంతో శివసేన పై విధంగా కోరింది. అవినీతికి వ్యతిరేకంగా కేంద్రం, మహారాష్ట్రల్లో కాపలా దారులు(వాచ్‌డాగ్స్)ను నియమించాలని, రైతుల సమస్యలను పరిష్క రించాలని ఆయన ఉద్యమం చేపట్టిన విషయం తెలిసిందే. అన్నా ఈ విషయంలో మొండిగా వ్యవహరిస్తున్నారని ప్రధాని మోడీ విమర్శించడాన్ని తప్పుబడుతూ నిస్వార్థ ప్రజల లక్షణం అలాగే ఉంటుందని శివసేన తన పార్టీ పత్రిక సామ్నా సంపాదకీయంలో తెలిపింది. ముందు హజారే జీవితాన్ని కాపాడాలని,ఆపై ఏం చేయాలో నిర్ణయం తీసుకోవచ్చని పత్రిక పేర్కొంది. అవినీతి వ్యతిరేక ఉద్యమంలో హజారే ప్రాణాలను కాపాడకపోతే రాష్ట్రం అవినీతి వ్యాధిగ్రస్తమైనట్లేనని వెల్లడించింది. లోక్‌పాల్, లోకాయుక్త, రైతుల సమస్యలపై స్పందించి తనకు మరణం రాకముందే వాటిని నెరవేర్చుతారన్న ఆకాంక్షతో ప్రధాని మోడీకి అన్నా లేఖలు రాశారని పత్రిక గుర్తు చేసింది. మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిరాహార దీక్షను మీడియాలో రాకుండా మేనేజ్ చేస్తున్నారని పత్రిక విమర్శించింది. గతంలో ఆయన చేపట్టిన నిరాహార దీక్షలకు దేశవ్యాప్తంగా మద్దతు లభించిన విషయం తెలిసిందే.

ప్రభుత్వాల జోక్యం వద్దు..

అయోధ్య భూములు యూపీ ప్రభుత్వ అస్తి..

కేంద్రప్రభుత్వ భూసేకరణ రాజ్యాంగ విరుద్ధం

సుప్రీంలో పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ : అయోధ్యలోని రామ జన్మభూమి, బాబ్రీ మసీదు ప్రాంతం దగ్గరలోని స్థలాన్ని కేంద్ర ప్రభుత్వం సేకరించడాన్ని సవాల్ చేస్తూ.. 1993 నాటి భూసేకరణ చట్టం చెల్లుబాటును ప్రశ్నిస్తూ సోమవారం సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. రామ్‌లల్లా భక్తులుగా పేర్కొనే లక్నోకు చెందిన న్యాయవాదులు సహా ఏడుగురు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. కేంద్రప్రభుత్వం రాజ్యాంగం లోని ఆర్టికల్ 25ను ఉల్లంఘిస్తోం దని పేర్కొన్నారు. పూజలు, దైవదర్శనం, భక్తి వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని కేంద్రంతో పాటు యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోర్టుకు విన్నవించారు. ముఖ్యంగా తాము సేకరించినట్టు చెప్పుకునే 67.703 ఎకరాలలో ఉన్న శ్రీరామ్ జన్మభూమి న్యాస్, మానస్ భవన్, సంకట్ మర్చోన్ మందిర్, రామ్ జన్మస్థలం మందిర్, జానకీ మహల్, కథా మండప్‌ల వ్యవహారాల్లో తలదూర్చవద్దని సూచించాలని కోరారు. ఉత్తరప్రదేశ్‌లోని భూములు, ఆస్తులు రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులని, వాటిని కేంద్రం స్వాధీనం చేసుకోవడం రాజ్యాంగ ధిక్కరణే అవుతుందని పేర్కొన్నారు. రామ జన్మభూమి -బాబ్రీ మసీదు చుట్టుపక్కల ఉన్న 67 ఎకరాలను తాము సేకరించినట్టు పేర్కొన్న ప్రభుత్వం ఆ భూమిని అసలైన యజమానులకు ఇచ్చేందుకు అనుమతి కోరుతూ సుప్రీంకోర్టుకు వెళ్లింది. 0.313 ఎకరాలు మాత్రమే వివాదాస్పదమైనవని, ఆ స్థలంలో ఉన్న కట్టడాన్ని 'కర్ సేవక్‌లు' 1992, డిసెంబరు 2న కూల్చివేశారని పేర్కొంది.

మమతకు విపక్షాల బాసట

- టీడీపీ, డీఎంకే, ఆప్, ఆర్‌జేడీ, ఎస్పీ మద్దతు
- కేంద్రంపై పోరాటానికి కార్యాచరణ

న్యూఢిల్లీ : పోంజీ కుంభకోణంలో పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కమార్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అరెస్టు చేసే క్రమంలో కేంద్ర ప్రభుత్వంపై ఆ రాష్ట్ర సీఎం, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ చేస్తున్న పోరాటానికి విపక్షాలు మద్దతు ప్రకటించాయి. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా పోలీస్ కమిషనర్‌ను అరెస్టు చేసేందుకు 40 మంది సభ్యుల సీబీఐ బృందం కోల్‌కతా చేరుకోగా, మమతా బెనర్జీ రంగంలోకి దిగారు. ఏకంగా ఆమె పోలీస్ కమిషనర్ నివాసం ఎదుట బైఠాయించి కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిరసనగళాన్ని విప్పిన విషయం విదితమే. రాష్ట్ర సంస్థలపైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు కోల్‌కతాలో మోడీ సర్కార్ వ్యవహరిస్తున్న తీరును విపక్షాలు ఎండగట్టాయి. ప్రతిపక్ష నేతలు, సీఎంలపై సీబీఐని ప్రయోగిస్తున్న వైఖరిని పలువురు సీఎంలు, ప్రతిపక్ష నేతలు తీవ్రంగా ఖండించారు. మమతా బెనర్జీతోపాటు ధర్నా చేసేందుకు డీఎంకే, ఎస్పీ తదితర పార్టీలు తమ ప్రతినిధులను కోల్‌కతా పంపించాయి. మరోవైపు పార్లమెంట్‌లోనూ కోల్‌కతా ఘటనపై దుమారం రేగింది. అధికార బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నినాదాలు చేశాయి. పశ్చిమ బెంగాల్‌లో రాజ్యాంగం విచ్ఛిన్నమవుతోందని, ఈ నేపథ్యంలో కేంద్రం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరణ ఇచ్చారు

నిరాశతోనే సంస్థలపై దాడి : రాహుల్

కేంద్రంలోని బీజేపీ, ప్రధాని మోడీ పూర్తిగా నిరాశలో ఉన్నారని, అందులో భాగంగానే కేంద్ర సంస్థలపై దాడి చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శిం చారు. కోల్‌కతా ఘటనపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి ఫోన్ చేసిన ఆయన కాంగ్రెస్‌తోపాటు విపక్షాలన్నీ వెన్నంటి ఉంటాయని భరోసా ఇచ్చారు. ఫాసిస్టు ధోరణితో ఉన్న బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంపై మమత చేస్తున్న పోరాటానికి సంఘీభావం ప్రకటించారు.



ప్రజాస్వామ్య రక్షణకే దీదీ పోరాటం : స్టాలిన్

పశ్చిమ బెంగాల్‌లో ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకే సీఎం మమతా బెనర్జీ పోరాటం చేస్తున్నారని డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి ఆమె చేస్తున్న పోరాటానికి ఆయన సంపూర్ణ మద్దతును ప్రకటిం చారు. మమతకు అండగా నిలిచేం దుకు తన సోదరి, ఎంపీ కనిమొళిని కోల్‌కతా పంపించనున్నట్లు తెలి పారు. అనంతరం ఆయన మమతా బెనర్జీకి ఫోన్ చేసి పోరాటాన్ని విజయవంతం చేసేందుకు తన మద్దతు ఉంటుందని చెప్పారు.

రాజకీయ ఆయుధంగా సీబీఐ : నవీన్ పట్నాయక్

స్వతంత్రంగా వ్యవహరించాల్సిన సీబీఐ నేడు రాజకీయ ఆయుధంగా మారిందని ఒడిశా సీఎం, బీజూ జనతాదళ్ (బీజేడీ) నేత నవీన్ పట్నాయక్ వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్‌పై కేంద్రం సీబీఐని ప్రయోగించటం అధికార దుర్వినియోగమన్నారు. ఒడిశాలో పంచాయతీ ఎన్నికల సమయంలో ఇదేరీతిలో సీబీఐ దాడులకు పాల్పడిందని విమర్శించారు. పూర్తిగా రాజకీయ కోణంలోనే సీబీఐని ఉపయోగించుకోవటం శోచనీయమన్నారు. మమతా బెనర్జీకి ఆయన మద్దతు ప్రకటించారు.

కేంద్ర సంస్థలపై విశ్వాసం సన్నగిల్లుతోంది : తేజశ్వీయాదవ్

మోడీ సర్కార్ వ్యవహారశైలి వల్ల కేంద్ర సంస్థలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోందని ఆర్జేడీ నేత తేజశ్వీయాదవ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాలపై పెత్తనం చలాయిం చేందుకు కేంద్రం ఉవ్విళ్లూరటం శోచనీయమన్నారు. కేంద్రంపై మమతా బెనర్జీ చేస్తున్న పోరాటానికి ఆర్‌జేడీ అండగా ఉంటుందన్నారు.

జాతీయస్థాయిలో ఉద్యమం : చంద్రబాబు

కేంద్ర ప్రభుత్వ వైఖరిపై జాతీయస్థాయిలో ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఏపీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. పశ్చిమ బెంగాల్‌పై సీబీఐని ప్రయోగించ టాన్ని ఆయన ఖండించారు. ఈ అంశంపై విపక్షాలతో చర్చించి ఒక కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తామ న్నారు. రాష్ట్రాలపై పెత్తనం కోసం బీజేపీ ఆరాటపడుతోందని విమర్శించారు. సహకార సమాఖ్య వ్యవస్థ అన్న మోడీ నేడు రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు.

సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్న మోడీ : కేజ్రీవాల్

ప్రధాని మోడీ సహకార సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. స్వార్థ రాజకీయాల కోసం సీబీఐ, ఐటీ, ఈడీలను వినియోగించుకుంటు న్నారని మండిపడ్డారు. మోడీ ఆదేశంతో సీబీఐ అధికారులు ఏకంగా తన బెడ్‌రూమ్‌లోకి వచ్చారని తెలిపారు. మోడీ వైఖరిపై పోరాటం చేస్తున్న మమతా బెనర్జీకి ఆయన మద్దతు ప్రకటించారు.

ఎలక్షన్ ఏజెంట్‌గా సీబీఐ : అఖిలేష్ యాదవ్

బీజేపీకి సీబీఐ ఎలక్షన్ ఏజెంట్‌గా మారిందని ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ మండిపడ్డారు. ఏవిధంగానైనా మళ్లీ అధికారంలోకి రావాలనే ఉద్దేశంతోనే ప్రతిపక్షాలపై సీబీఐని ప్రయోగిస్తోందని విమర్శిం చారు. రాజకీయ కక్ష సాధింపు కోసం సీబీఐని వాడుకోవటం తగదన్నారు. మమతా బెనర్జీకి మద్దతు ప్రకటించిన ఆయన, మమతతోపాటు ఆందోళనలో పాల్గొనేందుకు పార్టీ నేత కిరణ్మయి నందాను కోల్‌కతా పంపించారు.

నోటిఫికేషన్ వచ్చేలోగా ఏమైనా జరగొచ్చు : నితీష్ కుమార్

న్యూఢిల్లీ : ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా దేశంలో ఏమైనా జరిగే అవకా శాలు ఉన్నాయని జేడీయూ నేత, బీహార్ సీఎం నితీష్ కుమార్ వ్యాఖ్యానించారు. కోల్‌కతాలో కేంద్రానికి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి మధ్య జరుగుతున్న పోరాటంపై ఆయన పైవిధంగా స్పందించారు. మమతను దించేందుకే కేంద్రం లోని మోడీ సర్కార్ ప్రయత్నిస్తుందన్న వ్యాఖ్యలను ఆయన కొట్టివేశారు.

మమతది అప్రజాస్వామిక వైఖరి : యూపీ మంత్రి

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని యూపీ మంత్రి సిద్ధార్థనాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగ, సమాఖ్య స్ఫూర్తిని ఆమె దెబ్బతీస్తున్నారని విమర్శించారు. బీజేపీ సభలలో పాల్గొనేందుకు కోల్‌కతాకు వెళ్లిన అమిత్ షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను మమతా బెనర్జీ అడ్డుకున్నారన్నారు. పోంజీ కుంభకోణం కేసులో పోలీస్ కమిషనర్‌ను విచారణ చేసేందుకు వెళ్లిన సీబీఐని అడ్డుకోవటం సరైందికాదన్నారు.

తనను తాను రక్షించుకునే ప్రయత్నం : జవదేకర్

సీబీఐ నుంచి తనను తాను రక్షించుకునేందుకే బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేపట్టారని కేంద్ర మంత్రి, బీజేపీ నేత ప్రకాష్ జవదేకర్ అన్నారు. మోడీ అత్యవసర పరిస్థితిని విధించలేదని, అది మమతా బెనర్జీ విధించిన అత్యవసర పరిస్థితి అని పేర్కొన్నారు. బెంగాల్‌లో ప్రతిపక్ష కార్యకర్తలను హత్య చేయటం తోపాటు సభలు నిర్వహించుకునేం దుకు కూడా ఆమె అనుమతిం చటంలేదన్నారు.

అవినీతి రక్షణే బీజేపీ, టీఎంసీ లక్ష్యం : సీతారామ్ ఏచూరి

అవినీతిపరులను రక్షించుకునేందుకే బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ) ప్రధాన లక్ష్యమని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి వ్యాఖ్యానించారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో మమతా బెనర్జీ అవినీతికి పాల్పడుతున్నాయని విమర్శించారు. రెండు ప్రభుత్వాల అవినీతి, అప్రజాస్వామిక, నియంత పాలనకు వ్యతిరేకంగా సీపీఎం పోరాడుతుందని ఏచూరి స్పష్టం చేశారు. పోంజీ కుంభకోణం బయటకు పొక్కి ఏళ్లు గడుస్తున్నా కేంద్రం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. ఆ కుంభకోణంలో ఉన్న కీలక వ్యక్తులు నేడు బీజేపీ చేరారని, అందుకే ఇన్నాళ్లూ పట్టించుకోలేదన్నారు.

రథసప్తమికి అరసవిల్లిలో అన్ని ఏర్పాట్లు



విశాలాంధ్ర బ్యూరో - శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి దేవాలయంలో ఈనెల 12న రథసప్తమి పండక్కి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి ఎంవీ రమణ తెలిపారు. అరసవల్లి దేవాలయ ప్రాంగణంలో సోమవారం ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఈ ఏడాది రథసప్తమికి లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, స్థానికుల సహకారంతో తాగునీరు, పాలు, మజ్జిగ, భోజన వసతి, చెప్పుల స్టాండులు, సామాగ్రి భద్రపర్చే గదులను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మిల్లు జంక్షన్ వరకు గాయత్రి విద్యా సంస్థలు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటుచేయనున్నాయన్నారు. ఆర్టీసీ మరో ఆరు బస్సు సర్వీసులు నడుతున్నారన్నారు. శ్రీకాకుళం డీఎస్పీ వి.భీమారావు మాట్లాడుతూ రథసప్తమి పర్వదినం రోజు పోలీసులు, ఎన్సీసీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.పుష్పనాథం మాట్లాడు తూ వీఐపీలకు ప్రత్యేక గ్యాలరీ, క్షీరాభిషేకానికి రూ.500 చెల్లించే వారి కోసం ప్రత్యేక గ్యాలరీ, లక్ష రూపాయలు ఇచ్చే దాతలకు మరో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. లక్ష రూపాయల విరాళం ఇచ్చే దాతల కు సంబంధించి నలుగురి సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పిస్తామని ఆయన వివరించారు.

కోనసీమలో రైతులపై చిరుత దాడి



విశాలాంధ్ర - ఆత్రేయపురం : తూర్పు గోదావరి జిల్లా కోనసీమలోని ఆత్రేయపురం మండలం అంకంపాలెం గ్రామంలో సోమవారం చిరుతపులి సంచారం కలకలం రేపింది. పొలాల్లో పనులు చేసుకుంటున్న ముగ్గురు రైతులపై దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. అంకంపాలెం పంట పొలాల్లో చిరుత పరుగులు పెట్టడంతో రైతులు హడలిపోయారు. రైతులపై దాడి చేయడంతో వారికి కేకలకు సమీప ప్రాంత రైతులు వచ్చేసరికి చిరుత కొబ్బరి చెట్టు ఎక్కేసింది. గాయపడిన రైతులను వాడపల్లి దేవస్థానం చైర్మన్ కరుటూరి నరసింహారావు ఆస్పత్రికి తరలించారు. పోలీసులను అప్రమత్తం చేయడంతో అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. చీకటి పడటంతో ఏమి జరుగుతుందోనని ప్రజలు, రైతులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

సీట్లు 207.. హాజరు 46

- ఎస్కేయూ పీహెచ్‌డీ కోర్సుల్లో అడ్మిషన్ల తీరిది
- ప్రవేశాలకు ముందుకురాని అభ్యర్థులు
- ఉమ్మడి పరిశోధన పరీక్ష ఫలితమేనా..!



అయోమయ పరిస్థితి ఎదుర్కొంటున్న ఎస్కే యూనివర్సిటీ ఇదే..

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం : శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ కోర్సుల్లో చేరేందుకు అభ్యర్థులు ముందుకురాని విచిత్ర పరిస్థితి. అత్యున్నత కోర్సులకు అభ్యర్థులు దొరక్కపోవడంతో వర్సిటీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రసాయనశాస్త్రంలో నేటికీ ఐదు పీహెచ్‌డీ సీట్లు ఖాళీగా ఉన్నాయి. వర్సిటీలో అతిపెద్దది రసాయన విభాగం. ఏపీఆర్‌సెట్‌లో ఇద్దరు అర్హత సాధించారు. వీరిలో ఒకరు శ్రీకాకుళం కాగా, ఇంకొకరు విజయనగరం జిల్లా వాసి. అక్కడి నుంచి ఎస్కేయూలో పీహెచ్‌డీ చేయడం సాధ్యం కాని పరిస్థితి. ఈ ఇద్దరూ ఓరల్ పరీక్షకు గైర్హాజరయ్యారు. అత్యున్నత డిగ్రీలపై యువతలో ఆసక్తి ఉన్నా కోర్సుల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయి. గతంలో స్వయం ప్రతిపత్తి కలిగిన విశ్వవిద్యాలయాలు సొంతంగా ప్రవేశాలు కల్పించడంతో స్థానిక అభ్య ర్థులకు అవకాశాలు దక్కేది. అత్యు న్నత కోర్సుల ప్రవేశం కోసం తాజాగా ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి పరిశోధన పరీక్ష (ఏపీఆర్‌సెట్) నిర్వహించింది. ఈ పోటీ లో అర్హత సాధించినా వర్సిటీలకు దూర ప్రాంత అభ్యర్థులు ఇక్కడ చేరడం లేదు.

సీటొచ్చినా దూరం కావడంతో వెనుకంజ..

ఎస్కేయూలోని 14 విభాగాల్లో పీహెచ్‌డీ, ఎంఫిల్ ప్రవేశాలకు రాష్ట్ర స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఆయా విభాగాలలో మొత్తం 207 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అర్హత సాధించిన 364 మంది అభ్యర్థులను తాజాగా మౌఖిక పరీక్షలకు ఆహ్వానించారు. అర్హత సాధించిన వారిలో ఎక్కువ మంది శ్రీకాకుళం, గుంటూరు, విజయవాడ, నెల్లూరు వాసులు కావడం గమనార్హం. వారంతా ఇప్పటికీ ఆయా ప్రాంతాల సమీపంలోని విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు ఆసక్తి చూపారు. దీంతో ఎస్కేయూలో 207 సీట్లు ఖాళీలు ఉండగా.. 46 మంది మాత్రమే హాజరయ్యారు. వీరిలోనూ కొందరు ఉద్యోగులు ఉన్నారు.

కొన్ని కోర్సుల్లో ఒక్కరూ లేరు..

ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించినా కొన్ని కోర్సులకు ఒక్కరు కూడా అడ్మిషన్ తీసుకునేందుకు ముందుకురాకపోవడం విచిత్రంగా కనిపిస్తోంది. తెలుగులో 5, ఆర్ట్లో 4 ఖాళీలు ఉన్నప్పటికీ ఒక్కరూ రాలేదు. కామర్స్‌లో 5 ఖాళీలకు ముగ్గురు హాజరయ్యారు. వీరిలో ఒకరు ఉద్యోగి. మిగిలిన ఇద్దరూ ఇతర జిల్లా వాసులు. చరిత్ర విభాగంలో నాలుగు ఖాళీలు ఉండగా హాజరైన ఒక్కరూ ఉపాధ్యాయుడు. రసాయన శాస్త్రంలో ఐదు సీట్లు ఖాళీ ఉండగా ఇద్దరు అర్హత సాధించారు. వీరిలో ఒకరు శ్రీకాకుళం, మరొకరు విజయనగరం కావడంతో ఎవరూ హాజరు కాలేదు. వృక్షశాస్త్రంలో 7 ఖాళీలకు ఇద్దరు, పొలిటికల్ సైన్స్‌లో ఎనిమిది ఖాళీలకు ఇద్దరు, సోషియాలజీలో ఐదు ఖాళీలకు ఇద్దరు అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. ఎంబీఏలో మాత్రం 19 సీట్లకు పూర్తిస్థాయిలో అభ్యర్థులు హాజరయ్యారు. ఎంబీజే విభాగం మినహాయిస్తే ఇతర అన్ని కోర్సుల్లోనూ పట్టుమని పది సీట్లు కూడా భర్తీ అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పీహెచ్‌డీ, ఎంఫిల్ మౌఖికాన్ని ఉపకులపతి రహ్మతుల్లా, రిజిస్ట్రార్ సుధాకర్ పరిశీలించారు.

కిరీటాల చోరీ కేసులో అనుమానితుడి ఛాయాచిత్రం



విశాలాంధ్ర - తిరుపతి క్రైమ్ : శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తుల బంగారు కిరీటాల చోరీ కేసులో అనుమానితుడి ఛాయాచిత్రాన్ని సోమవారం తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఇక్కడ విడుదల చేశారు. టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం దర్యాప్తు బృందాలను సమన్వయం చేసుకుంటూ ఆరు ప్రత్యేక బృందాలు దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. సీసీ కెమేరాల ఆధారంగా చోరీకి పాల్పడిన అనుమానస్పద వ్యక్తిని గుర్తించారు. ఈ ఫొటోలోని వ్యక్తి ఆచూకీ తెలిసిన వెంటనే తిరుపతి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రకటించారు. టీటీడీ, పోలీసుల తరఫున బహుమతులు అందిస్తామన్నారు. ప్రజలు సహకరించాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ విజ్ఞప్తి చేశారు.

పొదుపు సొమ్ము రూ.కోటి మాయం

- దారిమళ్ళిన డ్వాక్రా మహిళల డబ్బు
- ఆవులమంద ఏపీజీబీలో మోసం
- బ్యాంకు ప్రాంగణంలో మహిళల ఆక్రందనలు

విశాలాంధ్ర-కురిచేడు : బ్యాంకు రుణాలు తీసుకున్న డ్రాక్రా మహిళలు క్రమపద్ధతిలో బ్యాంక్ బిజినెస్ కరస్పాడెంట్లకు కట్టిన సుమారు కోటి రూపాయలు దారిమళ్ళిన ఘటన సోమవారం ప్రకాశం జిల్లా ఆవులమంద ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (పినాకిని బ్యాంక్)లో వెలుగుచూసింది. బ్యాంకు నియమించిన బిజినెస్ కరస్పాండెంట్‌కు చెల్లించిన కురిచేడు మండలం నాయుడుపాలెం గ్రామ డ్వాక్రా మహిళలు ఆ సొమ్ము బ్యాంకులో జమకాలేదని తెలుసుకుని లబోదిబోమన్నారు. సమాచారం అందుకున్న మహిళల పెద్దఎత్తున తరలిరావడంతో ఆవులమంది పినాకిని బ్యాంకు ప్రాంగణం రణరంగంగా మారింది. నాయుడుపాలెం గ్రామానికి చెందిన 48 డ్వాక్రా గ్రూపుల మహిళాలు రెండేళ్ల క్రితం ఆవులమంద ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (పినాకిని బ్యాంక్) నుంచి రుణాలు తీసుకున్నారు. రుణాల రికవరీ కోసం బ్యాంకు అధికారులు ఇదే గ్రామానికి చెందిన పల్లె రవీంద్రబాబును బిజినెస్ కరస్పాండెంట్‌గా నియమించారు. ప్రతి నెలా వాయిదా మొత్తాలను రవీంద్రబాబు కు మహిళలు చెల్లిస్తున్నారు. పొదుపు మొత్తాలను తెలుసుకునేందుకు బ్యాంక్‌కు వెళ్ళిన మహిళలకు మేనేజర్ ఎం శేషారావు 'మీ గ్రామ బీసీగా రవీంద్రబాబును నియమించాం.. అన్ని లావాదేవీలు అతనే చూస్తారంటూ సమాధాన మిచ్చేవారు. దీంతో నెలవారీ రవీంద్రబాబుకే కిస్తీలు చెల్లిస్తూ వచ్చారు. ఈ క్రమంలో గత నెల 31వ తేదీన రవీంద్రబాబు ఆకస్మికంగా మరణించడంతో వివరాల కోసం మహిళలు బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించారు. మేనేజర్ మాటలు విన్న మహిళాలు లబోదిబోమన్నారు. ఒక్కో గ్రూపు 18 నెలల నుంచి బీసీకి వాయి దాలు జమచేస్తూ వస్తున్నాయి. తీరా బ్యాంక్‌లో మూడు నెలల సొమ్ము జమ అయినట్టు ఉన్నాయి. మోసపోయినట్టు భావించిన 48 డ్వాక్రా గ్రూపుల మహిళలు సోమవారం ఒక్కసారిగా ఆవుల మంద బ్యాంకు తరలిరావడంతో గందరగోళం నెలకొంది. మేనేజర్ శేషరావు అందుబాటులో లేకపో వటంతో మహిళల్లో అనుమానులు వ్యక్తమయ్యాయి. కురిచేడులో సోమవారం పసుపు కుంకుమ, పెన్షన్ల పంపిణీకి వచ్చిన రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు ను కలిసిన వెన్నెల గ్రూపు,మేరిమాత గ్రూపు సభ్యులు బ్యాంకులో మోసాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. బ్యాంక్ ఆర్ఎంతోపాటు జిల్లా కలెక్టర్ వినయ్ చంద్‌కు వివరించి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

బ్యాంకు సిబ్బంది పాత్రపై అనుమానాలు

బ్యాంకులకు నెలవారీ కట్టాల్సిన కిస్తీలు మూడు నెలలకు మించి బకాయి చూపిస్తే వెంటనే బ్యాంక్ సిబ్బంది గ్రూపు మహిళాల ఇంటికొచ్చి కట్టించుకునే విధానం ఉంది. ఒక గ్రామంలోని 48 గ్రూపులు నెలలతరబడి కిస్తీల సొమ్ము సుమారు కోటి రూపాయలు చెల్లించకపోతే బ్యాంక్ సిబ్బంది నుంచి కనీస వత్తిళ్లు లేకపోవడం మహిళల్లో చర్చనీయాంశమైంది. బ్యాంక్ సిబ్బంది కనుసన్నల్లోనే పొదుపు సొమ్ము దారిమళ్ళి ఉంటుందని కొందరు మహిళలు వ్యాఖ్యానిస్తున్నారు.



బ్యాంక్ ముందు సోమవారం అయోమయంలో డ్వాక్రా మహిళలు

యువతిపై గ్యాంగ్‌రేప్



- నలుగురు యువకుల వికృత చర్య
- నిందితులపై 'నిర్భయ' కేసు
- సూళ్ళూరుపేటలో దారుణం

విశాలాంధ్ర - సూళ్ళూరుపేట : ఉపాధి కోసం ఊరుగాని ఊరొచ్చి ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న యువతిపై నలుగురు యువకులు సామూహిక అత్యాచారానికి తెగబడిన ఘటన సోమవారం తెల్లవారు జామున శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట లో చోటుచేసుకుంది. తీవ్రగాయాలతో బాధిత యువతి పోలీసులకు ఫిర్యా దు చేయడంతో నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. గూడూరు డీఎస్పీ బాబుప్రసాద్ కథనం ప్రకారం.. శ్రీ సిటీ సెజ్‌లోని ఓ మొబైల్ కంపెనీలో ఉద్యోగం కోసం విజయనగరం జిల్లాకు చెందిన ఓ యువతి, అదే పరిశ్రమలో పనిచేస్తున్న ఉత్తర కోస్తా ప్రాతానికి చెందిన స్నేహితుడితో కలసి ఆదివారం రాత్రి సూళ్ళూరు పేట రైల్వేస్టేషన్ వచ్చారు. ఒకటో నంబరు ప్లాట్ ఫారం సమీపంలోని గూడ్స్ షెడ్ వద్ద వీరిద్దరూ మాట్లాడుకుంటున్న సమయంలో ఆ ప్రాంత ఆకతాయిలు నలుగురు వీరిని వెంబడించారు. భౌతికదాడికి పూనుకున్నారు. యువతి పై లైంగికదాడికి పాల్పడ్డారు. అదే సమయంలో పోలీసు గస్తీ వాహనం సైరన్ ఆ ప్రాంతాన్ని సమీపించడంతో నలుగురు యువకులు యువతిని సుమారు కిలో మీటరు దూరం వరకు తీసుకెళ్ళారు. మరోసారి ఆమెపై ఒకరి తరువాత మరొకరు పలుమార్లు లైంగికదాడికి పాల్పడినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు డీఎస్పీ తెలిపారు. తీవ్రంగా గాయపడిన యువతి అతికష్టం మీద పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో రంగంలోకి దిగిన ఎసై విశ్వనాథ్‌రెడ్డి సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. హుటాహుటిన బాధితురాలిని వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. నిందితుల కోసం నాలుగు పోలీసు బృందాలు గాలింపు చేపట్టాయి. నిందితులపై నిర్భయ సెక్షన్ కింద కేసు నమోదు చేశామని, త్వరలోనే పట్టుకుంటామని సీఐ కిశోర్‌బాబు, ఎసై విశ్వనాథ్‌రెడ్డి వెల్లడించారు.

పోడు భుములకు పట్టాలివ్వాలి

సీతంపేట ఐటీడీఏ ఎదుట ధర్నాలో సీపీఐ నేతల డిమాండ్



విశాలాంధ్ర - సీతంపేట : శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండల పరిధిలో తరతరాలుగా అడవితల్లిని నమ్ముకుని కొండ గుట్టలపై తుప్పలు, పట్టులను బాగుచేసుకుంటూ బతుకుతున్న గిరిజనుల కొండపోడు భూములకు పూర్తి స్థాయిలో పట్టాలు ఇవ్వాలని సీపీఐ శ్రీకాకుళం జిల్లా నాయకులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. పోడు భూములను పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం సీతంపేటకు పెద్దఎత్తున తరలివచ్చిన గిరిజనులు సీపీఐ కార్యాలయం నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు సీపీఐ జిల్లా కార్యదర్శి సనపల నర్సింహులు నాయకత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ ప్రాంగణం ఎదుట ధర్నా చేపట్టారు. ఎర్రజెండాల రెపరెపల నడుమ గిరిజనులు దిక్కులుపిక్కటిల్లేలా చేసిన నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. ఐటీడీఏ పీవో లోతేటి శివశంకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ ఎంతోమంది కమ్యూనిస్టుల త్యాగపూరిత వీరోచిత పోరాటాల ఫలితం 2005 సంవత్సరంలో అటవీ హక్కుల చట్టం అమలులోకి వచ్చినా పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో గిరిజనులు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజనులు కొండపోడు సాగు చేసుకుంటున్న భూముల విస్తీర్ణానికి తగ్గట్టు ప్రభుత్వం అటవీ హక్కుపత్రాలు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. అర్హులందరికీ పట్టాలు అందేవరకు సీపీఐ పోరాడుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు చాపరసుందర్‌లాల్ మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం వచ్చి 13 సంవత్సరాలు పైబడినప్పటికీ గిరిజనుల పోడు భూములకు సంబంధించి సాగు హక్కు నమోదు కాకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ స్పందించి అర్హులకు సాగుపత్రాలు అందించాలని కోరారు. గిరిజనులు సాగు భూముల హద్దులు తెలుపుతూ వ్యక్తిగత వినతిపత్రాలను ఐటీడీఏ పీవో శివశంకర్‌కు అందించారు. గిరిజన ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా సద్వినియోగం చేయాలని, గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ నేతలు పీవోను కోరారు. పంట పొలాలకు సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ నేతలు, గిరిజనుల విన్నపంపై పీవో స్పందిస్తూ పోడు భూములను సర్వే చేసి పూర్తి స్థాయిలో హక్కుపత్రాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కూరంగి మన్మధరావు, నియోజకవర్గ కమిటీ సభ్యుడు బుడితి అప్పలనాయుడు, సీనియర్ నాయకులు కూరంగి ముఖలింగం, నాయకులు గేదెల చిరంజీవి, కూరంగి జగదీష్, అప్పన్న పాల్గొన్నారు. ముందస్తుగా ఎస్.ఐ కె.రాము పర్య వేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కృష్ణపట్నం పోర్టు పీఆర్వో వేణుగోపాల్‌పై దాడి

విశాలాంధ్ర- నెల్లూరుబ్యూరో : నెల్లూరుజిల్లాలోని కృష్ణపట్నం పోర్టు పీఆర్వో వేణుగోపాల్‌పై సోమవారం రాత్రి మత్స్యకారుడు వెంకటేశ్వర్లు కత్తితో దాడి చేశాడు. వివరాలిలా ఉన్నాయి. పీఆర్వో వేణుగోపాల్ కృష్ణపట్నం పోర్టులోని తన చాంబర్లో ఉండగా కృష్ణపట్నం గ్రామానికి చెందిన మత్స్యకారుడు వెంకటేశ్వర్లు పోర్టు కార్యాలయానికి వచ్చాడు. కార్యాలయం బయట ఉన్న పీఆర్వో కారుపై పెట్రోల్ పోసి అనంతరం నేరుగా ఆయన ఛాంబర్‌లోకి దూసుకొచ్చి కత్తితో దాడి చేశాడు. దీంతో వేణుగోపాల్ ఉదర భాగంలో తీవ్ర గాయం అయింది. అతన్ని హుటాహుటిన నెల్లూరులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. మొదటినుంచి మత్స్యకారులకు, పోర్ట్ యాజమాన్యానికి మనస్పర్ధలు ఉన్నాయి. దాడికి కారణాలు తెలియాల్సి ఉంది. పీఆర్వో ప్రాణానికి ప్రమాదం లేదని తెలుస్తోంది.

సీబీఐ చీఫ్‌గా శుక్లా బాధ్యతల స్వీకారం



న్యూఢిల్లీ : సీబీఐ డైరెక్టర్‌గా నియమితులైన కుమార్ శుక్లా సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. కోల్‌కతాలో పోలీసులకు సీబీఐకు , కేంద్ర-రాష్ట్రప్రభుత్వాలకు మధ్య హోరా హోరీగా రాజకీయ యుద్ధం జరుగు తుండగా పదవీ బాధ్యతలు చేపట్టడం గమనార్హం. వాస్తవానికి కొత్తగా పదవి ని చేపట్టడానికి వారం రోజుల సమయం ఉంటుంది. సీబీఐ చీఫ్‌గా శనివారం ఆయన పేరును ప్రకటించగా రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టడానికి కారణం కోల్‌కతా పోలీసులకు సీబీఐకు మధ్య సాగుతున్న రగడే కారణం కావచ్చని భావిస్తున్నారు. 58 ఏళ్ల శుక్లా మధ్యప్రదేశ్‌కు చెందిన 1983వ సంవత్సరం ఐపీఎస్ అధికారి. కేంద్రం ఆయనను పూర్తి స్థాయి సీబీఐ చీఫ్‌గా నియమించింది.

ప్రత్యేకహోదా సాధనకు జేఏసీ కొత్త కార్యాచరణ

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: ఏపీ ప్రత్యేకహోదా విభజన హామీల సాధనకై జేఏసీ నూతన కార్యచరణ ప్రకటించింది. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన వెలువరించింది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతోన్న నేపథ్యంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రత్యేకహోదా సాధించిదానికి కార్యాచరణ విడుదల చేసినట్లు ఏపీ ప్రత్యేకహోదా విభజన హామీల సాధన సమితి జేఏసీ ప్రతినిధులు చలసాని శ్రీనివాస్, ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, బొప్పరాజు వెంకటేశ్వర్లు, యు.మురలీకృష్ణ, చందూ జనార్ధన్‌లు ప్రకటించారు. ఈనెల 6వతేదీన రాష్ట్రంలో అన్ని జిల్లాకేంద్రాలు, తాలూకా కేంద్రాల్లో మోటార్ సైకిల్ ర్యాలీలు చేస్తామని వెల్లడించారు. ఈనెల 8వతేదీన అన్ని జిల్లాల్లో ముఖ్య రహదారులపై వాహనాల క్లీనింగ్ గాంధీగిరితో చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 10వతేదీన ప్రధానమంత్రి నరేంద్రమోడీ గుంటూరు పర్యటన నేపథ్యంలో కుండలు, మట్టి, నీరుతో నిరసన ప్రదర్శనలు చేస్తామని వెల్లడించారు. ఏపీ ప్రత్యేకహోదా సాధన కోసం జరిగే ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పసుపు కుంకుమను అడ్డుకుంటే సహించం : బుద్ధా

విశాలాంధ్ర అమరావతి : పసుపు కుంకుమ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తే చెప్పులతో తరిమి కొట్టాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కోరారు. ఉండవల్లిలోని సీఎం నివాసం వద్ద మీడియా పాయింట్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ముసుగులో కేసుల మాఫీ కోసమే జగన్ ఢిల్లీ పర్యటన చేస్తున్నారని విమర్శించారు. ఓట్లు తొలగింపు అనేది ఎన్నికల సంఘం పరిధిలోని అంశమని, మోడీ మళ్ళీ ప్రధాని కాలేరని తెలిసి చివరి రోజుల్లో అయినా కేసులు మాఫీ చేయండని మోడీ దగ్గర జగన్ మోకరిల్లుతున్నారని విమర్శించారు.

ఎన్నికల సమయంలో రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించాలని జగన్ చూస్తున్నారని విమర్శించారు. రోజాకు చెల్లని చెక్కులు ఇవ్వటం అలవాటేనని, అందువల్లే పసుపు కుంకుమ చెక్కులు చెల్లనివిగా కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌తో ఉన్న సంబంధాలను జగన్ ఇప్పటికైనా బహిర్గతం చేయాలని డిమాండు చేశారు. ప్రజలకు సంక్షేమ పాలన అందించటమే లక్ష్యంగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని అన్నారు. భవిష్యత్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి తీరుతుందని దీమా వ్యక్తం చేశారు.

ట్రాక్టర్ డ్రైవర్ల సంక్షేమానికి కృషి

- సాధికార సమితి ఏర్పాటు చేస్తా
- రైతుకు పాదాభివందనం చేసిన సీఎం



విశాలాంధ్ర అమరావతి : ట్రాక్టర్ డ్రైవర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ట్రాక్టర్లపై జీవితకాల పన్ను రద్దు చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ సోమవారం రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లు ఉండవల్లిలో సన్మానం చేసిన సందర్భంగా ఆయన పై విధంగా స్పందించారు. తాను ఓ డ్రైవర్‌గా రాష్ట్రాన్ని నడుపుతున్నానన్నారు. ప్రజాసంక్షేమమే తనకు ముఖ్యమని, ఆటో ట్రాక్టర్ డ్రైవర్ల ఆదాయం చాలా తక్కువగ ఉండటంతో వాటిపై జీవిత కాల పన్ను రద్దు చేశామన్నారు. డ్రైవర్ల జీవితంలో ఎన్నో రిస్కులు, ప్రమాదాలు ఉంటాయని, ప్రమాదాల బారిన పడిన వారిని చంద్రన్న బీమా ద్వారా ఆదుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో అన్ని ఎలక్ట్రికల్ వాహనాలు ఉంటాయని , ఇప్పటికే రాష్ట్రంలో పశువుల పేడ, చెత్త తీసుకు వెళ్లేందుకు ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగిస్తున్నామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 3 లక్షల 70 వేల ఆటోలు, 6లక్షల 30 వేల ట్రాక్టర్లకు జీవితకాల పన్ను రద్దు చేయటం ద్వారా రూ. 108 కోట్ల మేర ఆదాయం ప్రభుత్వం నష్టపోతోందన్నారు. అయినప్పటికీ ట్రాక్టర్లు, ఆటోల డ్రైవర్లకు అండగా ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మహిళా సాధికార సంస్థ, రైతు సాధికార సంస్థల ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ట్రాక్టర్లకు ఇన్సూరెన్స్ చెల్లించే అంశం కూడా పరిశీలిస్తున్నామన్నారు. రూ.200 పింఛన్‌ను పది రెట్లు పెంచిన ఏకైక ప్రభుత్వం తెలుగుదేశంమని, కోడి కత్తి , మోడీ కత్తి రాజకీయాలతోపాటు కేసీఆర్ కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతులను ఆదుకుంటామని చెప్తూ ప్రధాని మోడీ ఇచ్చే రూ. 6వేలు అతి తక్కువ మొత్తమని విమర్శించారు. రూ. 24 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని కొనియాడారు. రాజ్యాంగ వ్యవస్థలని భ్రష్టు పట్టిస్తున్నారని మోడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐని అడ్డుపెట్టుకుని రాజకీయనాయకులను అంతమొందించాలని చూస్తున్నారన్నారు. విభజన హామీలపై ప్రశ్నిస్తే ఎంపీలపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు అండగా ఉండాలని పసుపు కుంకుమ కార్యక్రమం చేపట్టామని, టీడీపీ అధికారంలోకి వస్తేనే భవిష్యత్తు అని అన్నారు. పేదల పక్షమే తెలుగుదేశంలక్ష్యమని, ఆ దిశగానే సంక్షేమ కార్యక్రమాలు మరిన్ని చేపడతామని, ప్రజలంతా అండగా ఉండాలని కోరారు.

రైతుకు సీఎం పాదాభివందనం

కాగా రాజధాని నిర్మాణం నిమిత్తం రూ.10,116 విరాళంగా ఇచ్చిన రైతు అబ్బినేని నారాయణరావు కు ముఖ్యమంత్రి అభినందించి, ఆశీర్వదించాలని కోరుతూ పాదాభివందనం చేశారు. రాజధాని నిర్మాణానికి 10,116 రూపాయలు విరాళంగా ఇచ్చిన పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులోని తంగేళ్లమూడి గ్రామవాసి నాయణరావు ఆర్థర్ కాటన్, ఎన్టీ రామారావు, బసవతారకంల ఆత్మకు శాంతి కలగాలని ప్రయాగలో వారికి పిండ ప్రదానం చేశారన్నారు. సంప్రదాయానికి, తెలుగు సంస్కృతికి ఆయన ప్రతీకగా నిలుస్తున్నారని శ్లాఘించారు.



రేపు ఆటో కార్మికుల చలో విజయవాడ

జయప్రదానికి రవీంద్రనాథ్ పిలుపు

విశాలాంధ్ర-విశాఖ సిటీ బ్యూరో : ఆటోడ్రైవర్లు, చిరువ్యాపారులు, ముఠా కళాసీలు రాష్ట్రంలో లక్షలాది మంది జీవనభృతికై అనేక ఆటుపోట్లకు గురవుతున్నారని, వీరందరి కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని డిమాండు చేస్తూ ఈ నెల 6న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. విశాఖ అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో ఆటోడ్రైవర్ల సమస్యలపై సోమవారం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కే .రహమాన్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సులో రవీంద్రనాథ్ మాట్లాడుతూ . పీఎఫ్, ఈఎస్‌ఐతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలని డిమాండు చేశారు. భారీగా పెరిగిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ను రద్దు చేయాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఓట్లకోసం ఎన్నికలకు ముందు తాయిలాలు ప్రకటించి ప్రజలపై పన్నుల భారాలు పెంచుతున్నారన్నారు. ఆటో కార్మికులు రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు 6న ఛలో విజయవాడకు కార్మికులు పెద్దఎత్తున తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఎంవీఐ ఇన్‌స్పెక్టర్ ఏఎస్. గణేష్ రెడ్డి, యూనియన్ కార్యదర్శి కాగిత సింహాద్రి, నాయకులు అప్పలరాజు, రమణ, భాస్కరరావు, మన్మధరావు, కాసుబాబు, తెడ్డు వెంకటేశ్వరరావు, మోహన్, అప్పలరెడ్డి, బుజ్జి పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీస్ రూల్స్‌పై సుప్రీం కోర్టు స్టే

విశాలాంధ్ర - ఏలూరు: ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ విషయంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించిందని పిఆర్‌టియు జిల్లా శాఖ అధ్యక్షులు పి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, పిఆర్‌టియు నాయకులు పలుమార్లు ఢిల్లీ వెళ్ళి ఉమ్మడి సర్వీసు రూల్స్ కి సంబంధించి రాష్ట్రపతి నుంచి ప్రెసిడెన్షియల్ ఉత్తర్వులు తెచ్చారన్నారు. ప్రభుత్వ టీచర్లు ఏపీ హైకోర్టులో ఈ వ్యవహారంపై అప్పీలుకి వెళ్లారన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వులలో కొన్ని సాంకేతిక అంశాలను లేవనెత్తి రూల్స్ చెల్లవంటూ హైకోర్టు తీర్పునిచ్చిందన్నారు. దీనిపై తిరిగి పిఆర్‌టియు ఏపీ, టిఎస్ నాయకులు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్ వేసారన్నారు. హైకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్‌పై సోమవారం సుప్రీంకోర్టు స్టే విధించిందని వెంకటేశ్వరరావు తెలిపారు. ఇది పంచాయతీరాజ్ టీచర్లకు శుభపరిణామమని అన్నారు. వెంటనే డైట్, జూనియర్ కళాశాలల్లో లెక్చరర్లు, ఎంఇఓ, డివైఇఓ, హెచ్‌ఎం పదోన్నతులను అర్హులైన వారికి కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గాజువాక నడిబొడ్డులో భూమాయ!

- నిబంధనలకు విరుద్ధంగా క్రమబద్ధీకరణ
- వెయ్యి చ.గ.ల ప్రభుత్వ స్థలం. దువ్వాడలో మరో 42 సెంట్లు అన్యాక్రాంతం
- తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా
- ఆ జాగాను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏజే స్టాలిన్ డిమాండు




గాజువాక తహశీల్దారు కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏజే స్టాలిన్

విశాలాంధ్ర-గాజువాక : విశాఖ జిల్లా గాజువాక రెవెన్యూ పరిధి కొత్తగాజువాక కూడలి సర్వే నెంబరు 87లో నిబంధనలకు విరుద్ధంగా క్రమ బద్ధీకరించిన వెయ్యి చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండు చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యాన గాజువాక తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ధర్నా చేస్తున్న వారినుద్దేశించి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏజే స్టాలిన్ మాట్లాడుతూ, దువ్వాడ సర్వే నెంబరు 8/6లోని 1.35 ఎకరాల ప్రభుత్వ భూమిలో సర్వే నెంబరు 8/6బిగా మార్చి మరో 42 సెంట్లు భూమికి అక్రమంగా మంజూరు చేసిన పట్టానూ రద్దు చేయాలని డిమాండు చేశారు. ఈ అవకతవకలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సర్వే నెంబరు 87లో వెయ్యి చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం, అతని కుటుంబ సభ్యులు కబ్జాకు పాల్పడినట్టు 1996 ఏపీ శాసన సభా కమిటీ నిర్ధారించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని విశాఖ జిల్లా కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ ఆదేశాలనను సరించి నాటి గాజువాక ఎమ్మార్వో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ దీన్ని ఆక్రమించిన వారు శిక్షార్హులుగా ప్రకటించారన్నారు. ఈ వెయ్యి చదరపు గజాల స్థలం తిరిగి పల్లా సింహాచలం, ఆయన కుటుంబ సభ్యులే ఆక్రమించి, దుకాణాలు నిర్మించుకుని అద్దెలు వసూలు చేస్తూ అనుభవిస్తూ ఉండడాన్ని తప్పుబట్టారు. నిబంధనలకు విరుద్ధంగా క్రమబద్ధీకరించిన కొత్త గాజువాకలోని సర్వే నెంబరు 87లో ఉన్న ఆ జాగా విలువ సుమారు రూ.20 కోట్లు ఉంటుందన్నారు. అనంతరం గాజువాక తహసీల్దారు చంద్రశేఖరరావుకు సీపీఐ ప్రతినిధి వర్గం వినతిపత్రం సమర్పించింది. ఈ ధర్నాలో పార్టీ నగర కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, కార్యవర్గ సభ్యులు కె.సత్యాంజనేయ, డాక్టర్ బూసి వెంకట రావు, టి.సాంబమూర్తి, పల్లేటి పోలయ్య, నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, అప్పారి విష్ణుమూర్తి, ఎమ్మెస్ అప్పారావు, కర్రి వెంకటేశ్వరరావు, మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు బూసి పరమేశ్వరి, పి.దుర్గారావు, ఎం.రామారావు, ఎరిపిల్లి కన్నయ్య, ఎరిపిల్లి నందన్న, వి.బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల పదోన్నతులు వేగవంతం చేయాలి

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీచర్ల పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో అప్‌గ్రేడ్ అయిన 12,824 కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి మినిమమ్ టైమ్ స్కేలు వర్తింపజేయాలని స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాస్‌ను కలిసి వివరించామని తెలిపారు. ఒప్పంద అధ్యాపకులకు, ఉద్యోగులకు జీవో నంబరు-12 ద్వారా వర్తింపచేసిన మినిమమ్ టైమ్ స్కేలును కేజీబీవీలకూ వర్తింపజేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని ఉద్యోగులకు హామీ ఇచ్చారు.



దుష్ప్రచారంపై డీజీపీకి ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏఐసీసీ ప్రధానకార్యదర్శి ప్రియాంకగాంధీపై సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న నిందితుల్ని అరెస్టు చేయాలని ఏపీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి డిమాండు చేశారు. ఈమేరకు సోమవారం మహిళా కాంగ్రెస్ నేతలతో కలిసి మంగళగిరిలోని డీజీపీ ఆర్పీ ఠాకూర్‌కు ఆమె ఫిర్యాదు చేశారు. సోషల్‌మీడియాలో ప్రియాంకపై అసభ్యకరంగా ప్రచారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రియాంక రావడాన్ని సహించలేని కొన్నిశక్తులు ఈ తరహాగా వ్యాఖ్యలు, ఫోటోలు పెడుతున్నారన్నారు. అనంతరం డీజీపీ మంగళగిరి ఆఫీస్ ఇన్‌చార్జ్ రాజకుమారిని కలసిన మహిళా కాంగ్రెస్ నేతలు అసత్యప్రచారాన్ని వివరించి, సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి నిమ్మల జ్యోతిక, పలువురు మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



పసుపు-కుంకుమ పంపిణీలో ఉద్రిక్తత

గాలిలో కాల్పులు, లాఠీఛార్జ్ - కానిస్టేబుల్‌సహా 9 మందికి గాయాలు

అనంతపురము ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురము : అనంతపురము జిల్లా రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో సోమవారం జరిగిన పసుపు - కుంకుమ పంపిణీ ఉద్రికత్తకు దారితీసింది. టీడీపీ, వైసీపీ శ్రేణులు ఘర్షణకు దిగటంతో పోలీసులు గాలిలో కాల్పులు జరిపారు. అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవటంతో లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో పోలీసు కానిస్టేబుల్‌సహా తొమ్మిది మంది గాయపడ్డారు. వైద్య పరీక్షల నిమిత్తం క్షతగాత్రులను అనంతపురము ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జిల్లాలో ఒకే రోజున మూడు గ్రామాల్లో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణలు తలెత్తాయి. ఆదివారం తోపుదర్తిలో మంత్రి పరిటాల సునీత కారుపై కొందరు చెప్పులు విసిరి నిరసన వ్యక్తం చేయటంతోపాటు రుణమాఫీ హామీని నెరవేర్చనందుకు మంత్రిని గ్రామంలోకి రాకుండా వైసీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి సునీత. ఆమె సోదరుడు మురళీ, ఇతర అనుచరలు అనంతపురము మండలం ప్రసన్నాయపల్లికి వెళ్లారు. అధికార పార్టీ నేతలు తమ పేర్లను జాబితా నుంచి తొలగించారంటూ కొందరు మహిళలు పసుపు - కుంకుమ కార్యక్రమంలో ఆందోళన వ్యక్తం చేశారు. వీరికి వైసీపీ నాయకులు మద్దతు పలకటంతో ఆ సభా ఉద్రిక్తంగా మారింది. ఇందుకు కారణమైన వైసీపీ నేత ప్రణవానందారెడ్డిని పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా, తోపులాట జరిగింది. అనంతరం గొందిరెడ్డిపల్లి కార్యక్రమంలోనూ అదే పరిస్థితి ఎదురైంది. మహిళలకు పసుపు - కుంకుమ చెక్కులు పంపిణీ చేసినందుకు సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని, ప్రమాణం చేయాలని టీడీపీ నేతలు చెప్పారు. అందుకు పలువురు డ్వాక్రా సభ్యులు విబేధించి వారితో వాదనకు దిగారు. ఆ క్రమంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య వాగ్వివాదం కాస్తా కొట్టుకునేందుకు దారితీసింది. దీంతో పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు గాలిలో కాల్పులు జరిపారు. అయినా పరిస్థితి అదుపులోకి రాక పోవటంతో లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో ఒక కానిస్టేబుల్‌తోపాటు ఎనిమిది మంది వైసీపీ కార్యకర్తలు గాయపడ్డారు. వారిని వైద్యం కోసం అనంతపురము తరలించారు.

అవకాశవాదానికి మారుపేరు బాబు

- బాబుకు శాశ్వతంగా తలుపులు మూసేశాం
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా



విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం : తన స్వలాభాపేక్ష కోసం నిరంతరం పొత్తులు మార్చే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అవకాశవాదానికి మారుపేరని బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షా విమర్శించారు. ఉత్తరాంధ్ర జిల్లాల శక్తికేంద్ర ప్రముఖులతో విజయనగరం జిల్లాలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా అమిత్‌షా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత ఎన్‌టిఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని, పదవిని కాజేసిన చంద్రబాబు, ఎన్‌డిఏ ప్రభుత్వానికి కూడా వెన్నుపోటు పొడి చారని అన్నారు. ఏ ఎండకు ఆ గొడుగుపట్టే బాబుకు ఎన్‌డిఏ తలుపులను శాశ్వతంగా మూసేస్తున్నామని ప్రకటించారు. చంద్రబాబు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, కేంద్రం ఏమీ చేయలేదని చెబుతూ కాంగ్రెస్ పార్టీతో అంటకాగేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. దేశాన్ని 55ఏళ్లపాటు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన నిధులకంటే, తమ ప్రభుత్వమే రాష్ట్రానికి చాలా ఇచ్చిందని, ఈ నాలుగున్నరేళ్ల కాలంలో 5లక్షల, 56వేల కోట్ల రూపాయలు వివిధ రూపాల్లో రాష్ట్రానికి ఇచ్చామని అమిత్‌షా తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు అప్పుగా ఇస్తూ, కానుకగా చెప్పుకోవడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. సుమారు రూ.14వేల కోట్ల రూపాయల డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు రామ్‌లాల్, మురళీదేవరా, సునీల్ దేవధర్, కంభంపాటి హరిబాబు, జిల్లా నాయకులు బి.శివప్రసాద్‌రెడ్డి, పెద్దింటి జగన్మోహనరావు, పాకలపాటి మురళి తదితరులు పాల్గొన్నారు.

అలాగే బీజేపీ బస్సుయాత్రను ప్రారంభించేందుకు శ్రీకాకుళం జిల్లా పలాస వచ్చిన అమిత్‌షా కాశీబుగ్గలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. చంద్రబాబు చేస్తున్న అబద్దపు ప్రచారాలను, తిప్పికొట్టి, ఏపీ అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం ఏమిచేసిందో చెప్పటానికి వచ్చామన్నారు. ఈ పరిస్థితిలో వైకాపా రాష్ట్రానికి న్యాయం చేయ లేదని, బీజేపీ మాత్రమే ఆంధ్రప్రదేశ్‌ను అభి వృద్ధి పథం వైపు నడిపించగలదని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మాణి క్యలరావు, మాజీ ఎంపి డాక్టర్ కణితి విశ్వ నాథం, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, మాధవ్, చల్లా వెంకటేశ్వరావు, దుప్పల రవీంద్ర, సినీనటుడు బాబుమోహన్, ఎంబిజి నాయుడు, పైడి వేణుగోపాల్, రొక్కం సూర్యప్రకాష్, కోటగిరి నారాయణరావు, పూడి తిరుపతిరావు, పాలవలస వైకుంఠరావు పాల్గొన్నారు..

వీడిన మిస్టరీ (మొదటి పేజీ తరువాయి)

బృందాలు ఎట్టకేలకు సోమవారం కేసును ఛేదించారు. మొదటి నుంచి అనుమానిస్తున్నట్లుగానే రాకేష్‌రెడ్డి కీలక నిందితుడుగా పోలీసులు నిర్ధారించారు. రాకేష్ మరో ముగ్గురితో కలిసి హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఈ హత్యతో జయరామ్ మేనకోడలు శిఖా చౌదరికి సంబంధం లేదనే నిర్ణయానికి పోలీసులు వచ్చారు. ఈ నేపథ్యంలో నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది. అదే సమయంలో మీడియా ముందు వారిని ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది. జయరామ్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో ఆయన గుండెలపై బలంగా కొట్టడం వల్లే మృతి చెందినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. తొలుత విష ప్రయోగం చేసినట్లు అనుమానించినా, విచారణలో నిందితులు గుండెలపై మోది హత్య చేసినట్లు అంగీకరించ టంతో కేసు మిస్టరీ పూర్తిగా వీడిపోయింది. హత్య అనంతరం మృతదేహాన్ని కారులో ఉంచి, తానే డ్రైవింగ్ చేసుకుంటూ నందిగామ వచ్చాడు. అనంతరం అక్కడి మద్యం షాపులో రెండు బీర్లు కొనుగోలు చేశాడు. అందుకు సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజ్‌లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత నెల 31వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో హత్య జరిగినట్లు తేలింది.

మహిళల పేరుతో చాటింగ్

కోస్టల్ బ్యాంక్ ఎండీ జయరామ్ హత్య కేసులో ప్రధాన నిందితుడు రాకేష్‌రెడ్డి అనేక మంది మహిళలతో సంబంధా లున్నట్లు విచారణలో తేలింది. దీంతో రీనా అనే యువతి పేరుతో ఒక నంబర్ సృష్టించాడని, ఆ నంబర్‌తోనే తరచూ చాటింగ్ చేస్తున్నట్లు తేలింది. జయరామ్ బలహీనతనే ఎరగా వేసి, ఆయన తన వద్దకు వచ్చేలా ప్లాన్ చేసినట్లు సమాచారం. నిందితుడు రాకేష్‌రెడ్డి రీనా పేరిట జయరామ్‌తో చాటింగ్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఎవరూ లేకుండా ఒంటరిగా తన ఇంటికి రావాలని చాటింగ్‌లో రాకేష్‌రెడ్డి కోరాడు. అది రీనా చాటింగ్‌గానే నమ్మిన జయరామ్ ఒంటరిగా వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇదిలావుండగా, తన వద్ద తీసుకున్న రూ.4.50 కోట్ల అప్పు చెల్లించకుండా జయరామ్ తప్పించుకుని తిరుగుతున్నాడని రాకేష్‌రెడ్డి పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవటంతో పక్కా పథకం ప్రకారం రీనా పేరుతో చాటింగ్ చేసి హత్యకు పాల్పడ్డాడు. అనుమానం రాకుండా ఉండేందుకు వాట్సాప్ డీపీలో అందమైన యువతి ఫొటో పెట్టినట్లు పోలీసుల విచారణలో రాకేష్ అంగీకరించినట్లు సమాచారం.

రెండు రోజులపాటు బంధించి

రీనా కోసం వెళ్లిన జయరామ్‌ను రాకేష్‌రెడ్డి రెండు రోజులపాటు తన ఇంట్లోనే బంధించాడు. రాకేష్, అనుచరులు జయరామ్‌ను బలవంతంగా ఇంట్లోకి తీసుకువెళ్లారు. తన డబ్బులు ఇవ్వాలని నిందితుడు ఒత్తిడి చేశాడు. అదే సమయంలో శిఖా చౌదరికి జయరామ్ ఫోన్ చేసి రూ.10 లక్షలు ఇవ్వాలని అడగ్గా, తన వద్ద డబ్బులు లేవని ఆమె చెప్పినట్లు నిందితుడు విచారణలో వెల్లడించాడు. దీంతో కోస్టల్ బ్యాంక్‌లో పని చేసిన మరో మహిళకు కూడా జయరామ్ ఫోన్ చేశారు. అనంతరం అదే బ్యాంకులో పని చేసిన ఈశ్వర ప్రసాద్ చేయగా, ఆయన 31న రూ.6 లక్షలు ఇచ్చినట్లు సమాచారం. ఆ తర్వాతే జయరామ్‌ను హత్య చేసినట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు.

రాకేష్‌ను ఇరికించారు : తండ్రి ఆరోపణ

ఎన్‌ఆర్‌ఐ జయరామ్ హత్య కేసులో తన కొడుకును కుట్రపన్ని ఇరికించారని రాకేష్‌రెడ్డి తండ్రి ఆరోపిస్తున్నారు. నందిగామలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేయాలని డిమాండు చేశారు. రాకేష్‌కు అసలు జయరామ్ ఎవరో కూడా తెలియదన్నారు. తన కుమారుడు ఇతరులకు సహాయం చేస్తాడేగానీ, ప్రాణాలు తీసేవ్యక్తికాదన్నారు. శిఖా చౌదరి పరిచయమైన తర్వాతే పూర్తిగా మారిపోనట్లు తెలిపారు. అప్పటి నుంచి ఇంటికి కూడా రావటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

త్వరలో పెండింగ్ నోటిఫికేషన్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: త్వరలో ఏపీపీఎస్సీ ద్వారా మరిన్ని నోటిఫికేషన్లు విడుదల చేస్తాని చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్ సోమవారం తెలిపారు. వివిధ అంశాలపై అనుమతులకోసం జనవరి మొదటి వారంలో ప్రభుత్వానికి లేఖరాశామని గుర్తుచేశారు. దాదాపు 1500 పోస్టులకు చెందిన నోటిఫికేషన్లు వివిధ ప్రభుత్వశాఖల అధిపతుల కోసం లేఖలు రాశామని తెలిపారు. ప్రభుత్వం అనుమతి రాగానే శాఖల వారీగా నోటిఫికేషన్లు విడుదలకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భువనేశ్వరిలో యూపీఎస్సీ సమావేశానికి చైర్మన్ హాజరు

భువనేశ్వరిలో యూపీఎస్సీ ఆధ్వర్యాన నిర్వహించిన ఆల్ ఇండియా స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సమావేశానికి ఏపీపీఎస్సీ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్ హాజరయ్యారు. రాష్ట్రానికి వచ్చిన వెంటనే పెండింగ్ నోటిఫికేషన్లపై దృష్టి కేంద్రీకరిస్తామని ఆయన తెలిపారు.

నేడు రాష్ట్ర బడ్జెట్ (మొదటిపేజీ తరువాయి)

సహాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తున్నందున ఇందుకోసం బడ్జెట్‌లో కేటాయింపులు పెంచనున్నారు. అన్నదాతా సుఖీభవ పేరుతో రైతులకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు ప్రభుత్వం ఇప్పటికే భారీ పథకానికి రూపకల్పన చేసింది. దీనిలోభాగంగా రైతులకు తక్షణ సాయంగా రూ.2,500 చెల్లిస్తారు. రాష్ట్రంలో దాదాపు 2కోట్ల ఎకరాలకు ఖరీఫ్, రబీ సీజన్‌లలో దశలవారీగా చెల్లించనున్న ఈ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు చేసి ప్రకటించే అవకాశం వుంది. అలాగే నిరుద్యోగులకు ప్రస్తుతం రూ.1000 భృతి చెల్లిస్తుండగా, దీనిని కూడా రెట్టింపు చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్‌లకు నిధుల కేటాయింపు పెంచడం, మైనార్టీ, వివిధ కార్పోరేషన్లకు నిధులు పెంచనున్నారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అన్ని వర్గాలను సంతృప్తి పర్చేలా ఎన్నికల బడ్జెట్ కూర్పుకు ప్రభుత్వం పెద్దఎత్తున కసరత్తు నిర్వహించింది.

క్రీడలు

ప్రపంచకప్ సన్నద్ధత కోసమే..



వెల్లింగ్టన్: ప్రపంచకప్ టోర్నీకి సన్నద్ధమవ్వడంలో భాగంగా కఠిన పిచ్‌లపై ఆడాలని భావించినట్టు టీమిండియా తాత్కాలిక సారథి రోహిత్ శర్మ తెలిపాడు. అందుకే న్యూజిలాండ్‌తో ఐదో వన్డేలో తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నానని తెలిపాడు. కివీస్‌పై 4-1తో సిరీస్ గెలిచిన తర్వాత అతడు మీడియాతో మాట్లాడాడు. 'టాస్‌కు ముందు పిచ్‌ను పరిశీలించా. అక్కడున్న తేమ తొలుత పేసర్లకు సహకరిస్తుందని ముందే తెలుసు. ప్రపంచకప్ మ్యాచుల్లో కఠిన పరిస్థితులు ఉంటాయి కాబట్టి వాటినెలా ఎదుర్కోవాలో ఇక్కడ చూడాలని భావించాం. నిజమే.. మేం త్వరగా నాలుగు వికెట్లు చేజార్చుకున్నాం. పరిస్థితులు బాగాలేనప్పుడు, బంతి స్వింగ్ అవుతున్నప్పుడు ఎలా బ్యాటింగ్ చేయాలో నేర్చుకోవడానికి ఇది ఉపయోపగడింది. ఇలా పరిస్థితులు ఎదురైనప్పుడు ఎలా ఆడాలో ఆటగాళ్లు ఇప్పుడు తెలుసుకున్నారు. 30 ఓవర్ల వరకు మా రన్‌రేట్ బాలేదు. అయినా 250 స్కోరు అందుకోవడం సానుకూల అంశం. సమతూకంతో, పటిష్ఠంగా ఉన్న కివీస్‌పై 4-1 తేడాతో వన్డే సిరీస్ గెలవడం అద్భుతం. వచ్చిన రెండు అవకాశాలను అందిపుచ్చుకోవడంలో విఫలమైనా శుభ్‌మన్ గిల్ నేర్చుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. భారత్‌లో అందరూ రాణించారు' అని రోహిత్ పేర్కొన్నాడు.

రెండు ఇన్నింగ్స్‌లో ద్విశతకాలు



కొలంబో: శ్రీలంక క్రికెటర్ ఏంజెలో పెరీరా అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఒకే మ్యాచ్‌లో రెండు డబుల్ సెంచరీలు సాధించిన రెండో క్రికెటర్‌గా నిలిచాడు. శ్రీలంక దేశవాళీ క్రికెట్‌లో భాగంగా నాండే స్క్రిప్ట్స్‌కు సారథిగా వ్యవహరిస్తున్న పెరీరా.. అద్భుతమైన బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులు చేసిన పెరీరా.. రెండో ఇన్నింగ్స్‌లో 231 పరుగుల వ్యక్తిగత స్కోరు సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 203 బంతులను ఎదుర్కొని 20 ఫోర్లు, 1 సిక్సర్ సాయంతో డబుల్ సెంచరీ సాధించాడు. ఇక్కడ అతని స్ట్రైక్‌రేట్ దాదాపు వంద ఉండటం విశేషం. ఆపై రెండో ఇన్నింగ్స్‌లో 268 బంతుల్లో 20 ఫోర్లు, 3 సిక్సర్లతో 231 పరుగుల్ని నమోదు చేశాడు. ఫలితంగా ఒకే మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ద్విశతకాలు సాధించిన రెండో క్రికెటర్‌గా పెరీరా గుర్తింపు సాధించాడు. అంతకుముందు 1938లో ఇంగ్లిష్ క్రికెటర్ ఆర్థర్ ఫాగ్ ఒకే మ్యాచ్‌లో రెండు ద్విశతకాలు సాధించాడు. ఆ తర్వాత ఇంతకాలానికి ఆ ఫీట్‌ను పెరీరా అందుకున్నాడు. 2013లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్ ద్వారా వన్డేల్లో అరంగేట్రం చేసిన పెరీరా.. ఇప్పటివరకూ కేవలం నాలుగు వన్డేలు, రెండు టీ20లు మాత్రమే ఆడాడు. అతను చివరగా ఆస్ట్రేలియాతో 2016లో జరిగిన సిరీస్‌లో లంక తరపున కనిపించాడు. ఇక ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో 97 మ్యాచ్‌లు ఆడిన పెరీరా 18 సెంచరీలు, 33 హాఫ్ సెంచరీలతో 6,941 పరుగులు చేశాడు.

కివీస్‌కు ఎదురుదెబ్బ..!



వెల్లింగ్టన్: ఇప్పటికే టీమిండియాతో వన్డే సిరీస్‌ను కోల్పోయిన న్యూజిలాండ్‌కు మరో ఎదురుదెబ్బ తగలింది. భారత్‌తో జరుగబోయే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు స్టార్ ఆటగాడు మార్టిన్ గప్టిల్ దూరమయ్యాడు. వెన్ను నొప్పితో బాధపడుతున్న గప్టిల్.. టీ20 సిరీస్ మొత్తానికి దూరమవుతున్నాడని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. అతని స్థానంలో జేమ్స్ నీషమ్‌ను జట్టులోకి తీసుకున్నారు. తొలుత ప్రకటించిన టీ20 జాబితాలో నీషమ్ లేకపోయినప్పటికీ, గప్టిల్ గాయం కారణంగా అతన్ని ఉన్నపళంగా జట్టులోకి తీసుకున్నారు. భారత్‌తో చివరిదైన ఐదో వన్డేకు గప్టిల్ దూరమైన సంగతి తెలిసిందే. అతడు కోలుకోవడానికి మరి కొంతసమయం పట్టే అవకాశం ఉండటంతో టీ20 సిరీస్‌కు సైతం దూరం కావాల్సి వస్తోందని కివీస్ కోచ్ గ్యారీ స్టీడ్ తెలిపాడు. 'టీ20 సిరీస్‌కు గప్టిల్‌కు అందుబాటులో లేకపోవడం దురదృష్టకరం. ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్ ఐదురోజుల వ్యవధిలోనే ముగియనుంది. ఈ వ్యవధిలో గప్టిల్ కోలుకోవడం కష్టం. దాంతో అతనికి సిరీస్ నుంచి విశ్రాంతి నిచ్చాం. ఈనెల 13 నుంచి బంగ్లాదేశ్‌తో ఆరంభమయ్యే వన్డే సిరీస్ నాటికి గప్టిల్ జట్టుతో కలిసే అవకాశం ఉంది' అని గ్యారీ స్టీడ్ పేర్కొన్నాడు. భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య బుధవారం నుంచి టీ20 సిరీస్ ఆరంభం కానుంది. తొలి టీ20 ఫిబ్రవరి6వ తేదీన వెల్లింగ్టన్ వేదికగా జరుగుతుండగా, ఫిబ్రవరి 8వ తేదీన ఆక్లాండ్ వేదికగా రెండో టీ20,

ఆసీస్ క్లీన్‌స్వీప్

- లంకపై 2-0తో సిరీస్ విజయం



కాన్‌బెర్రా: శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్ చేసింది. రెండో టెస్టులో ఆస్ట్రేలియా 366 పరుగుల తేడాతో భారీ విజయాన్ని సాధించింది. ఫలితంగా సిరీస్‌ను 2-0తో వైట్‌వాష్ చేసింది. ఆసీస్ నిర్దేశించిన 516 పరుగుల లక్ష్యఛేదనలో శ్రీలంక 149 పరుగులకే కుప్పకూలింది. 17/0 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన శ్రీలంక.. ఆసీస్ బౌలర్ మిచెల్ స్టార్క్ దెబ్బకు చేతులెత్తేసింది. స్టార్క్ ఐదు వికెట్లతో చెలరేగి లంక పతనాన్ని శాసించాడు. ప్యాట్ కమిన్స్ మూడు వికెట్లతో మెరిశాడు. కుశాల్ మెండిస్(42), లహిరు తిరుమన్నే(30)లు మాత్రమే రాణించడంతో శ్రీలంకకు ఘోర ఓటమి తప్పలేదు. తొలి ఇన్నింగ్స్‌లో సైతం స్టార్క్ ఐదు వికెట్లతో రాణించాడు. దాంతో ఈ మ్యాచ్‌లో మొత్తం 10 వికెట్లను స్టార్క్ ఖాతాలో వేసుకున్నాడు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 534/5 డిక్లేర్ చేయగా..బదులుగా శ్రీలంక 215 పరుగులకు ఆలౌటయ్యింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 3 వికెట్లకు 196 పరుగులకు డిక్లేర్ చేసి శ్రీలంక ముందు 516 పరుగుల భారీ టార్గెట్ నిలిపింది.

కోహ్లి నెం.1..!

- టీమిండియా నెం.2
- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ విడుదల



ముంబై : ఐసీసీ ప్రకటించిన తాజా వన్డే ర్యాకింగ్స్‌లో టీమిండియా రెండో స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనల్లో టీమిండియా వన్డే సిరీస్‌లను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో టీమిండియా 122 రేటింగ్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో ఇంగ్లాండ్ 126 రేటింగ్‌తో తొలి స్థానంలో ఉండగా దక్షిణాఫ్రికా మూడో స్థానంలో ఉంది. బ్యాట్స్‌మెన్ జాబితాలో టీమిండియా సారథి విరాట్ 887 రేటింగ్‌తో తొలి స్థానంలో, తాత్కాలిక సారథి రోహిత్ శర్మ 854రేటింగ్‌తో రెండో స్థానాల్లో కొనసాగుతున్నారు. వీరిద్దరి తర్వాత న్యూజిలాండ్ ఆటగాడు రాస్ టేలర్ మూడో స్థానంలో ఉన్నాడు. పదో స్థానంలో శిఖర్ ధావన్ నిలిచాడు. ఎంఎస్ ధోనీ 17వ స్థానంలో, కేదార్ జాదవ్ ఎనిమిది స్థానాలు మెరుగు పరుచుకుని 35వ స్థానంలో ఉన్నాడు. బౌలింగ్ విభాగంలో టీమిండియా బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు. నాలుగో స్థానంలో కుల్‌దీప్ ఉండగా, చాహల్ ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. భువనేశ్వర్ కుమార్ 17వ స్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్ సిరీస్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపి 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' దక్కించుకున్న మహమ్మద్ షమీ తన స్థానాలను మెరుగు పరుచుకుని 30 స్థానంలో నిలిచాడు.



ధోనీతో జాగ్రత్త : ఐసీసీ

ముంబై : 'వికెట్ల వెనక ధోనీ ఉన్నప్పుడు ఆటగాళ్లు క్రీజు వదలొద్దు' అంటూ ఐసీసీ ట్వీట్ చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన ఆఖరి వన్డేలో ధోనీ మరోసారి తన సమయస్ఫూర్తిని ప్రదర్శించిన విషయం తెలిసిందే. నీషమ్ బంతిని ఆడేందుకు ముందుకు రాగా అది కాళ్లకు తగిలి వికెట్ల వెనక్కి వెళ్లింది. దీంతో ఎల్బీడబ్ల్యూ అప్పీల్ చేశారు. వెంటనే తేరుకున్న నీషమ్ వెనక్కి వెళ్లేలోపు ధోనీ రెప్పపాటు వేగంతో వికెట్లను గిరాటేసి పెవిలియన్‌కు పంపాడు. దీంతో నీషమ్ ఆశ్చర్యపోతూ.. పిచ్‌ను వదిలాడు. ఆ రనౌటే మ్యాచ్‌ను కీలక మలుపు తిప్పింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. దీన్ని ఉద్దేశిస్తూ.. ఓ క్రీడాభిమాని చేసిన ట్వీట్‌కు ఐసీసీ స్పందిస్తూ.. 'ధోనీ వికెట్ల వెనక ఉన్నప్పుడు మీరు క్రీజును వదలొద్దు'' అంటూ ట్వీట్ చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 4-1తో సిరీస్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా బుధవారం తొలి మ్యాచ్ జరగనుంది.

సాక్ష్యాలతో రండి ...!

సీబీఐకి సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : శారదా కుంభకోణం దర్యాప్తులో భాగంగా కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ తమకు లొంగిపోయేలా ఆదేశించాలని సీబీఐ చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆయన సాక్ష్యాలను ధ్వంసం చేశారనే ఆరోపణకు చిన్న సాక్ష్యం కూడా సీబీఐ కోర్టులో ప్రవేశపెట్టలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. పూర్తి ఆధారాలతో మంగళవారం ఉదయం 10.30 గంటలకు కోర్టుకు రావాలని ధర్మాసనం సీబీఐని ఆదేశించింది. శారదా కుంభకోణం కేసులో కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను ప్రశ్నించేందుకు ఆదివారం రాత్రి సీబీఐ అధికారులు ప్రయత్నించారు. ఐతే పశ్చిమ బెంగాల్ పోలీసులు సీబీఐ అధికారులను అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తాజా పరిణామాలను సీబీఐ అధికారులు సోమవారం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దర్యాప్తునకు సహకరించేలా సీపీ రాజీవ్ కుమార్‌ను ఆదేశించాలని కోరుతూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించి రాజీవ్‌కుమార్‌కు పలుమార్లు సమన్లు జారీ చేశామని సీబీఐ తమ పిటిషన్‌లో పేర్కొంది. వాటికి ఆయన స్పందించలేదు సరికదా.. సాక్ష్యాలను నాశనం చేసే ప్రయత్నం చేస్తున్నారని సీబీఐ ఆరోపించింది. రాజీవ్‌కుమార్‌ను ప్రశ్నించేందుకు వెళ్లిన సీబీఐ అధికారులను అక్కడి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారని పేర్కొంది. సీపీ వెంటనే లొంగిపోయేలా ఆదేశించాలని కోరింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ పిటిషన్‌పై నేడు అత్యవసర విచారణ చేపట్టాలని తుషార్ కోర్టుకు విన్నవించారు. ఇందుకు న్యాయస్థానం నిరాకరించింది. రాజీవ్ కుమార్‌పై ఆరోపణలకు సంబంధించి ప్రస్తుతం ఎలాంటి రుజువులు లేనందున ఈ కేసును మంగళవారం విచారిస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్, న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ఆధ్వర్యంలోని ధర్మాసనం తెలిపింది. ఐతే, రాజీవ్ కుమార్ సాక్ష్యాలను ధ్వంసం చేశారనే ఆరోపణకు విశ్వాసం లేదని, కనీసం ఒక్క సాక్ష్యాన్ని కూడా ఎందుకు ప్రవేశపెట్టలేదని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. నిజంగా ఎలక్ట్రానిక్ పరికరాలను ఆయన ధ్వంస చేసి ఉంటే, సమాచారాన్ని తిరిగి రాబట్టటం కష్టమైన పని కాదని, ఆయన తప్పు చేస్తే తప్పని సరిగా చర్య తీసుకోవాల్సిందేనని, కానీ ఇందుకు సాక్ష్యాలు అవసరమని ధర్మాసనం స్పష్టం చేసింది.

కేంద్ర హోం మంత్రి ఆరా...గవర్నర్ నివేదిక...!

శారదా కుంభకోణం దర్యాప్తు నేపథ్యంలో కోల్‌కతాలో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సమీక్ష చేపట్టింది. ఈ విషయమై పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠితో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఫోన్లో మాట్లాడారు. తాజా పరిస్థితులపై తక్షణమే నివేదిక ఇవ్వాలని బెంగాల్ చీఫ్ సెక్రటరీ, డీజీపీని ఆదేశించినట్లు తెలిపాయి. సీబీఐ అధికారులను నిర్బంధించడంపై పూర్తి వివరాలు తెలుసుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ గవర్నర్‌కు సూచించారు. ఈ విషయమై తాను ఇప్పటికే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు సమన్లు జారీ చేశానని, పరిస్థితిని చక్కదిద్దేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు గవర్నర్ త్రిపాఠి తెలిపారు.

మోడీ పాలనలో రాజ్యాంగ సంస్థల ధ్వంసం

- పడగవిప్పిన మతోన్మాదం
- ప్రభుత్వ విధానాలపై విసిగిపోయిన ప్రజలు
- సురవరం సుధాకరరెడ్డి విమర్శ



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి విమర్శించారు. స్వయం ప్రతిపత్తితో పనిచేయాల్సిన రాజ్యాంగ సంస్థలు కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా మారిపోయాయని అన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో సోమవారం జరిగిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో సుధాకరరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్డీయే పాలనలో సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ), ఎన్నికల కమిషన్, నీతి ఆయోగ్ వంటి రాజ్యాంగ సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై పంపుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ అవుతున్నాయన్నారు. ఎన్డీయే పాలనలో మతోన్మాదం పడగ విప్పుతోందని, మైనారిటీలు, దళితులపైన పదే, పదే దాడులు చేస్తోందని విమర్శించారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని ప్రజలకు సురవరం పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో కురిసిన వర్షాల వల్ల రైతులకు పంట నష్టం జరిగిందన్నారు. మార్కెట్‌లలో మిర్చి, కందులు, పత్తి తడిసి పోయి రూ.2 వేల కోట్ల పంట నష్టం జరిగిందనీ, నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావస్తున్న కేసీఆర్ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయకుండా నియంతపాలన కొనసాగించడం అప్రజాస్వామ్యమని అన్నారు. మంత్రి వర్గం లేకపోవడంతో పాలన కుంటుపడుతుందని, తక్షణమే మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో సీపీఐ ఎన్నికలకు సిద్ధమవుతోందని చెప్పారు. ఖమ్మం లేదా మహబూబాబాద్, నల్లగొండ లేదా భువనగిరి పార్లమెంట్ స్థానాల నుంచి పోటీ చేసేందుకు సన్నద్ధం అవుతున్నామని తెలిపారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్‌పాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, కార్యదర్శివర్గసభ్యులు గుండా మల్లేష్, ఈర్ల నర్సింహ్మా, పశ్యపద్మ, తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఎన్.బాలమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేవీఎస్ఎన్ మూర్తి, కొణతాల రామకృష్ణ తదితరులు

విభజన హామీల అమల్లో కేంద్రం నిర్లక్ష్యం

రైల్వేజోన్ సాధన సమితి కన్వీనర్ జేవీఎస్ఎన్ మూర్తి

విశాలాంధ్ర-విశాఖ సిటీ బ్యూరో : రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలు అమల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విశాఖ రైల్వేజోన్ సాధన సమితి కన్వీనర్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణతో కలిసి సోమవారం ఉదయం విశాఖలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీల అమలు, వాటి ప్రస్తుత స్థితిగతులపై స్వతంత్ర నిపుణుల బృందం ఒక నివేదికను ఇటీవల కేంద్రానికి అందజేసిందన్నారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలు కనీసం అమలుచేయలేదని ఈ నివేదికలో కేంద్రానికి తెలిపిందని చెప్పారు. గత నెల 29న ఉత్తరాధ్ర చర్చావేదిక ఆధ్వర్యంలో విశాఖ నుంచి రైలుఘోష యాత్ర పేరుతో ఢిల్లీ వెళ్లి విభజన సమయంలో రాష్ట్రానికి ఇస్తామన్న హామీలు తక్షణమే నెరవేర్చాలని ఉప రాష్ట్రపతితో పాటు వివిధ పార్టీల నాయకులు, రాష్ట్రానికి చెందిన ఎంపీలను కలసి విజ్ఞప్తి చేశామని మూర్తి తెలిపారు. కొణతాల మాట్లాడుతూ విభజన హామీల్లో భాగంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తగినన్ని నిధులు విడుదల చేయకపోవడంతోఉత్తరాధ్ర జిల్లాలు ఎంతో వెనుకబడి ఉన్నాయన్నారు. దుగ్గరాజపట్నం పోర్టు నిర్మాణం రూ. 8వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినా ఇప్పటికీ నిధులు మంజూరు చేయకపోవడంతో వీటి పనులుకూడా ముందుకు సాగడంలేదని తెలిపారు. ఇప్పటికైనా విభజన సమయంలో ఇస్తామన్న ప్రత్యేక హోదాతో పాటు విభజనహామీలు తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర రక్షణ వేదిక అధ్యక్షుడు శివశంకర్‌తో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండపల్లికి పూర్వ వైభవం: సీఎం

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: కొండపల్లి ఖిల్లాకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చి, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్టు సీఎం చంద్రబాబు తెలిపారు. పునరుద్ధరించిన కొండపల్లి ఖిల్లాను సోమవారం ఆయన ప్రారంభించారు. ఎంతో చరిత్ర గల కొండపల్లి ఖిల్లాను రాబోయే నాలుగైదేళ్లలో రూ.100 కోట్లతో బ్రహ్మాండమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కొండపల్లి ఫోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేసి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే రూ.10.90 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రహదారుల ఏర్పాటు, కొండపల్లి ఖిల్లాకు మెట్లదారి వంటి అభివృద్ధి పనులను ఆర్కియాలజీ, మ్యూజియం, పురావస్తు శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తాయన్నారు. ఖిల్లాలోని రాజ దర్బారును ఆనాటి రాజులు పరిపాలించనట్లుగా విద్యుద్దీపాల వెలుగులతో సుందరంగా తీర్చిదిద్దారన్నారు. పర్యాటకులను కొండపల్లి ఖిల్లా ఎంతో ఆకర్షిస్తుందని, చిన్నారుల వినోదం కోసం గుర్రం, ఒంటె స్వారీ, హెలికాప్టర్ రైడింగ్, బెలూన్ వంటి పనులు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

కొండపల్లి బొమ్మలు తెలుగుదనానికి చక్కని బ్రాండ్ అని, నాణ్యతతో కూడిన ఈ బొమ్మలకు దేశ, విదేశాల్లో బహుళ ప్రాచుర్యం ఉందని తెలిపారు. ఖిల్లా పరివాహక ప్రాంతంలో 25,500 ఎకరాల భూమి ఉందని బ్రహ్మాండమైన చెట్లను పెంచుతూ ఆదర్శనీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. అమరావతని, పవిత్ర సంగమం, కూచిపూడి ఐకానిక్ వంతెన, కొండపల్లి ఖిల్లా, మచిలీపట్నం బీచ్, అవనిగడ్డ వద్ద సాగర సంగమం వంటి ప్రదేశాలుతో టూరిజంకు కావలిసిన అన్ని వసతులను సమకూర్చి భవిష్యత్‌లో ఈ ప్రాంతాలను బ్రహ్మాండమైన పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నట్లు సీఎం వివరించారు.



కొండపల్లి ఖిల్లా నమూనాను పరిశీలిస్తున్న చంద్రబాబు. చిత్రంలో వాణీమోహన్, లక్ష్మీకాంతం, దేవినేని ఉమా

లేజర్ షో ప్రారంభం

పర్యాటక శాఖ రూపొందించిన త్రీడీ లేజర్ షోను దేవినేని ఉమతో కలిసి చంద్రబాబు ప్రారంభించి, తిలకించారు. కొండపల్లి ఖిల్లా చరిత్రను తెలిజెప్పే బ్రోచర్, పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. తొలుత ఖిల్లాపై ఉన్న చారిత్రక హజరాత్ సయ్యద్ గాలిబ్ షహీద్ రెహ్మతుల్లా దర్గాను సందర్శించారు. విద్యుద్దీపాలతో సుందరంగా ఉన్న రాజదర్బారును వీక్షించారు. డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి రచించిన 'కొండపల్లి చారిత్రక వైభవం' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, గేయాలు, కీర్తనలు ఆకట్టుకున్నాయి. పురావస్తుశాఖ కమిషనర్ వాణీమోహన్, టూరిజం అండ్ కల్చర్ కార్యదర్శి మీనా, కలెక్టర్ బీ లక్ష్మీకాంతం, జేసీ-2 బాబురావు, టూరిజం ఈడీ మల్లిఖార్జునరావు, కేఆర్‌సీసీ డిప్యూటి కలెక్టర్ ఎం.చక్రపాణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఖాజావలి పాల్గొన్నారు.

మాల్యా అప్పగింతకు లైన్‌క్లియర్



లండన్ : బ్యాంకు రుణాలు తీసుకొని చెల్లించకుండా బ్రిటన్‌కు పారిపోయిన విజయ్‌మాల్యాను భారత్‌కు తిరిగి అప్పగించేందుకు యూకే హోంమంత్రిత్వ శాఖ అంగీకారం తెలిపింది. అయితే దీనిపై బ్రిటన్ హైకోర్టుకు అప్పీలు చేసుకునేందుకు మాల్యాకు హోంశాఖ 14 రోజుల గడువు ఇచ్చింది. గతంలో విచారణ జరిపిన దిగువ న్యాయస్థానం మాల్యాను భారత్‌కు అప్పగించవచ్చని సూచించింది. ఈ మేరకు ఆదేశాలను హోంశాఖకు పంపించింది. ఇతర దేశాలకు చెందిన వారు ఆయా దేశాల్లో నేరాలు చేసి ఇంగ్లండ్‌లో ఆశ్రయం పొందితే వారిని వారి దేశాలకు పంపించేందుకు వీలుగా న్యాయస్థానాలు హోంశాఖకు ఆదేశాలు జారీ చేస్తాయి. మాల్యా కేసులోనూ భాగంగా హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆర్థిక నేరగాళ్లను కట్టడి చేసే విధానంలో భాగంగా భారత ప్రభుత్వం చట్టం తీసుకువచ్చింది. దీని ప్రకారం మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించిన విషయం తెలిసిందే.

పీఎం కిసాన్‌కు ఆధార్ ఉండాల్సిందే

న్యూఢిల్లీ: రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధి చేకూరాలంటే ఆధార్ తప్పనిసరిగా ఉండాలని అధికారులు తెలిపారు. చిన్న, మధ్య తరహా రైతులకు ఆర్థిక సహకారం అందజేయడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. దీనికి కింద రైతులకు ఏడాదికి రూ.6వేలు అందజేస్తారు. మూడు విడతల్లో లబ్ధిదారులకు ఈ నగదు అందనుంది. ఈ లబ్ధి చేకూరాలంటే రైతులు ఆధార్‌ను తప్పనిసరిగా ఉండాలి. గుర్తింపు నిరూపించుకునేందుకు రైతులు ఆధార్ నెంబరును ఇవ్వాల్సి ఉంది. డిసెంబరు 2018-మార్చి 2019 వరకు తొలి విడత కింద రూ.2వేలను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ఆధార్ నెంబరును ఆప్షనల్‌గా ఇచ్చారు. కానీ రెండో విడత నగదు బ్యాంకు ఖాతాల్లో వేయాలంటే అందుకు ఆధార్ నెంబరు తప్పనిసరి అని కేంద్ర వ్యవసాయమంత్రిత్వ శాఖ వెల్లడించింది. మొదట విడత నగదు పొందేందుకు ఆధార్‌కు బదులుగా డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ కార్డు, ఎన్ఆర్ఈజీఏ జాబ్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డులు ఏమైనా ఉన్న సరిపోతుంది. రెండో విడత నగదు పొందాలంటే మాత్రం తప్పనిసరిగా ఆధార్ నెంబరును అధికారులు తీసుకోవాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.